

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 293

శనివారం 13-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం

విత్తనం నుండి పంట విక్రయం వరకు రైతన్నలకు అన్ని సేవలు గడప వద్దనే అందించే వన్‌స్టాప్ సెంటర్లుగా 10,778 రైతు భరోసా కేంద్రాలు



గ్రామ సచివాలయం

గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ గడప వద్దకే 540కి పైగా ప్రభుత్వ సేవలు అందించేలా 15,004 గ్రామ/వార్డు సచివాలయాలు.. 1,35,819 మంది శాశ్వత ఉద్యోగులు, 2.60 లక్షల మంది వాలంటీర్ల ద్వారా సేవలు..



డా౹౹ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

2,500 మంది జనాభాకు ఒకటి చొప్పున రాష్ట్రంలో మొత్తం 10,132 విలేజ్ హెల్త్ క్లినిక్ లు.. ఉచిత వైద్యసేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానం..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి



మనబడి "నాడు -నేడు"

కార్పొరేట్ స్కూళ్లే ప్రభుత్వ బడులతో పోటీ పడేలా ఇంగ్లీషు మీడియం, డిజిటల్ బోధనతో మన విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దుతూ రూ.17,805 కోట్ల ఖర్చుతో రాష్ట్రంలోని 56,703 విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఆధునికీకరణ మూడు దశల్లో.. 8వ తరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబులు.. బై లింగువల్ టెక్స్ట్ బుక్స్, బైజూస్ కంటెంట్.. జగనన్న గోరుముద్ద, విద్యా కానుక..



అంగన్వాడీ కేంద్రం

పిల్లలు, గర్భిణీలు, బాలింతల పోషణ, బంగారు భవిష్యత్తుకు రక్షణ కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు.. నాడు-నేడు ద్వారా అంగన్‌వాడీల్లో మంచి వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా వేగంగా అడుగులు.. సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ ద్వారా బలవర్ధక ఆహారం..



వాలంటీర్ల సేవలు

దరఖాస్తు చేసుకోవడం నుండి లబ్ధి పొందే వరకు లబ్ధిదారుల చేయి పట్టుకొని నడిపిస్తూ వారి గడప వద్దనే సేవలు అందిస్తున్న 2.60 లక్షల మంది వాలంటీర్లు..



వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ

వర్క్ ఫ్రమ్ హోం కాన్సెప్ట్‌ను బలోపేతం చేసే దిశగా, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతకు 12,979 పంచాయతీల్లో కడుతున్న వైఎస్సార్ విలేజ్ డిజిటల్ లైబ్రరీలు, అన్‌లిమిటెడ్ బ్యాండ్ విడ్త్‌తో..

మారిన పల్లె ముఖ చిత్రం.. గ్రామ ప్రగతికి సోపానం...

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఆధ్యాత్మిక నగరం.. అభివృద్ధికి ప్రతిరూపం

(తిరుమల రవిరెడ్డి, సాక్షి, తిరుపతి)

ఆధ్యాత్మిక నగరంగా భాసిల్లుతున్న తిరుపతి నగరం ఇప్పుడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. తెలుగునేల ఖ్యాతి విశ్వాంతరాలకు విస్తరించడానికి దోహద పడింది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఆతిథ్యమిస్తున్న ఈ నగరం ఒకప్పుడు గుంతల మయంగా... అస్తవ్యస్త డ్రైనేజీలతో దుర్గంధం వెదజల్లుతూ... ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద సంఖ్యలో భక్తులను తీసుకొచ్చే వాహనాలను కదలనీయని ట్రాఫిక్ కష్టాలతో నరక ప్రాయంగా మారగా... గడచిన ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చెందింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధతో నగరవాసుల తోపాటు... వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పడుతున్న ఇబ్బందులనుంచి ఉపశమనం కలిగించింది. అత్యంత పొడవైన శ్రీనివాస సేతు నగరానికే ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. రోడ్లు విశాలమయ్యాయి. కూడళ్లన్నీ ఆకర్షణీయంగా మారాయి. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు నెలకొల్పడంతో విద్యారంగం మరింత పురోగమిస్తోంది.


'కచ్చపి' ఆడిటోరియం



నగర వివరాలు:
- విస్తీర్ణం: 30.01చ.కి.మీ.
- గృహాలు: 92 వేలు
- జనాభా: 4.01లక్షలు
- డివిజన్లు: 50
- రోజూ తిరుపతికి వచ్చి వెళ్లే వారి సంఖ్య సుమారు 1.50 లక్షల మంది

నగరంలో అభివృద్ధి పనులు ఇలా..

- మహతి ఆడిటోరియం, 'కచ్చపి' ఆడిటోరియం నిర్మాణం: రూ.45 కోట్లు
- అలిపిరి డిపో నుంచి నడుపుతున్న విద్యుత్ బస్సులు: 100
- తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం: రూ.11.75 కోట్లు
- నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు: రూ.21.97 కోట్లు
- శ్రీవారి వైభవం చాటిచెప్పేలా రైల్వే స్టేషన్‌లో ఆధునిక డిజైన్లు: రూ. 310 కోట్లు

నాలుగున్నరేళ్లలో వెచ్చించిన నిధులు

- శ్రీనివాస సేతు నిర్మాణం: రూ.650.50 కోట్లు
- విద్యుత్ సరఫరా, అండర్ గ్రౌండ్ కేబుల్: రూ.147 కోట్లు
- తాగునీటి సరఫరా: రూ.28.17 కోట్లు
- శ్రీనివాస స్పోర్ట్స్, ఇందిరా మైదానం స్పోర్ట్స్ ప్రాంగణం అభివృద్ధి: రూ.12.23 కోట్లు
- ఇండోర్ సబ్ స్టేషన్: రూ.20 కోట్లు
- స్మార్ట్ సిటీ మిషన్ అమలు: రూ.180 కోట్లు
- వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్: రూ.41.80 కోట్లు
- ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు: రూ.17.50 కోట్లు
- సోలార్ వ్యవస్థ: రూ.21.97 కోట్లు
- మల్టీలెవల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణం: రూ.50 కోట్లు
- సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణం: రూ.90 కోట్లు
- డంపింగ్ బయోమైనింగ్: రూ.20 కోట్లు
- కమ్యూనిటీ, ఈ-టాయిలెట్స్, స్కూల్ టాయిలెట్స్: రూ.13 కోట్లు




ప్రకాశం పార్క్

ఐదేళ్ల కాలంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు

- పర్యాటకులను ఆకర్షిస్తున్న తిరుపతి
- విశాలమైన రహదారులు...
- అందంగా తీర్చిదిద్దిన కూడళ్లు...
- మాస్టర్ ప్లాన్, సీసీ రోడ్ల నిర్మాణంతో కొత్తరూపు
- అసంపూర్తి భూగర్భ డ్రైనేజీ పనులకు మోక్షం
- నరకం నుంచి బయటపడిన నగర జనం
- ఐఐటీ, ఐసర్ విద్యా సంస్థలకు ఆతిథ్యం
- ఆధునిక వసతులు సమకూర్చుకున్న చిన్నపిల్లల, క్యాన్సర్ ఆస్పత్రులు
- రూ.650.50 కోట్లతో శ్రీనివాస సేతు నిర్మాణం పూర్తి
- ఫ్లై ఓవర్ నిర్మాణంతో తీరిన ట్రాఫిక్ కష్టాలు

నాడు నరకం



- తిరుపతి పేరుకు ఆధ్యాత్మిక నగరమైనా ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. వీధులన్నీ ఇరుగ్గా, రహదారులన్నీ గతుకులమయంగా ఉండేవి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో రోడ్డుపై ప్రవహించే మురికి నీరు వెదజల్లే దుర్వాసనతో భక్తులు సతమతమయ్యేవారు.
- ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు పచ్చదనం కరువై వెలవెలబోయేవి. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పేరుకే అంతర్జాతీయ విమానాశ్రయమైనా అభివృద్ధి కోలేదు.

నేడు అభివృద్ధికి చిహ్నం



- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్యాత్మిక నగరాన్ని కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి చేసి చూపించింది. తిరుపతిని మహానగరంగా తీర్చిదిద్దింది.
- రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా స్థానికులు, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ సమకూరుస్తున్నాయి.
- గడచిన నాలుగేళ్ల కాలంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్డును అభివృద్ధి చేశారు. మూడవ విడత అభివృద్ధి ప్రణాళికల్లో రూ.132కోట్ల వ్యయంతో 150కి.మీల సీసీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. మరో రూ.30కోట్లతో సుమారు 65కి.మీ మేర బీటీ రోడ్లు నిర్మిస్తున్నారు.
- 2012కు ముందు తిరుపతి నగరం కేవలం 16.27చ.కి.మీ. విస్తీర్ణం కలిగివుండేది. ఇప్పుడు నగర విస్తీర్ణం 30.1చ.కి.మీ.కు చేరుకుంది.
- మాటలకే పరిమితమైన తిరుపతి మాస్టర్‌ప్లాన్ ఈ ప్రభుత్వ హయాంలో అమలుకు నోచుకుంది.
- రోడ్లతో పాటు అందమైన డివైడర్లు, విద్యుత్ వెలుగులు, ఆహ్లాదాన్ని పంచే పచ్చని మొక్కలు, జీబ్రా లైన్లతో నూతన రహదారులు అభివృద్ధి చేశారు.


కలియుగ వైకుంఠం తిరుమలలో..



- రూ.4.90 కోట్లతో శ్రీవారి పుష్కరిణికి ఇత్తడి గ్రిల్స్ ఏర్పాటు.
- మూడో విడత రింగ్ రోడ్డు పనులు.
- రూ.79 కోట్లతో 2,500 మందికి సరిపడేలా పీఏసీ-5 పనులు.
- యాత్రికుల వసతి సముదాయం-3, పద్మనాభ నిలయం అందుబాటులోకి..
- ఇక్కడ దాదాపు 2,400 లాకర్లు అందుబాటులోకి..
- రూ.42.86 కోట్లతో 1400 మందికి వసతి కల్పించే వకుళాదేవిమాత విశ్రాంతి గృహం
- నారాయణగిరి ఉద్యాన వనాల్లో రూ.39.41 కోట్లతో క్యూలైన్లు, మరుగుదొడ్లు
- తిరుమల-తిరుపతి రెండో ఘాట్ రోడ్డులో రూ.18 కోట్లతో ఆర్‌సీసీ క్రాష్ బారియర్లు

తిరునగరి అభివృద్ధికి 'మాస్టర్' ప్లాన్

- రహదారుల నిర్మాణానికి ఖర్చుచేస్తున్న మొత్తం: రూ.70.92 కోట్లు
- మొత్తం రహదారుల విస్తీర్ణం (మీటర్లలో): 18,344 (18.34 కిలోమీటర్లు)



మొత్తం మాస్టర్ ప్లాన్ రహదారులు: 18

- వంద అడుగుల రోడ్లు: 1
- 80 అడుగుల రోడ్లు: 8
- 60 అడుగుల రోడ్లు: 6
- 40 అడుగల రోడ్లు: 3
- అభివృద్ధి చేస్తున్నవి: 3
- అందుబాటులోకి వచ్చినవి: 15

స్మార్ట్ సిటీ పథకం కింద: రూ.1,610 కోట్లు

- కేంద్ర నిధులు: రూ.500 కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వ నిధులు: రూ.500 కోట్లు
- పీపీపీ భాగస్వామ్యం కింద: రూ.610 కోట్లు (టీటీడీ, ఏపీఎస్‌పీడీసీఎల్)



ఆధునిక వసతులతో హృదయాలయం..





- నిరుపేదలకు అత్యంత ఖరీదైన గుండె వైద్యం అందించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్న పిల్లల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని భావించి, టీటీడీ నిధులతో దానిని పూర్తిచేశారు. ఇక్కడ కొద్ది కాలంలోనే 2,160 శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు.
- టీటీడీ కార్డియాక్ కేర్ సెంటర్‌కు శ్రీకారం చుట్టిన సీఎం 2021 సెప్టెంబర్ 11న ప్రారంభించారు.
- అలిపిరి సమీపంలో 6 ఎకరాల విస్తీర్ణంలో రూ.350 కోట్లతో 350 పడకలతో క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించారు.



తిరుపతిలో పూర్తయిన సీసీ రోడ్లు

సంవత్సరం	పొడవు(కి.మీ)	వ్యయం
2021-22	25.86	రూ.23.13 కోట్లు
2022-23	53.77	రూ.48.10 కోట్లు
2023-24	45.56	రూ.40.76 కోట్లు
మొత్తం	125.19	రూ. 111.99 కోట్లు
సంవత్సరం	బీటీ రోడ్లు(కి.మీ)	వ్యయం
2022-23	4.32	రూ. 2.50 కోట్లు
2023-24	27.70	రూ. 16.06 కోట్లు
మొత్తం	32.02	రూ.18.56 కోట్లు

సుందరంగా వినాయక సాగర్



- మురికి కూపంగా ఉన్న వినాయక సాగర్‌ను రూ.42 కోట్లతో అభివృద్ధి.
- శుద్ధిచేసిన నీటిని విడుదల చేసేందుకు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు.
- బోటింగ్ పాయింట్, కిడ్స్ పార్క్, సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఫుడ్ కోర్టు, ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు.
- రూ.1.63 కోట్లతో ప్రకాశం, బైరాగిపట్టెడలోని శ్రీపద్మావతి పార్కుల ఆధునికీకరణ.



మణిహారం శ్రీనివాస సేతు

- రూ. 650 కోట్లతో నగరానికి మణిహారమైన శ్రీనివాస సేతు వంతెనను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.
- వంతెనపై గరుడ పక్షి ఆకారంతో విద్యుత్ స్తంభాలు, పిల్లర్లపై ఆధ్యాత్మిక, చారిత్రక విశేషాలతో కూడిన చిత్రాలను దిద్దారు. పిల్లర్లకు ఇరువైపులా తిరునామాలను ఏర్పాటు చేశారు.

ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు కేంద్రం



- తిరుపతికి కేటాయించిన ఐఐటీ, ఐజర్ విద్యా సంస్థలకు 2014, 2015లో శంకుస్థాపనలు చేసినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణాలు పూర్తయ్యాయి.
- 546 ఎకరాల్లో రూ.1,074 కోట్లతో ఐఐటీ విద్యా సంస్థను నెలకొల్పారు. పలు రాష్ట్రాల నుంచి 2500 మంది విద్యార్థులు, 250 మంది అధ్యాపకులు, 275 మంది సిబ్బందితో 2021లో ప్రారంభమైంది.
- 250 ఎకరాల్లో రూ.137.30 కోట్లతో ఐజర్ విద్యా సంస్థను నెలకొల్పారు. ఇందులో బీఎస్, ఎంయస్ ఇంటిగ్రేటెడ్ కోర్సులతో పాటు పీహెచ్‌డీ కోర్సులను నడుపుతున్నారు.

అతడే ఒక చాలెంజ్

అతనికి పుట్టుకతోనే వినికిడి లోపం. పైగా మాటలు రావు. ఏ భాష సరిగా చదవడం రాదు... రాయడమూ పూర్తిగా రాదు. సైగలతోనే తన భావాలను వ్యక్తంచేస్తాడు. సాధారణ పాఠశాలలోనే చదివాడు. కష్టపడి డిప్లొమా పూర్తిచేశాడు. పదో తరగతి పాసైన తర్వాత తల్లి కొనిచ్చిన స్మార్ట్ ఫోన్‌లో చూసి తనకు ఇష్టమైన క్రికెట్ నేర్చుకున్నాడు. అంతర్జాతీయ బధిరుల క్రికెట్‌లో నంబర్ వన్ బౌలర్‌గా ఎదిగాడు. గంటకు 140 కిలో మీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తూ బ్యాటర్లకు ఒక చాలెంజ్‌గా మారాడు. ఇదీ.. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన బధిరుల అంతర్జాతీయ క్రికెటర్ రావూరి యశ్వంత్ నాయుడు విజయగాథ.


రావూరి యశ్వంత్

అంతర్జాతీయ బధిర క్రికెటర్ యశ్వంత్ జీవితాన్ని మార్చేసిన స్మార్ట్‌ఫోన్

- సెల్‌ఫోన్‌లో క్రికెట్ వీడియోలు చూస్తూ ఆట నేర్చుకున్నాడు
- ఇప్పుడు అంతర్జాతీయ బధిర క్రికెట్ బౌలర్లలో నంబర్ వన్

సాక్షి, అమరావతి: కొండపల్లికి చెందిన రావూరి యశ్వంత్‌నాయుడు స్మార్ట్ ఫోన్‌లో చూస్తూ క్రికెట్ నేర్చుకున్నాడు. మంచి బౌలర్‌గా ఎదిగాడు. ఫోన్‌లో క్రికెట్ పాఠాలు నేర్చుకుంటూ ఉండగా, ఆన్‌లైన్‌లో వచ్చిన చిన్న మెసేజ్ చూసి 2015లో ఢిల్లీలో సెలక్షన్స్‌కు వెళ్లాడు. అప్పుడే తొలిసారిగా బధిరుల జాతీయ జట్టు ఏర్పడటంతోపాటు యశ్వంత్‌కు చోటు దక్కింది. ఆ తర్వాత జట్టులో కీలక సభ్యుడిగా మారాడు. అంతకుముందు ఏపీ తరఫున మ్యాచ్‌లు ఆడాడు.

అప్పులు చేసి అండగా నిలిచిన తల్లి

గత ఏడాది బధిరుల క్రికెట్‌ను బీసీసీఐ దత్తత తీసుకుంది. అప్పటివరకు మ్యాచ్‌లకు వెళితే ఖర్చంతా క్రీడాకారులదే. యశ్వంత్ తండ్రి నాగేశ్వరరావు 2015లో అనారోగ్యంతో చనిపోయారు. నాటి నుంచి అతనిని తల్లి బేబి అన్ని విధాలా ప్రోత్సహించారు. కుమారుడు క్రికెట్ ఆడేందుకు వెళ్లడానికి అప్పులు చేసి డబ్బులిచ్చారు. యశ్వంత్ 20ఏళ్ల వయసులో ఢిల్లీలో జరిగిన తొలి బధిరుల వరల్డ్ కప్‌లో భారత్ తరఫున ఆడాడు. ఆ టోర్నీలో మనదేశం విజేతగా నిలిచింది. సాధారణ అంతర్జాతీయ పేసర్లతో సమానంగా బౌలింగ్ చేయగలిగిన యశ్వంత్ 135 జాతీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 167 వికెట్లు తీశాడు. అయినా యశ్వంత్‌కు మ్యాచ్ ఫీజు ఉండదు. ఒక సిరీస్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిస్తే రూ.1,100 ఇచ్చారు. వరల్డ్ కప్ గెలిచిన జట్టు మొత్తానికి రూ.లక్ష ఇచ్చారు. వరల్డ్ కప్ గెలిచిన సమయంలో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఇచ్చిన విందులో పాల్గొన్నాడు. అతని కుటుంబ సభ్యులకు ఆహ్వానం ఉన్నా డబ్బులు లేక వెళ్లలేకపోయారు. గతంలో యశ్వంత్‌కు రూ.5లక్షలు ఇవ్వాలని శాప్‌ను ప్రభుత్వం ఆదేశిస్తూ లెటర్ ఇచ్చినా డబ్బులు లేవన్నారు.

మెక్‌గ్రాత్ నుంచి మెళకువలు..

గోకరాజు గంగరాజు సహకారంతో 2016లో మంగళగిరిలోని ఏసీఏ స్టేడియంలో యశ్వంత్‌కు కోచింగ్ తీసుకునే అవకాశం దక్కింది. అప్పుడే ఆస్ట్రేలియా దిగ్గజ బౌలర్ గ్లేన్ మెక్‌గ్రాత్ వచ్చారు. ఆయన యశ్వంత్ బౌలింగ్‌ని మెచ్చుకుని ఎన్నో మెళకువలు నేర్పించారు.

స్టెయిన్ నా ఫేవరెట్..

'నాకు అమ్మంటే ఎంతో ఇష్టం. మా అక్క సుమ నా విజయంలో వెన్నంటే ఉంటుంది. సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ నా ఫేవరెట్. బ్యాటింగ్, కోచింగ్‌లో ద్రావిడ్‌ను చూసి ఎంతో నేర్చుకున్నా. ఈ ఏడాది ఖతార్‌లో జరగాల్సిన బధిర టీ20 వరల్డ్ కప్ వాయిదా పడింది. దాని సెలక్షన్స్‌కు వెళ్లే ముందు మంగళగిరి క్రికెట్ అకాడమీలో ప్రాక్టీస్ చేస్తుంటే కుడి మోకాలు వద్ద గాయమైంది. నాలుగు నెలలు రెస్ట్. త్వరలో బంగ్లాదేశ్‌లో ఆసియా కప్, కేరళలో సౌత్ జోన్, జమ్మూ-కశ్మీర్ డెఫ్ ఐపీఎల్‌కు సన్నద్ధమవుతున్నా.' – సైగల ద్వారా వెల్లడించిన రావూరి యశ్వంత్


స్మార్ట్ ఫోన్ మా అబ్బాయి జీవితాన్ని మార్చింది



'స్మార్ట్‌ఫోన్ పిల్లలను చెడగొడుతుందంటారు. మా అబ్బాయిని మాత్రం అంతర్జాతీయ క్రికెటర్‌గా తీర్చిదిద్దింది. మావాడికి పుట్టకతోనే వినికిడి లోపం. పైగా మాటలు రావు. వాడు 10వ తరగతి పాసైన తర్వాత ఒక చిన్న స్మార్ట్ ఫోన్ కొనిచ్చా. దానిలో వీడియోలు చూస్తూ అంతర్జాతీయ బధిర క్రికెట్ బౌలర్లలో నంబర్ వన్‌గా ఎదిగాడు. ఇప్పుడు నా కొడుకు ఆటను నేను స్మార్ట్ ఫోన్‌లో చూస్తున్నాను.'
– బేబి, అంతర్జాతీయ క్రికెటర్ రావూరి యశ్వంత్ తల్లి

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 293
శనివారం 13-1-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'




'ఆకాశ్‌-ఎన్‌జీ' విజయవంతం
దేశ సైనిక సంపత్తిని బలోపేతం చేసే ఆకాశ్‌-ఎన్‌జీ క్షిపణి ప్రయోగ పరీక్ష విజయవంతమైనట్లు రక్షణ శాఖ తెలిపింది.
వివరాలు 6లో ▸



హౌతీలపై అమెరికా దాడులు
హౌతీ ఉగ్రవాద ముఠాపై అమెరికా, బ్రిటన్‌లు విరుచుకుపడి ఆవాసాలు, ఆయుధాగారాలపై బాంబు దాడులు జరిపాయి.
వివరాలు 6లో ▸



ఆ బాధ్యత యువతదే..
వారసత్వ రాజకీయాల ప్రభావాన్ని తగ్గించాల్సిన బాధ్యత యువతరంపై ఉందని ప్రధాని మోదీ సూచించారు.
వివరాలు 6లో ▸



శుక్రవారం రాత్రి విద్యుత్‌ వెలుగుల్లో అటల్‌ సేతు..
6లో

అందరికీ 'ఆరోగ్యం'



- ఆరోగ్యశ్రీ సేవలు తెలియని వారు ఒక్కరూ ఉండకూడదు: సీఎం జగన్‌
- ఎలా పొందాలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి
- ఉచిత వైద్యాన్ని రూ.25 లక్షలకు పెంచడంతో పూర్తి ఆరోగ్య భరోసా
- జగనన్న ఆరోగ్య సురక్ష అమలుపై నిరంతరం సమీక్షించాలి
- ప్రతి ఇల్లు, ప్రతి వ్యక్తి కార్యక్రమంలో కవర్‌ కావాలి

2లో

యావజ్జీవం తప్పదు!



ఏ లెక్కన చూసినా శిక్ష నుంచి చంద్రబాబు తప్పించుకోలేరు

చుట్టుముట్టిన స్కిల్‌, ఫైబర్‌నెట్‌, అసైన్డ్‌ భూములు, ఐఆర్‌ఆర్‌, లిక్కర్‌, ఇసుక స్కాంలు

13లో

- అన్ని కుంభకోణాల ప్రధాన కుట్రదారు, లబ్ధిదారు ఆయనే
- సెక్షన్‌ 409 కింద ఒక్కో కేసులో యావజ్జీవ ఖైదుకు అవకాశం
- అవినీతి నిరోధక చట్టం కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు
- బాబు అవినీతికి వ్యతిరేకంగా ఆధారాలు లేవని కోర్టు చెప్పలేదు
- అయినా ముందస్తు బెయిల్‌ను వక్రీకరిస్తున్న ఎల్లో మీడియా
- నాడు అధికార దుర్వినియోగం.. యథేచ్ఛగా ప్రజాధనం దోపిడీ
- సీఐడీ దర్యాప్తులో కీలక ఆధారాలు లభ్యం
- డాక్యుమెంటరీ ఆధారాలు.. కీలక సాక్షుల వాంగ్మూలాలు

'స్కిల్డ్‌' క్రిమినల్‌ చంద్రబాబే..!

స్కిల్‌ స్కామ్‌ కుట్రదారు, లబ్ధిదారు ఆయనే

- సీమెన్స్‌ ముసుగులో ప్రజాధనం లూటీ
- జర్మనీ కంపెనీకి తెలియకుండానే ప్రాజెక్టు
- రూ.370 కోట్ల ప్రాజెక్ట్‌ ఏకంగా రూ.3,300 కోట్లకు పెంపు
- తన ముఠాను మోహరించి నిధుల స్వాహా

13లో

నేడు సీఐడీ ఎదుట చంద్రబాబు హాజరు

బాబుపై నమోదైన ఐపీసీ సెక్షన్లు ఇవే..

- 120 (బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఎ), 409, 201, 109 రెడ్‌విత్‌ 34, 37, అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్‌ 13(1), (సి), (డి)
- 409 సెక్షన్‌ కింద నేరం నిరూపితమైతే యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు.
- 13 (2) రెడ్‌విత్‌ 13(1), (సి), (డి) కింద నేరం నిరూపితమైతే పదేళ్ల వరకు శిక్ష పడుతుంది.

బాబు, లోకేశ్‌ దొంగలు

కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారు
గత ఎన్నికల ముందు మేమే రూ.150 కోట్లు ఇచ్చాం



- ప్రతి సోమవారం సమీక్ష చేసింది లంచాల కోసమే
- టీడీపీ 75 శాతం పూర్తి చేసిందనేది పచ్చి అబద్ధం
- ఆ పార్టీ ప్రజల కోసం కాదు... కుటుంబం కోసమే
- అదసలు పార్టీనే కాదు... ఓ వ్యాపార సంస్థ
- లోకేశ్‌ రాయలసీమలో ఎందుకు పోటీ చెయ్యడు?
- అక్కడ పోటీ చేసేంత దమ్ము, ధైర్యం లేవా?
- 'కియా' తెచ్చానంటాడు... అనంతలో గెలవలేదేం?
- ఈ పార్టీలో ఉండలేను... రాజీనామా చేస్తున్నా.. మాజీ ఎంపీ రాయపాటి తనయుడు, 'ట్రాన్స్‌ట్రాయ్‌' యజమాని రంగారావు స్పష్టీకరణ
- చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టిన గుంటూరు నేత

12లో

పచ్చ 'సేన'!

- టీడీపీ నేతలకు జనసేన ముసుగు
- పొత్తులో కేటాయించే అరకొర సీట్లకూ చంద్రబాబు ఎసరు
- పవన్‌కళ్యాణ్‌ను కలిసిన టీడీపీ నేతలు వేదవ్యాస్‌, మాగంటి బాబు, జలీల్‌ఖాన్‌
- బాబు సూచన మేరకే జనసేన గూటికి ఎమ్మెల్సీ వంశీకృష్ణ
- ఆది నుంచి ఉన్న జనసేన నాయకుల్లో ఆందోళన

- వివరాలు 12లో



76 కి.మీ. రూ.14వేల కోట్లు

- విశాఖ లైట్‌మెట్రో కారిడార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- పీపీపీ పద్ధతిలో నాలుగు కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు..
- 54 స్టేషన్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం.. 17న కేంద్ర ప్రభుత్వానికి జీఓ, డీపీఆర్‌ అందించేందుకు ఏర్పాట్లు

2లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సచివాలయాలతో ఉద్యోగ విజయం



మాది పెద్ద కుటుంబం. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బుద్దేపుపేట పల్లె గ్రామం మాది. ఇద్దరు అన్నయ్యలు, అక్క, తమ్ముడు, అమ్మా, నాన్న అందరం కలసి ఉండేవాళ్లం. కుటుంబాన్నిపోషించాల్సిన నాన్న పాపయ్య మా అందరినీ విడిచి అనంతలోకానికి వెళ్లిపోయారు. కుటుంబ బాధ్యత అమ్మా, అన్నయ్యలపైనే పడింది. అక్కతో పాటు ఇద్దరు అన్నయ్యలకు పెళ్లైంది. ఇక మిగిలింది నేను. తమ్ముడు. పుట్టినప్పటి నుంచి నా రెండు చేతులు మరుగుజ్జువి కావడంతో బడిలో చాలా మంది నన్ను చూసి జాలి పడేవారు. అది నచ్చని నాకు బాగా చదువుకొని జీవితంలో ఏదో ఒకటి సాధించాలనుకున్నాను. అందుకు మా అమ్మ, అన్నయ్యలు ఎంతగానో ప్రోత్సహించారు. డిగ్రీలో ఉండగానే గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ వేటలో పడ్డాను. ఒక్క ఉద్యోగం కూడా దక్కలేదు. 2018లో డిగ్రీ పూర్తి చేసిన నేను రెండేళ్లలో ఎంఎస్సీ ఆర్గానిక్ పూర్తి చేశాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నాకు రూ.3వేలు వికలాంగుల పింఛన్, మా అమ్మకు వితంతు పింఛన్ మంజూరైంది. ఈ సమయంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. తొలి ప్రయత్నంలోనే నేను 2020 డిసెంబర్ నెలలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సంపాదించాను. ప్రస్తుతం బూర్జపాడు గ్రామ సచివాలయంలో చేస్తున్న ఉద్యోగం ఎంతగానో సంతృప్తినిస్తోంది. ఈ రోజు నేను సమాజంలో దర్జాగా బతుకుతూ, నా కుటుంబ సభ్యులకు చేదోడు, వాదోడుగా ఉన్నానంటే అందుకు ఈ ప్రభుత్వమే కారణం.

– ఉప్పిలి విజయలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్, బూర్జపాడు

(మద్దిలి కేశవరావు, విలేకరి, ఇచ్ఛాపురం రూరల్)

సొంతింటి కల నెరవేరింది



పొట్ట కూటి కోసం తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి వలస వచ్చాం. రెండు దశాబ్దాలుగా ఇక్కడే నివసిస్తున్నాం. నా భర్త వెంకటాచలం రమేష్ గ్రానైట్ క్వారీలో పని చేస్తుండగా... నేను ఓ ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తున్నాను. మాకు ఇద్దరు పిల్లలు. మా అబ్బాయి సంజయ్ తమిళనాడులో చదువుకొంటున్నాడు. అమ్మాయి సన్మాది బాపట్లలో బీ ఫార్మసీ విద్యనభ్యసిస్తోంది. మా ఇద్దరికీ వచ్చే అరకొర సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చాం. ఇంటి అద్దె చెల్లించేందుకు నానా ఇబ్బందులు పడ్డాం. మాకు రేషన్ కార్డు ఉండడంతో గత ప్రభుత్వ హయాంలో అనేక సార్లు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నా ఎవరూ మా మొర ఆలకించలేదు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నవరత్నాల్లో భాగంగా సచివాలయంలో నివేశన స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నాం. దీంతో బల్లికురవ లేఅవుట్‌లో సెంటున్నర స్థలంతో పాటు పక్కా ఇల్లు మంజూరైంది. రూ. 1.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతోపాటు డ్వాక్రా బ్రిడ్జి రుణం రూ. 35 వేలు కలిపి అందమైన ఇంటిని నిర్మించుకొని అందులోనే ఆనందంగా జీవిస్తున్నాం. బతుకు తెరువు కోసం వలస వచ్చిన మా లాంటి వారికి కూడా గూడు కల్పించిన ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. మా అమ్మాయికి తొలుత అమ్మ ఒడి, తరువాత విద్యా దీవెన పథకాల ద్వారా నిధులు మంజూరు కావడంతో అప్పు చేయకుండా ఉన్నత విద్యను చదివించగలుగుతున్నాం. మాలాంటి వారి ఇళ్లల్లో సంతోషాల వెలుగులు పంచుతున్న ముఖ్యమంత్రి మేలు ఎప్పటికీ మరవలేము.

– రమేష్ సత్య, బల్లికురవ, బాపట్ల జిల్లా

(ఆంజనేయులు, విలేకరి, బల్లికురవ)

నిరుపేదల బతుకుల్లో సంక్షేమ వెలుగులు



మాది సాధారణ కుటుంబం. మా ఆయన ల్యాబ్ టెక్నీషియన్‌గా రెండు చోట్ల పనిచేస్తున్నారు. ఆయనకొచ్చే ఆదాయం అంతంతమాత్రమే. నేను, నా భర్త, పాప, బాబు కలిసి విశాఖ నగరం సీతంపేటలో సొంతింట్లో నివసిస్తున్నాం. నేను డ్వాక్రా సంఘంలో సభ్యురాలిని కావడంతో గతంలో తీసుకున్న రుణమాఫీకి సంబంధించి వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.16 వేలు వచ్చింది. సున్నా వడ్డీ కింద ఏడాదికి మూడు వేల వంతున ఇప్పటికి మూడు సార్లు జమయ్యింది. మా అబ్బాయికి టెన్త్, ఇంటర్‌లో అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15వేల వంతున మూడేళ్లు అందుకున్నాము. ఆ తర్వాత డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వాడికి విద్యాదీవెన, వసతిదీవెన అందింది. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం మా లాంటి వారికి ఇన్ని రకాల సంక్షేమ పథకాలు అమలుచెయ్యడం చూడలేదు. గత ప్రభుత్వంలో మాకు ఎలాంటి పథకాలు అందలేదు. ఇపుడు వలంటీర్ ఇంటికి వచ్చి ఫలానా పథకానికి మీకు అర్హత ఉంది. దరఖాస్తు చెయ్యమని చెబుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన టైమ్‌కు ఠంచన్‌గా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– రెడ్డి కుమారి, సీతంపేట, విశాఖపట్నం

(బి.అనితా రాజేష్, రిపోర్టర్, సీతంపేట(విశాఖపట్నం))

అందరికీ 'ఆరోగ్యం'

ఆరోగ్యశ్రీ సేవలు తెలియనివారు ఒక్కరూ ఉండకూడదు: సీఎం వైఎస్‌ జగన్



ఆరోగ్య శాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య భరోసా కల్పిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్న నేపథ్యంలో పథకం గురించి తెలియని వారు ఏ ఒక్కరూ ఉండటానికి వీల్లేదని అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. నిరుపేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తుందనే అవగాహన ఉండాలన్నారు. పథకాన్ని ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ అమలు, ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ, ప్రచార కార్యక్రమాలపై ఆరా తీసిన సీఎం జగన్ పలు సూచనలు చేశారు.

చేతి నుంచి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి రాకూడదు..

నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉచిత వైద్య సేవలందిస్తూ అత్యంత మానవీయ దృక్పథంతో మనందరి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లు, చికిత్స వ్యయ పరిమితిని విప్లవాత్మక రీతిలో భారీగా పెంచాం. పేద, మధ్య తరగతి ప్రజలెవరూ వైద్యం కోసం చేతి నుంచి డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఎక్కడా రాకూడదు. ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలన్న విషయంలో ఎవరికీ సందేహాలు ఉండకూడదు. తమకు దగ్గరలోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఎలా వెళ్లాలన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలియాలి. విస్తరించిన ప్రయోజనాలతో కొత్త ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందిస్తున్నాం. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు కార్డుల పంపిణీ పూర్తి చేయాలి.

జల్లెడ పట్టి గుర్తిస్తూ..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గుర్తించిన అనారోగ్య బాధితులకు చేయూతనిచ్చే కార్యక్రమం ఎలా జరుగుతోందో నిరంతరం సమీక్షించాలి. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రివెంటివ్ కేర్ అత్యంత ముఖ్యమైన అంశం. ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలను గుర్తించి శిబిరాల ద్వారా అవసరమైన వైద్య సేవలు అందించాలి. ప్రతి ఆర్నెల్లకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలి. ప్రతి ఇల్లు, ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి పట్టణాన్ని జల్లెడ పట్టాలి. శాచ్యురేషన్ విధానంలో ఈ ప్రక్రియ జరగాలి. ఏ గ్రామంలో ఎంతమందికి బీపీ, షుగర్లు ఉన్నాయి? ఎంత మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు? వారికి అందే వైద్యసేవలు ఏమిటి? తదితర అంశాలతో డేటా మ్యాపింగ్ చేపట్టాలి. బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సలు, కాలానుగుణంగా మందులు అందించాలి. ఈ మొత్తం డేటాను ప్రతి ఆర్నెల్లకు ఒకసారి మీ రికార్డుల్లో అప్‌డేట్ చేయాలి. గ్రామంలో వంద శాతం ఇళ్లు, వ్యక్తులు ఈ ప్రక్రియలో కవర్ కావాలి.

సదుపాయాలపై శ్రద్ధ..

ఎక్కడైనా ఆరోగ్యశ్రీ కార్డు మిస్ అయినా సరే వారికి కూడా ఉచిత వైద్యం అందాలి. ప్రాథమిక వైద్య పరీక్షల్లో గుర్తించిన సమస్యలను నిర్ధారించేందుకు మరోసారి పరీక్షలు చేయాలి. సురక్ష రెండో దశ నిర్వహణ తర్వాత ప్రతి కేసుకు సంబంధించి టెస్ట్‌లు పూర్తి కావాలి. గుండె పోటు బాధితులకు సత్వర వైద్యం కోసం ప్రవేశపెట్టిన స్టెమీ కార్యక్రమం వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ దగ్గర నుంచి మొదలవ్వాలి. దీనిపై సిబ్బందికి అవగాహన కల్పించాలి. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సదుపాయాలపై ఫోకస్ పెట్టాలి. అవసరమైన అన్ని వసతులను కల్పించాలి.


కర్నూలు క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ త్వరలో ప్రారంభం

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కింద ఇప్పటివరకూ 1,338 శిబిరాలు నిర్వహించి 98,210 మందికి అక్కడే స్పాట్ టెస్ట్‌లు నిర్వహించినట్లు సమీక్షలో అధికారులు వెల్లడించారు. 4,27,910 మంది ఓపీ ద్వారా వైద్యసేవలు పొందినట్లు తెలిపారు. సురక్ష తొలి దశ కార్యక్రమం సందర్భంగా నేత్ర పరీక్షలు నిర్వహించి 5,76,493 మందికి కళ్లద్దాల అవసరం ఉందని గుర్తించగా 67 శాతం మందికి ఇప్పటికే పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి అద్దాల పంపిణీ వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 12 ఎస్ఎన్‌సీయూలు, 5 ఎన్ఐసీయూలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి తెలియచేశారు. విశాఖలోని మెంటల్ కేర్ ఆసుపత్రి, విజయవాడ, తిరుపతిలో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్స్, రీజనల్ డ్రగ్ స్టోర్స్, తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో పీజీ మెన్స్ హాస్టల్, అనంతపురం జీజీహెచ్‌లో బర్న్స్ వార్డ్, కర్నూలులో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, జీఎంసీ కర్నూలులో ఎగ్జామినేషన్ హాల్‌ను అతి త్వరలో ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి, వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

76 కిమీ.. రూ.14వేల కోట్లు..

విశాఖ లైట్‌మెట్రో కారిడార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ





మెట్రో రైల్ ప్రాజెక్టు నమూనాలు

సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ మరింత అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో లైట్‌మెట్రోకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. 76 కిలోమీటర్ల మేర నాలుగు కారిడార్లతో నిర్మించనున్న తొలి విడత ప్రాజెక్టుకు రూ.14,309 కోట్లు వ్యయమవుతుందని తెలిపింది. పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 17న కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ను అందించేందుకు కావల్సిన పూర్తి డాక్యుమెంట్లను సిద్ధంచేసే పనిలో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు నిమగ్నమయ్యారు.

76.90 కి.మీ. మేర ప్రాజెక్టు..

విశాఖ నగర ప్రజలకు భవిష్యత్తులో రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు మెట్రోపై దృష్టిసారించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు ఒక్కో అడుగు ముందుకేస్తోంది. నెలరోజుల క్రితం సీఎం జగన్ ఆధ్వర్యంలో లైట్‌మెట్రో ప్రాజెక్టు డీపీఆర్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన జీఓను ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 76.90 కిమీ మేర లైట్‌మెట్రో ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. హెవీ మెట్రోతో పోల్చిచూస్తే.. లైట్ మెట్రో ద్వారా నిర్మాణ వ్యయంలో 20 శాతం, వార్షిక నిర్వహణలో 15 శాతం భారం తగ్గనున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం లైట్‌మెట్రో వైపే మొగ్గు చూపింది. మెట్రో రైలు రాకతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ఒక మెట్రో రైలు వెళ్తే ఎనిమిది బస్సులు వెళ్లినట్లు సమానం. ఒకసారి వెళ్లే మెట్రోలో 400 మంది ప్రయాణించగలరు.

ప్రాజెక్టు గడువు ఎనిమిదేళ్లు..

పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)–వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో విశాఖ మెట్రో ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు జీఓలో స్పష్టంచేశారు. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.14,309 కోట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇక టెండర్లు దక్కించుకున్న సంస్థ ఎనిమిదేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు దక్కించుకున్న మూడేళ్లకు తొలిమార్గంలో ప్రయాణికులకు మెట్రో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుందని జీఓలో స్పష్టంచేశారు. 30 ఏళ్ల పాటు సదరు నిర్మాణ సంస్థకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ద్వారా నిర్వహించాల్సి ఉంటుందని, ఈ సమయంలో ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని సదరు సంస్థ ఆర్జిస్తుందని డీపీఆర్‌లో తెలిపారు.

లైట్ మెట్రో ప్రాజెక్టు స్వరూపం..	మొత్తం అంచనా వ్యయం:	ప్రాజెక్టు విస్తీర్ణం:	తొలి రైలు తిరిగే సమయం:	ప్రాజెక్టు పూర్తికి గడువు:
	రూ.14,309 కోట్లు	76.90 కిమీ, 54 స్టేషన్లు	పనులు ప్రారంభించిన 3 ఏళ్లలోపు	8 ఏళ్లు

ఫేజ్–1లో కారిడార్–1, 2, 3 నిర్మాణానికి అంచనా వ్యయం: రూ.9,699 కోట్లు

ఫేజ్–2లో కారిడార్–4 నిర్మాణానికి అంచనా వ్యయం: రూ.4,610 కోట్లు

కారిడార్	కారిడార్ సెక్షన్	పొడవు (కిమీలలో)	స్టేషన్లు
1	స్టీల్‌ప్లాంట్ గేట్–కొమ్మాది జంక్షన్	34.40	29
2	గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్	5.08	06
3	తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు	6.75	07
4	కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు	30.67	12
మొత్తం		76.90	54

17న కేంద్రానికి డీపీఆర్



ఇక విశాఖ మెట్రో ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. కేబినెట్ డీపీఆర్‌ను ఆమోదించినందున లైట్‌మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన జీఓ నెం.161ని ప్రభుత్వం విడుదల చేసింది. జీఓ, డీపీఆర్‌తో పాటు ఇతర డాక్యుమెంట్లన్నీ కలిపి రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 17న కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పిస్తాం. కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు కాపీలు అందిస్తాం. వీలైనంత త్వరగా ప్రాజెక్టును ఆమోదింపజేసి టెండర్లకు వెళ్లాలని సీఎం వైఎస్ జగన్ నిర్దేశించారు. లైట్ మెట్రో ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష. ఏపీలో కీలకంగా, ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో శివారు ప్రాంతాలు కూడా కోర్ సిటీకి సమానంగా అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు అవసరం. రాబోయే 35–40 ఏళ్లలో నగర ట్రాఫిక్ డిమాండ్‌కి అనుగుణంగా డీపీఆర్ సిద్ధంచేశాం.

– యూజేఎం రావు, ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ

31న 'ఐబీ' ఒప్పందం

- 2024–25లో టీచర్లు, విద్యాశాఖ అధికారులకు ఐబీపై శిక్షణ
- 2025–26లో ఒకటో తరగతి నుంచి బోధన ప్రారంభం
- విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్ శిక్షణపై సీఎం జగన్ సమీక్ష

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆధునిక విద్యా బోధనే లక్ష్యంగా సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సిలబస్ అమలుకు సంబంధించి ఈనెల 31వ తేదీన ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు 2025 – 26 విద్యా సంవత్సరం నుంచి ఐబీ సిలబస్ అమలుకు చర్యలు చేపట్టి మార్గదర్శకాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖలో అమలు చేస్తున్న పలు పథకాలు, కార్యక్రమాల ప్రగతిని ఉన్నతాధికారులు వివరించారు. ఐబీ సిలబస్‌ను 2025–26 విద్యాసంవత్సరంలో 1వ తరగతితో ప్రారంభించి ఏటా ఒక్కో తరగతికి పెంచుకుంటూ అమలు చేయనున్నారు. విద్యార్థులకు ఐబీ, రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ సర్టిఫికేషన్ జారీ చేయనుంది. రానున్న విద్యా సంవత్సరం (2024–25)లో ఐబీ బోధనపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. టీచర్లతో పాటు డీఈవోలు, ఎంఈవోలతో సహా ముఖ్యమైన సిబ్బంది అందరికీ శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఫ్యూచర్ స్కిల్స్..

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్ నైపుణ్యాలపై రూపొందించిన ప్రణాళికను సీఎం జగన్ సమీక్షించారు. ఫైనాన్షియల్ లిటరసీ ద్వారా ఆర్థిక వ్యవహారాలపైనా విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. ప్రతి మూడు పాఠశాలలకు ఫ్యూచర్ స్కిల్స్‌పై ఒక నిపుణుడు ఉండేలా చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే 2,066 మందిని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల్లో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వారికి గౌరవ వేతనం చెల్లిస్తున్నామన్నారు. 8వ తరగతి నుంచి ఒక సబ్జెక్టుగా ఫ్యూచర్ స్కిల్స్ బోధించేందుకు ఇప్పటికే ఒక సెమిస్టర్ సిలబస్‌ను రూపొందించినట్లు చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి, సీఎం స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్‌కుమార్, ఇన్‌ఫ్రా కమిషనర్ కాటమనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ చారిత్రక నిర్ణయం

ల్యాండ్ టైటిలింగ్ చట్టం గురించి ఆందోళన వద్దు

- రెవెన్యూ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
- రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు
- జీవో నం.301, 388 పట్టాదారులకు టైటిల్ డీడ్స్ అందజేత
- ఉక్కు, ఫార్మాసిటీ భూ నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన, వైవీసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, తదితరులు

పెదగంట్యాడ (గాజువాక): ప్రజలకు భూమిపై సంపూర్ణ హక్కును కల్పించేలా ప్రభుత్వ ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చారిత్రక నిర్ణయమని రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి ఒక్కరికీ దానిపై పూర్తి హక్కుల్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ పట్టాలు, స్టీల్‌ప్లాంట్, ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం గాజువాక నియోజకవర్గం బీసీ రోడ్డులో నిర్వహించారు. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి మంత్రి ధర్మాన లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న గాజువాక హౌసింగ్‌సొసైటీ లబ్ధిదారులకు జీవో నం.301, 388 ద్వారా టైటిల్ డీడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని విమర్శించారు. ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ భూమిని ఆక్రమించి దానిలో ఇళ్లని నిర్మించుకున్న ప్రజలకు ఇప్పటివరకు ఎలాంటి హక్కులు గత ప్రభుత్వాలు కల్పించలేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో దానిపై శాశ్వత హక్కులు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. ఇటీవల తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సూచించారు. అన్నీ చట్ట ప్రకారం జరుగుతాయని, న్యాయస్థానాలు ఇచ్చే సలహాలు తీసుకుంటామని చెప్పారు. చట్టం పూర్తి స్థాయి అమలుకు అందరి సలహాలు పాటిస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కలెక్టర్ డా.మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయాల ఏర్పాటు అధికారం ప్రభుత్వానికి ఉంది

- వాటి ఏర్పాటును మేం తప్పుపట్టడం లేదు
- గతంలో త్రిసభ్య ధర్మాసనం తీర్పు వ్యర్థం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉంది
- పిటిషన్‌ను త్రిసభ్య ధర్మాసనం విచారించాలా? లేదా అనేదానిపై తగిన ఉత్తర్వులిస్తాం
- స్పష్టం చేసిన సీజే నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష కోసం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంపు కార్యాలయాల ఏర్పాటుపై ఐఏఎస్‌ల కమిటీ నివేదికకు అనుగుణంగా జారీ చేసిన జీవో 2283ను సవాలు చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌ను త్రిసభ్య ధర్మాసనం విచారించాలా? లేక సింగిల్ జడ్జి విచారణ జరిపితే సరిపోతుందా? అన్న అంశంపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు సీజే నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని, దానిని తాము తప్పుపట్టడం లేదని ధర్మాసనం తెలిపింది. అయితే అమరావతిలో ఉన్న కార్యాలయాలను తరలించవద్దంటూ గతంలో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు వ్యర్థం కాకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం స్పష్టం చేసింది.

జస్టిస్ నిమ్మగడ్డ బ్రేక్..

జీవో 2283ను రద్దు చేయాలని, అప్పటి వరకు ఆ జీవో అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ అమరావతి పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్టీ గద్దె తిరుపతిరావు, రాజధాని రైతులు మాదాల శ్రీనివాసరావు, వలపర్ల మనోహరం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, విశాఖలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుకు బ్రేక్ వేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జస్టిస్ నిమ్మగడ్డ ఉత్తర్వులు సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సీజే ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేసింది. ఈ అప్పీళ్లపై శుక్రవారం సీజే నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం విచారణ జరిపింది.

కార్యాలయాల తరలింపు కాదు..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ, విశాఖపట్నంకు ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారన్న భావనతో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుపై సింగిల్ జడ్జి స్టే ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. వాస్తవానికి కార్యాలయాలను తరలించడం లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి సమీక్ష కోసమే క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమీక్ష సమావేశాలకు హాజరయ్యే అధికారులకు వసతి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుకే ఈ దిశగా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. దీనిని పిటిషనర్లు తప్పుగా అర్థం చేసుకుని పిటిషన్లు వేశారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల తరలింపుపై గతంలో త్రిసభ్య ధర్మాసనమే విచారణ జరిపిందని, అందువల్ల ప్రస్తుత వ్యాజ్యాలను కూడా త్రిసభ్య ధర్మాసనమే విచారించాల్సి ఉంటుందని చెప్పారు. సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను కొనసాగించాల్సిన అవసరం లేదన్నారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది మురళీధరరావు స్పందిస్తూ, తమ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనానికి పంపినా, సింగిల్ జడ్జి వద్దకు పంపినా అభ్యంతరం లేదన్నారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకునేంత వరకు సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను కొనసాగించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారాన్ని త్రిసభ్య ధర్మాసనానికి పంపే విషయంలో నిర్ణయం వెలువరిస్తామని చెప్పింది.

కోనసీమ 'ప్రభ'

సంక్రాంతి పండుగ వేళ ప్రభల తీర్థం నిర్వహణ

- కోనసీమ జిల్లాలో 80 వరకు తీర్థాలు
- జగ్గన్నతోటకు ఆధ్యాత్మిక.. చారిత్రక గుర్తింపు
- జాతీయ స్థాయి గుర్తింపుతో ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు


అంబాజీపేట మండలం జగ్గన్నతోట ప్రభల తీర్థానికి వస్తున్న ప్రభలు (ఫైల్)

సాక్షి, అమలాపురం: కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ప్రభల తీర్థం. ఇది సంక్రాంతి పండుగ వేళ జరుపుకోవడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ. దేశ రాజధాని న్యూఢిల్లీలో గతేడాది అట్టహాసంగా జరిగిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర శకటంపై కొలువుదీరిన ఈ ప్రభల తీర్థం భారతీయుల మనస్సులను గెలిచాయి. కోనసీమ 'ప్రభ'ను నలుదిక్కులా చాటి చెప్పాయి. వివరాల్లోకి వెళితే...డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగే ప్రభల తీర్థాలకు ఐదు శతాబ్దాల చరిత్ర ఉంది. అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోట తీర్థానికి జాతీయ స్థాయి గుర్తింపు ఉంది. తీర్థం జరిగే ప్రాంతంలో గుడి, గోపురాలు ఉండవు. కౌశిక నదిని ఆనుకుని ఉన్న కొబ్బరి తోటలో ఈ తీర్థం జరగడం ఇక్కడి ప్రత్యేకత. తీర్థం జరిగే ప్రాంతం చుట్టూ ఉన్న రెండు నియోజకవర్గాల పరిధిలోని మూడు మండలాలకు చెందిన పదకొండు ప్రభలు ఇక్కడకు వస్తాయి. ఇక్కడ జరిగే ప్రభల తీర్థం లోక కల్యాణార్థం అని భక్తుల విశ్వాసం. పెద్దాపురం సంస్థానాధీశుడు రాజా వత్సవాయి జగన్నాథరాజు (జగ్గన్న) హయాంలో తొలిసారిగా 17వ శతాబ్దంలో ఈ తీర్థాన్ని ప్రారంభించారని చెబుతారు. మహారాజుకు పరమేశ్వరుడు స్వప్నంలో సాక్షాత్కరించి ప్రభల తీర్థం నిర్వహించమని కోరారంటారు. అప్పటి నుంచి ఇక్కడ తీర్థం జరుగుతోందని భక్తుల విశ్వాసం. మరో కథలో.. 17వ శతాబ్దంలో పరమ శివభక్తుడు, ఏకసంధాగ్రాహి అయిన వితలా జగ్గన్న ఇక్కడున్న కౌశిక నది చెంతన శివ పూజ చేసేవారు. ఇందుకు పెద్దాపురం సంస్థానాధీశుడు అభ్యంతరం చెప్పడంతో హైదరాబాద్ నిజాం నవాబును తన ప్రతిభతో మెప్పించి ఇప్పుడు తీర్థం జరిగే జగ్గన్నతోట వద్ద 8 పుట్లు (64 ఎకరాలు) భూమిని దానంగా పొందారని చెబుతారు. ఈ కారణంగానే ఇది జగ్గన్న తోటగా పేరొందిందని నమ్మకం.

ప్రభల తీర్థాలు జరిగేదెక్కడంటే..

జగ్గన్నతోటతో పాటు కొత్తపేట సెంటర్, అవిడి డ్యామ్ సెంటర్, కాట్రేనికోన, మామిడికుదురు మండలం కొర్లగుంట వంటి చోట్ల పెద్ద తీర్థాలు జరుగుతాయి. ఇవికాకుండా జిల్లా వ్యాప్తంగా 84 వరకూ తీర్థాలు నిర్వహిస్తారు. 60 అడుగుల వెడల్పు, 40 అడుగుల ఎత్తున ప్రభలు ఉంటాయి. ప్రభలు తయారు చేయడాన్ని యజ్ఞంగా భావిస్తారు. తాటి శూలం, టేకు చెక్క, పోక చెట్ల పెంటిలు, మర్రి ఊడలు, వెదురు బొంగులతో మూడు రోజులపాటు శ్రమించి ప్రభలు తయారు చేస్తారు. రంగురంగుల నూలుదారాలు (కంకర్లు), కొత్త వస్త్రాలతో అందంగా తీర్చిదిద్దుతారు. ప్రభపై పసిడి కుండ ఉంచి చుట్టూ నెమలి పించాలు, జేగంటలు వేలాడదీస్తారు. వరి కంకుల కుచ్చులు, గుమ్మడి, ఇతర కూరగాయలు, పెద్దపెద్ద పూల దండలతో ప్రభకు వేలాడదీస్తారు. వీటిని భక్తులు తమ భుజస్కంధాలపై ఉంచి కిలోమీటర్ల కొద్దీ మోసుకు వస్తారు. కొబ్బరి తోటలు, వరిచేలు, పంట కాలువల మీదుగా సాగే ప్రభల యాత్ర చూసేందుకు రెండు కళ్లు చాలవంటే అతిశయోక్తి కాదు.

జాతీయస్థాయిలో గుర్తింపు

గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివ కేశవ యూత్ సభ్యులు ఈ తీర్థ విశేషాలను ప్రధాని నరేంద్ర మోదీకి వివరిస్తూ 2020లో మెయిల్ చేశారు. దీంతో మోదీ తీర్థాన్ని అభినందిస్తూ తిరిగి సందేశం పంపించారు. గతేడాది ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో రాష్ట్ర ప్రభుత్వ శకటంపై జగ్గన్నతోట తీర్థాన్ని ప్రదర్శించారు. దీంతో జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. గతేడాది ప్రముఖ సినీ నటుడు నాగార్జున నటిస్తున్న ఒక సినిమాలో విజువల్స్ కోసం ప్రభల తీర్థాన్ని చిత్రీకరించారు. యువత ప్రభల తీర్థాలపై పలు లఘు చిత్రాలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో ఈ తీర్థానికి పెద్ద ఎత్తున ప్రచారం లభించింది. దీంతో ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేసి, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మకర సంక్రాంతి తర్వాత వచ్చే ఉత్తరాయణ కాలంలో ప్రభలను ఊరి పొలిమేర దాటిస్తే ఊరుకు మంచిదనేది ఇక్కడి ప్రజల ప్రగాఢ విశ్వాసమని అర్చకుడు చంద్రమౌళి కామేశ్వరశాస్త్రి తెలిపారు.

శ్రీగిరిలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ క్రతువు జరిపించారు. బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు యాగం చేశారు. ముక్కోటి దేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ధ్వజారోహణ చేపట్టారు.

22న ఏపీపీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మైనింగ్ అండ్ జియాలజీ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు ఏపీపీఎస్సీ నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల వివరాలను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచింది. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 22న ఉంటుందని, అభ్యర్థులు ఆ తేదీన విజయవాడలోని సర్వీస్ కమిషన్ కార్యాలయంలో హాజరు కావాలని కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. వివరాలకు https://psc.ap.gov.inలో చూడవచ్చునని తెలిపారు.





అద్దె బ్యాచ్ దిగింది!

మౌత్ పబ్లిసిటీ కోసం రంగంలోకి టీడీపీ ఎల్లో కిరాయి మూకలు

- ముఖ్యమంత్రి జగన్‌పై పెద్ద ఎత్తున దుష్ప్రచారం
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల పనితీరు బాగా లేదు.. టికెట్ రాదంటూ అసత్య ప్రచారం
- ఎల్లో మీడియా పత్రికల్లోని వార్తలను చదువుతూ స్థానికుల్ని నమ్మించే యత్నం
- ఓడిపోతామనే 'చీప్ ట్రిక్స్'కు పాల్పడుతున్న పచ్చ బ్యాచ్
- అద్దె బ్యాచ్ ప్రచారంపై మండిపడుతున్న స్థానికులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు/తిరుపతి: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ తెలుగుదేశం పార్టీ దిగజారుడు రాజకీయాలకు తెరతీస్తోంది. ఎన్నడూ లేని విధంగా నలుగురైదుగురు ఉన్న చోటకెళ్లి టీడీపీకి అనుకూలంగా మాట్లాడుతూ ఆ పార్టీ గెలుస్తోందని అసత్య ప్రచారాలు కల్పిస్తూ 'చీప్ పాలిట్రిక్స్‌కు' దిగజారిపోయింది. రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల్లో విజయం కోసం వ్యూహాలు రచించడం సహజం. ప్రజలకు చేసిన మంచి పనులను ఎన్నికల సమయంలో చెప్పుకోవడం, మరోసారి అధికారంలోకి వస్తే మరింత మంచి చేస్తామని ప్రకటించడం పరిపాటి. అయితే ఇందుకు భిన్నంగా ప్రస్తుతం ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తున్న తీరు ఏవగింపుగా మారింది. ప్రజాభిమానం కోల్పోయి రోజురోజుకూ పాతాళంలోకి దిగజారిపోయిన పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మౌత్ పబ్లిసిటీ పేరుతో అడ్డదారులు తొక్కుతోంది. ప్రతి నియోజకవర్గంలో భారీ స్థాయిలో ఎల్లో కిరాయి మూకలను అద్దెకు ఏర్పాటు చేసుకుని టీ దుకాణాలు, సెలూన్‌ల వద్ద తిష్టవేసి అధికార పక్షంపై అసత్య ప్రచారం చేయించుకునే దుస్థితికి వచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డిని దూషించడమే పనిగా పెట్టుకుని అద్దెబ్యాచ్ పట్టణాల్లో తిరుగుతోంది. టీడీపీకి అనుకూలంగా ఉన్న కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో విద్యార్థులను రంగంలోకి దింపినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి కళాశాల నుంచి కొంత మంది విద్యార్థులను ఎంపిక చేసుకుని వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించినట్లు తెలిసింది.

అద్దె బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చి..

క్షేత్రస్థాయిలోకి వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను టార్గెట్ చేయటంతో పాటు ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్‌పై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేయాలని ఆదేశాలిచ్చారు. శిక్షణా తరగతులను మొదటి, రెండు, మూడు బ్యాచ్‌లుగా విభజించి ఖమ్మం జిల్లాలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. మొదటి విడతగా నియోజకవర్గానికి ఇద్దరు విద్యార్థుల చొప్పున రంగంలోకి దింపారు. వీరిపైన జిల్లాకు ఒక కోఆర్డినేటర్‌ని నియమించారు. ఈ ఇద్దరు రోజూ ఎక్కడెక్కడ తిరిగారు, ఏం చేశారు? అక్కడ పరిస్థితులు ఏంటి అనేది జిల్లా కో ఆర్డినేటర్‌కి నివేదిక రూపంలో అందిస్తారు. దానిని అమరావతిలో ఉండే టీం లీడర్‌కి పంపుతారు. దాదాపు 5 వేల మందికి శిక్షణ ఇచ్చి నగర, పట్టణ ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. లోకల్‌గా కొంతమందిని రిక్రూట్ చేసుకుని వారితో సమన్వయం చేసుకుంటూ అద్దె బ్యాచ్ మౌత్ పబ్లిసిటీ చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల నెల్లూరు రూరల్ ప్రాంతంలో అద్దె బ్యాచ్ టీ దుకాణాల వద్ద చేస్తున్న అసత్య ప్రచారాన్ని కొందరు స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఆ బ్యాచ్ ఆ ప్రాంతాన్ని వదిలి పరారైన ఘటన వెలుగులోకి వచ్చింది.

టీ స్టాళ్లు, సెలూన్లే వేదికలు

టీడీపీ కిరాయి మూకలు నగరాలు, పట్టణాల్లోని టీ దుకాణాలు, సెలూన్లను వేదికగా చేసుకుంటున్నాయి. సాధారణ వ్యక్తుల్లా వెళ్లి అక్కడే తిష్ట వేస్తారు. వారి చేతిలో ఈనాడు, ఆంధ్రజ్యోతి ఉంటుంది. ఆ పత్రికలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వార్తలను చదువుతున్నట్లు నటిస్తారు. వార్తల సారాంశంపై పక్కనున్న వారితో చర్చ పెడతారు. ఆపై ఇదేం ప్రభుత్వం, ఎక్కడ చూసినా ప్రజలు ఛీదరించుకుంటున్నారు. ఎక్కడా రోడ్లు వేయలేదు, అభివృద్ధి జరగలేదు, రాష్ట్రం అప్పులు చూస్తే కొండలా పెరిగిపోతున్నాయి, సంక్షేమం అంటూ బటన్లు నొక్కి తిరిగి ధరలు పెంచి మన నుంచి డబ్బులు లాగేసుకుంటున్నారంటూ పెదవి విరుస్తారు. ఇలా ఎల్లో కిరాయి మూకలు తమ నటనను ప్రదర్శిస్తారు. అంతే కాకుండా లోకల్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేకు టికెట్ రాదని, ఆయన అవినీతి చేశాడని.. టీడీపీలోకి వలసలు జోరుగా జరుగుతున్నాయంటూ భజన ప్రారంభిస్తారు. టీడీపీ, జనసేన జోడీ బాగుంది.. ఉత్తరాంధ్రలో అంతా టీడీపీ, జనసేన కూటమికే ఎక్కువ సీట్లు వస్తాయని, ఈ దఫా ఈ కూటమికే అధికారం వస్తుందని పదేపదే చెబుతారు. ఆ షాపుల వద్ద జనం ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే అక్కడ తిష్ట వేసి ఇలా తమ నటనను ప్రదర్శిస్తారు. దానిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా నేర్పరితనంతో వ్యవహరిస్తారు.

రెండు, మూడు విడతల్లో మండల, సచివాలయాలు..

మొదటి విడత కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు పూర్తయ్యాక మరొక బ్యాచ్ రంగంలోకి దిగుతుంది. సంక్రాంతి తరువాత మండల, సచివాలయ కేంద్రాలను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిసింది. పట్టణాలు, నగరాలు అయితే అద్దె బ్యాచ్ ఎవరనేది ఎవ్వరూ ప్రశ్నించరు. కాబట్టి వారికి ఆ బాధ లేదు. మండల, సచివాలయ కేంద్రాలకు వెళ్లే సమయంలో స్థానిక నాయకుల సహకారంతో రంగంలోకి దిగనున్నారు. ఇప్పటికే స్థానిక నాయకులకు అధిష్టానం నుంచి ఆదేశాలు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. స్థానిక నాయకులతో కలిసి పర్యటిస్తారు. ఒక అద్దె వ్యక్తి స్థానికుడు ఒకరు ఉంటారు. అలా ఇద్దరికి ఇద్దరు పర్యటిస్తారు. టీ కొట్లు, చిన్న బంకుల వద్ద కూర్చొని అబద్ధపు ప్రచారాలకు పదును పెడుతారు. స్థానిక టీడీపీ కార్యకర్త ప్రభుత్వం గురించో, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ గురించో ప్రస్తావన చేస్తారు. అద్దె వ్యక్తి 'అవునంటన్నా. మా బంధువుకి అలా జరిగిందంట, వైఎస్సార్‌సీపీ వాళ్లు ఇలా చేశారంట' అని శృతి కలుపుతాడు. నలుగురు కలిసి ఒక అబద్ధాన్ని నిజం చేసేందుకు తీవ్రంగానే కృషి చేయటానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

మూడో బ్యాచ్‌లో బరి తెగింపుడే

ఇక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాక మూడవ బ్యాచ్ రంగంలోకి దిగే పనిలో ఉంది. ఈ బ్యాచ్ అన్నింటికీ తెగించిన వారికి ప్రస్తుతం ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. షెడ్యూల్ వచ్చాక అబద్దాలు ప్రచారం చేయటం కంటే.. స్థానికంగా గొడవలు సృష్టించేందుకే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. మద్యం దుకాణాల వద్ద, లేదా మద్యం సేవించే ప్రాంతాలను ఎంపిక చేసుకుని స్థానికుల మధ్య గొడవలు పెట్టటం లేదా వీరే స్థానికులను రెచ్చగొట్టి విధ్వంసాలకు లాగటమే వీరి స్కెచ్‌గా తెలుస్తోంది. మద్యంపై విషప్రచారం చేయటం, స్థానికులను కొట్టడం, లేదా వారి వద్ద వీరు దెబ్బలు తినటమే ప్రధాన లక్ష్యంగా రంగంలోకి దింపుతున్నట్లు సమాచారం.

ఘోర పరాభవాన్ని గుర్తెరిగే..

గత ఎన్నికల్లో మాదిరిగా ఘోర పరాభవాన్ని గుర్తెరిగే టీడీపీ ఇలాంటి నీతిమాలిన చర్యలకు పూనుకొంటోంది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధితో ఆ ప్రభుత్వానికి ప్రజల్లో పరపతి పెరిగింది. మరోసారి కూడా వైఎస్సార్‌సీపీ వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కొనే సత్తా లేక అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఎన్నికల బరిలోకి దిగే ప్రయత్నాన్ని టీడీపీ చేస్తోంది.అయినా ప్రజల్లో టీడీపీ పట్ల తీవ్ర వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో మౌత్ పబ్లిసిటీని నమ్ముకొని దానినే కార్యరూపంలోకి తీసుకొచ్చారు.

దస్తగిరి రిమాండ్ పొడిగింపు

రాజంపేట: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడు దస్తగిరిని అన్నమయ్య జిల్లా రాజంపేట మూడో అదనపు జిల్లా కోర్టులో వేముల పోలీసులు శుక్రవారం హాజరుపరిచారు. వేముల మండలంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ..కిడ్నాప్ కేసులలో దస్తగిరి నిందితుడిగా ఉన్నాడు. వైఎస్సార్ జిల్లా జడ్జి రాజంపేటకు ఇన్‌చార్జిగా ఉండటంతో పోలీసులు ఇక్కడ దస్తగిరిని ప్రవేశపెట్టారు. అతడికి ఈ నెల 25 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ జిల్లా ఇన్‌చార్జి జడ్జి దీనాబాబు ఆదేశించారు.



ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

- విచారణపై తదుపరి చర్యలన్నీ నిలిపివేయం
- ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి వాదనలు వినాల్సిందే
- సునీత, రాజశేఖరరెడ్డి, రాంసింగ్ పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు
- కృష్ణారెడ్డికి నోటీసులు.. విచారణ ఫిబ్రవరి 22కు వాయిదా

సాక్షి, అమరావతి: పులివెందుల కోర్టులో జరుగుతున్న విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలన్న మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌ల అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి వాదనలు వినకుండా ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 22కి వాయిదా వేశారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీభానుమతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌లు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ భానుమతి విచారణ జరిపారు.

తదుపరి చర్యలన్నీ నిలిపేయండి..

రాజశేఖర్‌రెడ్డి, సునీతల తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ జరపాలని పులివెందుల పోలీసులకు మేజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాలు సరికాదన్నారు. ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి తన ఫిర్యాదును ఎస్పీకి ఇచ్చారని, నిబంధనల ప్రకారం సంబంధిత ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రాంసింగ్ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బి.నర్సింహ శర్మ వాదనలు వినిపిస్తూ, దర్యాప్తు అధికారిపై దాఖలు చేసే ప్రైవేటు ఫిర్యాదు చెల్లదన్నారు. కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి దాఖలు చేసే ప్రైవేటు ఫిర్యాదుపై విచారణకు ఆదేశించడం ద్వారా మేజిస్ట్రేట్ తప్పు చేశారన్నారు. పులివెందుల కోర్టులో జరుగుతున్న విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

రాంసింగ్‌ను సుప్రీంకోర్టు తప్పించింది

పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ, వివేకా హత్య విషయంలో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రాంసింగ్ శారీరకంగా, మానసికంగా వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డిని వేధింపులకు గురి చేశారన్నారు. తాము చెప్పినట్లు వినకుంటే అంతు చూస్తామంటూ బెదిరించారని, అంతేకాక కృష్ణారెడ్డి కుమారులను సైతం బెదిరించారని వివరించారు. దీంతో వేధింపులు భరించలేక వారిపై పులివెందుల కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారని తెలిపారు. విచారణ జరిపిన స్థానిక కోర్టు కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ జరపాలని పోలీసులను ఆదేశించిందని, ఈ ఆదేశాల మేరకు పోలీసులు విచారణ జరిపి చార్జిషీట్ కూడా దాఖలు చేశారన్నారు. రాంసింగ్ ప్రస్తుతం దర్యాప్తు అధికారి కాదని, అతన్ని సుప్రీం కోర్టు తప్పించిందని ఆయన కోర్టుకు నివేదించారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేనని తేల్చి చెప్పారు.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు ఊరట

- కుల ధ్రువీకరణ పత్రం రద్దు జీవో అమలు 8 వారాలు నిలిపివేత
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆమె ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న జారీ చేసిన జీవో 2 అమలును హైకోర్టు 8 వారాలు నిలిపివేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తన కుల ధ్రువీకరణ పత్రాన్ని ప్రభుత్వం రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ గీత హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ జయసూర్య విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సర్వ సత్యనారాయణ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. 2016లో సమగ్ర విచారణ జరిపి జిల్లా కలెక్టర్ ఆమెకు కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారని, దానిపై ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముందు అప్పీల్ చేసిందన్నారు. దానిపై ముఖ్య కార్యదర్శి నిర్ణయం తీసుకోవడం లేదంటూ సంఘం ఇటీవల హైకోర్టులో పిటిషన్ వేసిందన్నారు. గీత వాదనలు విన్న తర్వాత అప్పీల్‌పై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. దీనిపై తాము హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, రెండు వారాల్లో ఆ అప్పీల్‌పై రాతపూర్వక అభ్యంతరాలు తెలియజేయాలని తమను ఆదేశించిందని, అప్పటి వరకు నిర్ణయం తీసుకోవద్దని ముఖ్య కార్యదర్శిని ఆదేశించిందని చెప్పారు. రెండు వారాలు పూర్తి కాక ముందే ముఖ్య కార్యదర్శి అప్పీల్‌పై నిర్ణయం వెలువరించారని, ఆ వెంటనే ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ జీవో ఇచ్చిందన్నారు. ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనన్నారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించండి

రఘురామ అరెస్ట్ విషయంలో పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: సంక్రాంతికి తన నియోజకవర్గానికి వస్తున్న నరసాపురం పార్లమెంట్ సభ్యుడు రఘురామకృష్ణరాజును అరెస్ట్ చేయాలనుకుంటే అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించాలని హైకోర్టు శుక్రవారం పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీభానుమతి ఉత్తర్వులు జారీ చేశారు. నరసాపురం వస్తున్న సందర్భంగా తనపై పోలీసులు తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందువల్ల చట్ట నిబంధనలను అనుసరించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ రఘురామ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్ భానుమతి శుక్రవారం విచారణ జరిపారు. హోంశాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) వేలూరి మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ, ఊహలు, అభిప్రాయాల ఆధారంగా దాఖలు చేసిన ఈ పిటిషన్‌కు విచారణార్హతే లేదన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసు ఇచ్చే లేదా అరెస్ట్ చేసే విచక్షణాధికారం దర్యాప్తు అధికారికి ఉందన్నారు. అరెస్ట్ మీద ఎలాంటి నిషేధం లేదని, ప్రతీ కేసులో కూడా నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. అంతకుముందు రఘురామ తరఫు న్యాయవాది ఉమేష్ చంద్ర వాదనలు వినిపిస్తూ, అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

రోజాపై అసభ్య వ్యాఖ్యలు.. నగరి కోర్టుకు బండారు



నగరి కోర్టుకు హాజరవుతున్న మాజీ మంత్రి బండారు

నగరి(చిత్తూరు జిల్లా): తన వ్యక్తిత్వం గురించి నీచంగా మాట్లాడటంతో మంత్రి ఆర్‌కే రోజా దాఖలు చేసిన పరువునష్టం కేసులో టీడీపీకి చెందిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణ శుక్రవారం నగరి కోర్టుకు హాజరయ్యారు. ఆయనకు మేజిస్ట్రేట్ విష్ణువర్మ కేసుకు సంబంధించిన రికార్డులు అందించారు. అనంతరం కేసు విచారణను ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదా వేశారు. కోర్టు వెలుపలకు వచ్చిన బండారు సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రి రోజాపై మళ్లీ విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య విరుద్ధంగానే కేసులు పెడుతున్నారని, తమ ప్రభుత్వం వస్తే న్యాయబద్ధంగా ప్రజలకు ఆధారాలు చూపించి కేసు పెడతానని చెప్పారు. కాగా, బండారు వ్యాఖ్యలపై స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

జీవో-1ను కొట్టేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బీఈడీ కాలేజీల్లో తనిఖీలు చేపట్టే అధికారాన్ని ఉన్నత విద్యామండలికి అప్పగిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో-1ను హైకోర్టు కొట్టేసింది. విద్యాహక్కు చట్ట నిబంధనల ప్రకారం తనిఖీల అధికారాన్ని ఒక అధికారికి మాత్రమే బదిలీ చేసేందుకు అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత శుక్రవారం తీర్పు చెప్పారు. జీవో-1ను సవాలు చేస్తూ ఏపీ ప్రైవేటు బీఈడీ కాలేజీల యాజమాన్యాల సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సునీత విచారించారు. ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ వాదనలు వినిపిస్తూ.. కాలేజీల్లో ప్రమాణాలను మరింత మెరుగుపరచాలన్న ఉద్దేశంతోనే తనిఖీల బాధ్యతలను ఉన్నత విద్యామండలికి అప్పగించామని చెప్పారు. ప్రస్తుతం బీఈడీ కాలేజీల్లో ప్రమాణాలు నామమాత్రంగానే ఉన్నాయన్నారు. కాలేజీల తరఫు న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపిస్తూ.. చట్టప్రకారం ఒక అధికారికి మాత్రమే తనిఖీల అధికారాన్ని బదలాయించవచ్చని చెప్పారు. ప్రభుత్వం అందుకు భిన్నంగా ఉన్నత విద్యామండలికి బదలాయించిందని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జీవో-1ను కొట్టేశారు.

బీసీ కులగణన కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కుల గణనపై రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కులగణన, బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలంటూ ఆర్.కృష్ణయ్య 2020లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌తోపాటు మరికొందరు వేసిన పిటిషన్‌లను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

కృష్ణా ట్రిబ్యునల్-2 కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా ట్రిబ్యునల్-2కు సంబంధించి ఇటీవల కేంద్రం నోటిఫై చేసిన నూతన విధివిధానాలను (టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్) సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారించింది. గత విచారణ సందర్భంగా బెంచ్ ఆదేశాల మేరకు కౌంటర్ దాఖలు చేసినట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ న్యాయవాదులు ధర్మాసనానికి వివరించారు. ఈ కౌంటర్‌కు రిజాయిండర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం తరఫు అడ్వొకేట్లు కోరారు. దీంతో విచారణను ధర్మాసనం రెండువారాలు వాయిదా వేసింది. గత ఏడాది అక్టోబరు 6న రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై కృష్ణా ట్రిబ్యునల్-2 విచారణ కొనసాగించాలని కేంద్రం నూతన విధివిధానాలతో గెజిట్ జారీచేసింది. ఈ గెజిట్‌ను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతివాదులుగా ఉన్న కేంద్రం, తెలంగాణ రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. కేంద్ర జల్‌శక్తి శాఖ కౌంటర్ దాఖలు చేసింది.



DMart®
Daily Discounts Daily Savings
సంక్రాంతికి
షాపింగ్ మొత్తం
ఇప్పుడు బడ్జెట్‌లో ఉంది
DMart ready
₹56* మాత్రమే లూస్ కర్నూలు సోనామసూరి బియ్యం 1 కిలో
₹99* మాత్రమే లూస్ బిర్యానీ బియ్యం 1 కిలో
₹73* మాత్రమే లూస్ శనగ పప్పు 1 కిలో
₹118* మాత్రమే లూస్ మినప గుళ్ళు 1 కిలో
సంక్రాంతి స్పెషల్
₹40.50* మాత్రమే లూస్ చక్కెర 1 కిలో
₹209* మాత్రమే లూస్ తెల్ల నువ్వులు 1 కిలో
₹135* మాత్రమే లూస్ వేరుశనగ 1 కిలో
₹61* మాత్రమే లూస్ శనగపిండి 1 కిలో
₹35* మాత్రమే లూస్ మైదా 1 కిలో
₹33* మాత్రమే లూస్ గోధుమ పిండి 1 కిలో
₹23* మాత్రమే కొబ్బరికాయ పెద్దది 1N
₹59* మాత్రమే బెల్లం 900 గ్రాములు ఎంఆర్‌పి ₹ 90
₹75* మాత్రమే చింతపండు (ఇమ్లి) 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 110
₹359* మాత్రమే జీడిపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 602
₹315* మాత్రమే స్వాద్ బాదంపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 448
నిత్యావసర వస్తువులు
₹105* మాత్రమే బాంబినో వెర్మిసెల్లి 1.4 కిలో ఎంఆర్‌పి ₹ 142
కొనండి 1 పొందండి 1 ఉచితంగా కిమియా సీడెడ్ ఖర్జూరం 400 గ్రాములు ఎంఆర్‌పి ₹ 310*
₹110* మాత్రమే అనురాగ్ రిఫైన్డ్ రైస్ బ్రాన్ ఆయిల్ 1 లీ ఎంఆర్‌పి ₹ 210
₹230* మాత్రమే బ్రూ గ్రీన్ లేబుల్ కాఫీ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 280
₹499* మాత్రమే మిల్కీ మిస్ట్ కౌ ఘీ పౌచ్ 1 లీ ఎంఆర్‌పి ₹ 729
₹349* మాత్రమే నట్‌రాజ్ కాలిఫోర్నియా బాదంపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 599
₹65* మాత్రమే ఎంటిఆర్ గులాబ్ జామున్ మిక్స్ 160 గ్రాములు ఎంఆర్‌పి ₹ 150
₹155* మాత్రమే లొట్టె చాకో పై బిస్కెట్స్ 504 గ్రాములు ఎంఆర్‌పి ₹ 220
₹180* మాత్రమే ఆశీర్వాద్ మిరప పొడి 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 250
₹149* మాత్రమే రాజాం గార్లిక్ మిక్సర్ 800 గ్రాములు ఎంఆర్‌పి ₹ 199
₹75* మాత్రమే థమ్స్ అప్/ స్ప్రైట్ బాటిల్ 1.75 లీ ఎంఆర్‌పి ₹ 85/100
₹140* మాత్రమే మీరా స్ట్రాంగ్ అండ్ హెల్దీ షాంపు 180 మి.లీ ఎంఆర్‌పి ₹ 180
₹195* మాత్రమే పారాచూట్ కోకోనట్ ఆయిల్ 600 మి.లీ ఎంఆర్‌పి ₹ 253
కొనండి 1 పొందండి 1 ఉచితంగా వాసలిన్ డీప్ మాయిశ్చర్ బాడీ లోషన్ 400 మి.లీ ఎంఆర్‌పి ₹ 400*
₹195* మాత్రమే పార్క్ అవెన్యూ వోయేజ్ పెర్ఫ్యూమ్ స్ప్రే 220 మి.లీ ఎంఆర్‌పి ₹ 390
₹529* మాత్రమే ఏరియల్ మ్యాటిక్ ఫ్రంట్ లోడ్ లిక్విడ్ పౌచ్ 3.2 లీ ఎంఆర్‌పి ₹ 765
కిచెనవేర్
₹49*# నుంచి సంక్రాంతి స్టీల్ స్పెషల్
₹39*# నుంచి ప్లాస్టిక్ కంటెయినర్ అసార్టెడ్
₹99* మాత్రమే దాల్ కంటెయినర్ సెట్ 1500 మి.లీ 3 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 160
₹29*# నుంచి మేలమైన్ క్రాకరీస్ 15.24x15.24 సెం.మీ
₹29*# నుంచి గ్లాస్ జార్ 250 మి.లీ
₹179*# మాత్రమే క్రిస్‌లాన్ నాన్-స్టిక్ కడాయ్ 165 మి.మీ ఎంఆర్‌పి ₹ 220
₹1,549*# మాత్రమే బటర్‌ఫ్లై స్టెయిన్‌లెస్ స్టీల్ కుకర్ 3లీ ఎంఆర్‌పి ₹ 3,646
₹1,599*# నుంచి బ్రాండెడ్ మిక్సర్‌లు
BAJAJ Crompton USHA
వివాహ సీజన్‌కి సిద్ధమవ్వండి
₹199*# నుంచి గర్ల్స్ ఫ్యాషన్ ఫ్రాక్
₹199*# నుంచి గర్ల్స్ జీన్స్
₹79*# నుంచి బాయ్స్ మరియు గర్ల్స్ టీ-షర్ట్
₹249*# నుంచి బాయ్స్ షర్ట్
₹199*# నుంచి లేడీస్ లాంగ్ కుర్తీలు
₹99*# నుంచి లేడీస్ దుపట్టా
₹199*# నుంచి లేడీస్ యాంకిల్ కాటన్ స్ట్రెచ్ లెగ్గింగ్స్
₹599*# నుంచి కుర్తీ సెట్
₹399*# నుంచి బాయ్స్ కార్గో ప్యాంట్‌లు
₹99*# నుంచి లేడీస్ టీ-షర్ట్
₹149*# నుంచి లేడీస్ ఫ్యాన్సీ టాప్
₹349*# నుంచి లేడీస్ జీన్స్
₹199*# నుంచి లేడీస్ శాండిల్స్ అండ్ స్లిప్పర్
₹299*# నుంచి మెన్స్ ఎథ్నిక్ కుర్తా అండ్ పైజామా
₹449*# నుంచి మెన్స్ కాటన్ చినోస్
₹499*# నుంచి మెన్స్ జాగర్స్ అండ్ క్లాగ్స్
₹199*# నుంచి మెన్స్ క్యాజువల్ షూస్
ఎంఆర్‌పిపై 25% తగ్గింపు అన్ని బ్రాండెడ్ మెన్స్ అండర్‌గార్మెంట్స్
₹99*# నుంచి మెన్స్ ఫ్యాన్సీ టీ-షర్ట్
₹199*# నుంచి మెన్స్ ఫార్మల్/ క్యాజువల్ షర్ట్
₹349*# నుంచి మెన్స్ ఫార్మల్ ట్రౌజర్
₹349*# నుంచి మెన్స్ ఫ్యాషన్ జీన్స్
₹399*# నుంచి మెన్స్ ఫార్మల్ షూస్
కనీసం 6% డిస్కౌంట్
**విజయవాడ మరియు విశాఖపట్నంలో మాత్రమే లభిస్తోంది
1N
Impulse/01/24



యెమెన్‌లో దాడుల కోసం సైప్రస్ స్థావరం నుంచి టేకాఫ్ తీసుకున్న ఆర్ఏఎఫ్ టైఫూన్ యుద్ధ విమానం

బ్రిటన్ అమెరికా దాడులు

హౌతీలపై బాంబుల వర్షం

వాషింగ్టన్: హౌతీ ఉగ్రవాద ముఠాపై అమెరికా, బ్రిటన్ విరుచుకుపడ్డాయి. మిలిటెంట్ల ఆవాసాలు, ఆయుధాగారాలపై ఆ దేశాల సంయుక్త దళాలు గురు, శుక్రవారాల్లో భారీగా బాంబు దాడులు జరిపాయి. యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్ల ద్వారా ఏకకాలంలో తోమహాక్ క్షిపణులు తదితరాలు ప్రయోగించి పలు లక్ష్యాలను ఛేదించినట్టు అమెరికా అధికార వర్గాలు తెలిపాయి. వీటిలో యెమన్ రాజధాని సనా, ఎర్రసముద్రంలో హౌతీల కంచుకోట హుదాయ్దా వంటివి కూడా ఉన్నట్టు వివరించాయి. అక్కడి తీర ప్రాంత రాడార్ సైట్లతో పాటు డ్రోన్, మిసైళ్ల నిల్వ, ప్రయోగ కేంద్రాలను తాజా దాడుల్లో ధ్వంసం చేసినట్టు ప్రకటించాయి. ఎర్రసముద్రంలో ఉగ్ర మూకల దాడులను సహించబోమనేందుకు ఈ దాడులు తాజా రుజువని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. ఎర్రసముద్రంలో అంతర్జాతీయ రవాణా నౌకలపై హౌతీల మతిలేని దాడికి చరమగీతం పాడి తీరతామన్నారు. అందుకోసం మరిన్ని తీవ్ర చర్యలకు కూడా వెనకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ''చరిత్రలోనే తొలిసారిగా యాంటీ షిప్ బాలిస్టిక్ మిసైళ్లను హౌతీలు ప్రయోగిస్తున్నారు. ఇది అంతర్జాతీయ వర్తకానికి, నౌకలకు, నావికులకే గాక అమెరికా రక్షణ సిబ్బందికి కూడా ప్రమాదకరంగా మారింది'' అంటూ మండిపడ్డారు.

పరిస్థితులు ఉద్రిక్తం

సనాలో శుక్రవారం తెల్లవారుజామున కనీసం నాలుగు భారీ పేలుళ్లు సంభవించాయని స్థానిక జర్నలిస్టులు వెల్లడించారు. నగర పశ్చిమాన రేపు ప్రాంతంలో కూడా ఐదుకు పైగా భారీ పేలుళ్లు జరిగినట్టు చెబుతున్నారు. అక్కడికి దక్షిణాన ఉన్న తైజ్, ధమర్ వవంటి నగరాలపై కూడా దాడులు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో కొద్ది రోజుల పాటు దాడులకు దూరంగా ఉన హౌతీలు గత మంగళవారం ఉన్నట్టుండి భారీగా విరుచుకుపడటం తెలిసిందే. ఎర్రసముద్రంలోని నౌకలపైకి పెద్ద సంఖ్యలో క్షిపణులు ప్రయోగించాయి. అమెరికా, బ్రిటన్ యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లు తక్షణం స్పందించాయి. 18 డ్రోన్లను, రెండు మిసైళ్లు, ఒక యాంటీ షిప్ మిసైల్‌ను నేలకూల్చాయి. గురువారం కూడా గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో ఒక నౌకపైకి హౌతీలు షిప్ విధ్వంసక బాలిస్టిక్ మిసైల్‌ను ప్రయోగించారు. అది గురి తప్పడంతో భారీ నష్టం తప్పింది. దాంతో పరిస్థితిపై మంగళవారమే బైడెన్ అత్యవసర సమీక్ష జరిపారు. హౌతీలపై దాడులను తీవ్రతరం చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. మరోవైపు బ్రిటన్ రాయల్ ఎయిర్ ఫోర్స్ కూడా హౌతీలపై పెద్దపెట్టున దాడులు జరిపిందని ప్రధాని రిషీ సునాక్ ప్రకటించారు. తమ సంయుక్త దాడులకు నెదర్లాండ్స్, కెనడా, బెహ్రాయిన్ దన్నుగా నిలిచాయన్నారు. దాడులకు స్వస్తి పలకాలని ఆ్రస్టేలియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, బహ్రాయిన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా తదితర దేశాలు కూడా ఇప్పటికే హౌతీలను హెచ్చరించాయి. ఎర్రసముద్రంలో నౌకల భద్రత నిమిత్తం 22 దేశాలతో కలిసి 'ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్' పేరిట కొత్త సముద్ర రక్షణ మిషన్‌కు అమెరికా తాజాగా తెరతీసింది. ఇందులో భాగంగా నౌకల రక్షణార్థం అమెరికా తదితర దేశాల యుద్ధ నౌకలు ఎర్రసముద్ర జలాల్లో నిరంతరం గస్తీ కాస్తున్నాయి.

ఎవరీ ఎర్రసముద్రపు హౌతీలు!

హమాస్‌కు దన్నుగా అరాచకం

ఇజ్రాయెల్ లక్ష్యంగా ఎర్రసముద్రంలో నౌకలపై దాడులు

అంతర్జాతీయ సరుకు రవాణాపై తీవ్ర ప్రభావం

ఎర్రసముద్రం కొంతకాలంగా అల్లకల్లోలంగా మారింది. ఇరాన్ దన్నుతో హౌతీ ఉగ్రవాద ముఠాలు రెచ్చిపోతున్నాయి. ఆ మార్గం గుండా ప్రయాణిస్తున్న అంతర్జాతీయ సరుకు రవాణా నౌకలపై విచ్చలవిడి దాడులతో బెంబేలెత్తిస్తున్నాయి. యెమన్‌లో అత్యధిక భాగాన్ని నియంత్రిస్తున్న ఈ ఉగ్రవాద ముఠా సముద్ర దాడులు అంతర్జాతీయ సమాజానికి పెను సవాలుగా మారాయి. ఒకవిధంగా అంతర్జాతీయ వర్తకమే తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఇంతకూ ఎవరీ హౌతీలు? వీళ్లెందుకిలా ఉన్నట్టుండి సముద్ర సవాళ్లకు దిగినట్టు...?

- సాక్షి, నేషనల్ డెస్క్

గత అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనాలోని హమాస్ ఉగ్రవాదులు మెరుపుదాడికి దిగి కనీవినీ ఎరగని రీతిలో బీభత్సం సృష్టించడం తెలిసిందే. అందుకు ప్రతీకారంగా హమాస్ నిర్మూలనే లక్ష్యంగా పాలస్తీనాపై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ తెర తీసింది. హమాస్‌కు దన్నుగా హౌతీల ఆగడాలు అప్పటినుంచే పెచ్చరిల్లాయి. ఇజ్రాయెల్ వైపు ప్రయాణిస్తున్న ప్రతి నౌకనూ లక్ష్యం చేసుకుంటామని హౌతీలు హెచ్చరించారు. కానీ వాస్తవానికి ఇజ్రాయెల్‌తో ఏ సంబంధమూ లేని నౌకలను కూడా వదిలిపెట్టడం లేదు. కొద్ది రోజులుగానైతే కనిపించిన నౌక మీదల్లా విచ్చలవిడిగా దాడులకు దిగుతూ కల్లోలం సృష్టిస్తున్నారు. సమీపంలోని నౌకలపై డ్రోన్లు, సుదూరాల్లో ఉన్నవాటిపై ఏకంగా బాలిస్టిక్ మిసైళ్లు ప్రయోగిస్తూ గుబులు రేపుతున్నారు. గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఎర్రసముద్రంపై నౌకలపై హౌతీల దాడులు ఏకంగా 500 శాతం పెరిగిపోయాయి! వీటికి ఇరాన్ సహకారం కూడా పుష్కలంగా ఉందని అమెరికా ఆరోపిస్తోంది. మిత్ర రాజ్యాలతో కలిసి హౌతీల స్థావరాలపై కొద్ది రోజులుగా అమెరికా పెద్దపెట్టున క్షిపణి దాడులకు దిగుతోంది.

యెమన్ సాయుధ ముఠా..!

హౌతీలు యెమన్‌కు చెందిన సాయుధ ముఠా. 1990ల్లో నాటి దేశాధ్యక్షుడు అలీ అబ్దుల్లా సలే అవినీతిని ఎదిరించేందుకంటూ పుట్టుకొచ్చారు. అక్కడి షియా ముస్లిం మైనారిటీల్లో జైదీలనే ఉపతెగకు చెందినవారు. వీరి ఉద్యమ వ్యవస్థాపక నేత హుసేన్ అల్ హౌతీ పేరిట ఆ పేరు వచ్చింది. ఈ ముఠాను తొలుత అన్సర్ అల్లా (దేవ పక్షపాతులు)గా పిలిచేవారు...

- హౌతీలను అణచేసేందుకు సౌదీ అరేబియా సాయంతో సలే 2003లో విఫలయత్నం చేశాడు.
- యెమెన్ ప్రభుత్వంపై 2014 నుంచీ వీళ్లు తీవ్ర స్థాయిలో పోరాడుతున్నారు. ఫలితంగా పదేళ్లుగా దేశం అంతర్యుద్ధంతో అట్టుడికిపోతోంది.
- సౌదీ, యూఏఈ, ఇతర అరబ్ దేశాలన్నీ యెమన్ ప్రభుత్వానికి దన్నుగా ఉన్నా హౌతీలు ఎదిరించి నిలుస్తున్నారు.
- ఈ పోరాటంలో ఇప్పటికే ఏకంగా 3.5 లక్షల మంది దాకా బలైనట్టు అంచనా!
- అల్లర్లకు తాళలేక అర కోటి మందికి పైగా పొట్ట చేత పట్టుకుని యెమన్ నుంచి వలస బాట పట్టారని ఐరాస పేర్కొంది.
- అమెరికా, ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా ఇరాన్, పాలస్తీనా, హెజ్బొల్లా గ్రూపు తదితరాలతో కలిసి 'ప్రతిఘటన శక్తులు'గా హౌతీలు తమను తాము చెప్పుకుంటారు.
- వీరికి లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా గ్రూపు అండదండలు పుష్కలంగా ఉన్నాయి. అది వీరికి 2014 నుంచీ ఆయుధాలను, పూర్తిస్థాయి సాయుధ శిక్షణను అందిస్తూ వస్తోంది.
- ఇరాన్ కూడా హౌతీలకు పూర్తిగా దన్నుగా నిలుస్తోందని చెబుతారు. ముఖ్యంగా వారికి బాలిస్టిక్ మిసైళ్లను సమకూర్చింది ఇరానేనని అమెరికా రక్షణ శాఖ వర్గాలు అనుమానిస్తున్నాయి.
- 2019లో తమ చమురు క్షేత్రాలపై దాడులకు హౌతీలు వాడిన డ్రోన్లు, క్షిపణులను కూడా ఇరానే అందజేసిందని సౌదీ ఆరోపిస్తూ ఉంటుంది.
- గాజాపై యుద్ధం మొదలు పెట్టినప్పటి నుంచీ ఇజ్రాయెల్‌పై హౌతీలు పదేపదే బాలిస్టిక్ మిసైళ్లు, డ్రోన్లతో దాడులు చేస్తూనే ఉన్నారు.



పెను ప్రభావం...

ఆసియా, యూరప్ మధ్య సముద్ర రవాణాకు ఎర్రసముద్రమే అత్యంత దగ్గరి దారి. అంతేగాక అంతర్జాతీయ సముద్ర వర్తకంలో కనీసం 15 శాతానికి పైగా ఎర్రసముద్రం మీదుగా మధ్యధరా సముద్రం, సూయజ్ కాల్వ గుండానే సాగుతుంది. ఈ నేపథ్యంలో అక్కడ హౌతీల మతిలేని దాడుల ప్రభావం అంతర్జాతీయ వర్తకంపై భారీగా పడుతోంది...

- ఎర్రసముద్రం గుండా ప్రయాణించే నౌకలకు బీమా ప్రీమియాన్ని కంపెనీలు పది రెట్లకు పైగా పెంచాయి!
- మెడిటరేనియన్ షిపింగ్ కంపెనీ, మార్స్క్, హపాగ్–లాయిడ్, బ్రిటిష్ పెట్రోలియం వంటి పలు కంపెనీలు ప్రత్యామ్నాయ సముద్ర మార్గాలను ఎంచుకుంటున్నాయి.
- దాంతో అంతర్జాతీయ సరుకు రవాణా వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతోంది.
- అటు దాడులు, ఇటు బీమా వ్యయాలకు దడిచి పెద్ద రవాణా కంపెనీలన్నీ ఎర్రసముద్రం మార్గానికి ఓ నమస్కారం అంటున్నాయి.
- వెరసి ఇదంతా రవాణా వ్యయాలు బాగా పెరిగేందుకు కారణమవుతోంది.
- అంతర్జాతీయంగా చమురుతో పాటు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగేలా కన్పిస్తున్నాయి.

హౌతీల చెరలోనే యెమన్

నిజానికి రాజధాని సనాతో పాటు యెమన్ అత్యధిక భాగం హౌతీల వశంలోనే ఉంది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడమే గాక వారు సొంత కరెన్సీని కూడా ముద్రిస్తున్నారు! ఇక యెమన్‌లోని ఎర్రసముద్ర తీర ప్రాంతం మొత్తాన్నీ హౌతీలే నియంత్రిస్తున్నారు. ఇప్పుడదే ఆ మార్గం గుండా అంతర్జాతీయ సరుకు రవాణాకు పెను సవాలుగా మారింది. 2010 నాటికే ఈ ముఠాకు కనీసం లక్ష పై చిలుకు సాయుధ బలమున్నట్టు ఐరాస అంచనా వేసింది.

మందిర నిర్మాణానికి మోదీని ఎంచుకున్న విధి

వాజ్‌పేయీ లేకపోవడం నాకు వేదన కలిగిస్తోంది: అద్వానీ

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి విధి నరేంద్ర మోదీని ఎంచుకుందని బీజేపీ కురువృద్ధ నేత ఎల్‌కే అద్వానీ (96) పేర్కొన్నారు. 'రాష్ట్ర ధర్మ' ప్రత్యేక మ్యాగజీన్‌కు రాసిన వ్యాసంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం కోసం 33 ఏళ్ల క్రితం తాను చేపట్టిన రథయాత్రను ప్రస్తావించారు. ఆలయ ప్రారంభ సమయానికి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి లేకపోవడం వేదన కలిగిస్తోందన్నారు. ''నాటి రథయాత్ర ఆసాంతం ప్రధాని మోదీ నాతో పాటే ఉన్నారు. అప్పట్లో ఆయన గురించి ఎవరికీ పెద్దగా తెలీదు. కానీ ఆ శ్రీరాముడే ఆలయ పునర్నిర్మాణం కోసం ఆయన్ను ఎంచుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన ద్వారా ప్రతి పౌరుడికి మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు'' అన్నారు. రామాలయ కలను సాకారం చేసి తన లక్ష్యాన్ని నెరవేర్చుతున్నందుకు మోదీకి ధన్యవాదాలన్నారు.

ఆకాశ్–ఎన్‌జీ క్షిపణి ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ: దేశ సైనిక సంపత్తిని బలోపేతం చేసే కొత్త తరం ఆకాశ్–ఎన్‌జీ క్షిపణి ప్రయోగ పరీక్ష విజయవంతమైనట్లు రక్షణ శాఖ తెలిపింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఈ ప్రయోగం చేపట్టామని వెల్లడించింది. 80 కిలోమీటర్ల రేంజ్ కలిగిన ఈ క్షిపణి తక్కువ ఎత్తులో హైస్పీడ్‌తో వెళ్లే మానవ రహిత లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించినట్లు వివరించింది. ఈ ప్రయోగంతో యూజర్ ట్రయల్స్‌కు మార్గం సుగమమైనట్లు రక్షణ శాఖ తెలిపింది. ఇందులో దేశీయంగా రూపొందించిన రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్, లాంఛర్, మల్టీ ఫంక్షన్ రాడార్, కమాండ్ కంట్రోల్ కమ్యూనికేషన్ వ్యవస్థను వినియోగించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. డీఆర్‌డీవో సీనియర్ అధికారులు, భారత వైమానిక దళం, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఉన్నతాధికారులు ప్రయోగాన్ని స్వయంగా తిలకించారు. ఆకాశ్–ఎన్‌జీ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డీఆర్‌డీవో, వైమానిక దళం తదితర విభాగాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

మావోయిస్ట్ కీలక నేత బెంగాల్‌లో అరెస్ట్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ పోలీసులు వాంటెడ్ మావోయిస్ట్ నేత సవ్యసాచి గోస్వామి అలియాస్ కిశోర్(55)ను అరెస్ట్ చేశారు. ఆయన తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. జార్ఖండ్ సరిహద్దులకు సమీపంలోని అడవుల్లో గోస్వామిని పట్టుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బఘ్ముండి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చౌనియా గ్రామం వద్ద ఆయన ఉన్నట్లు తెలియడంతో గురువారం రాత్రి దాడి చేసి అరెస్ట్ చేశామన్నారు. ఆయన నుంచి ఒక పిస్టల్, నిషేధిత సాహిత్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్‌ఐఏ మోస్ట్ వాంటెడ్ జాబితాలో గోస్వామి ఒకరు, ఆయన్ను పట్టించిన వారికి రూ.10 లక్షల బహుమానం ఇస్తామని పోలీసు శాఖ ప్రకటించింది. బంకురా, పురులియా, ఝార్‌గ్రామ్, పశ్చిమ్ మేదినీపూర్ జిల్లాల్లో మావోయిస్ట్ పార్టీని బలోపేతం చేసేందుకు, నిధుల సేకరణకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. గోస్వామి అరెస్టను అతిపెద్ద విజయంగా ఆయన పేర్కొన్నారు. 'కిశోర్‌దా'గా మావోయిస్టులు పిలుచుకునే గోస్వామి దక్షిణ 24 పరగణాల జిల్లా సోడెపూర్ రోడ్ ప్రాంతానికి చెందిన వారు. ఇటీవలే ఆయన మావోయిస్ట్ పార్టీ 'ఈస్టర్న్ రీజినల్ బ్యూరో ఇన్‌చార్జి'గా బాధ్యతలు చేపట్టారు. గతంలో పోలీసులు పలుమార్లు అరెస్ట్ చేశారు.

ఎన్నికల సంఘ బాధ్యతలను మేము తీసుకోబోం

పీటీఐ గుర్తు వివాదంపై పాక్ సుప్రీంకోర్టు

ఇస్లామాబాద్: మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలోని పాకిస్తాన్ తెహ్రీక్‌- ఇ-ఇన్సాఫ్ (పీటీఐ)కు బ్యాట్ గుర్తు కేటాయింపు వివాదంపై ఆ దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం విధుల్లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోలేదని సీజేపీ జస్టిస్ క్వాజీ ఫయీజ్ ఇసా పేర్కొన్నారు. పార్టీలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించనందున పీటీఐకి ఎన్నికల గుర్తు బ్యాట్‌ను కేటాయించేందుకు ఎన్నికల సంఘం నిరాకరించడం, దానిపై రాజకీయ దుమారం రేగడం తెలిసిందే. దీనిపై పీటీఐ పెషావర్ హైకోర్టును ఆశ్రయించగా, ఊరట లభించింది. అనంతరం ఎన్నికల సంఘం నిర్ణయాన్ని పెషావర్ హైకోర్టు తప్పుపట్టింది. బ్యాట్ గుర్తును పునరుద్ధరించాలంటూ ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఎన్నికల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా సీజేపీ జస్టిస్ ఇసా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ''రాజ్యాంగ, చట్టబద్ధమైన సంస్థ విధుల మధ్య చాలా స్పష్టమైన విభజన రేఖ ఉంది. ఈసీ తన బాధ్యతలను నిర్వరిస్తున్నప్పుడు న్యాయవ్యవస్థకు అత్యున్నత ప్రతినిధిగా మేమెలా జోక్యం చేసుకోగలం? అదెలా సరైన చర్య అవుతుంది? ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థ. రాజకీయ పార్టీల వ్యవహారాలను నియంత్రించడం, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపడం'' అని ఆయన పేర్కొన్నారు





నాసిక్‌లోని శ్రీ కాలారామ్ ఆలయం వద్ద మోదీ శ్రమదానం. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు



అటల్ సేతుపై ప్రధాని మోదీ

వారసత్వ రాజకీయాలకు ముగింపు పలకాలి

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

నాసిక్: దేశంలో వారసత్వ రాజకీయాల ప్రభావాన్ని తగ్గించాల్సిన బాధ్యత యువతరంపై ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అందుకోసం వారంతా వెంటనే ఓటర్లుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ''మన దేశపు 21వ శతాబ్దపు యువత అత్యంత అదృష్టవంతులని పేర్కొన్నారు. అమృత కాలంలో దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చే అద్భుత అవకాశం వారికి లభించింది'' అన్నారు. మహారాష్ట్రలో నాసిక్‌లోని తపోవన్ మైదానంలో శుక్రవారం 27వ 'నేషనల్ యూత్ ఫెస్టివల్'ను మోదీ ప్రారంభించారు. స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ తల్లి జిజాబాయి విగ్రహాల వద్ద నివాళులర్పించారు. మాదక ద్రవ్యాలకు, అసభ్య పదజాలానికి దూరంగా ఉండాలని యువతకు సూచించారు.

యువతకు కర్తవ్య కాలం

రాబోయే 25 ఏళ్ల అమృత కాలం యువతకు 'కర్తవ్య కాలం' అని మోదీ ఉద్ఘాటించారు. యువత ఓటు ద్వారా రాజకీయ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే దేశానికి మేలు జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో వారు ఎంతగా పాల్గొంటే దేశ భవిష్యత్తు అంత గొప్పగా ఉంటుందన్నారు. వారసత్వ రాజకీయాల ప్రభావమూ అంతగా తగ్గిపోతుందన్నారు. అరబిందో, వివేకానంద గొప్పతనాన్ని, వారు అందించిన సేవలను ప్రస్తావించారు.

నాసిక్ రామకుండ్‌లో పూజలు

మోదీ శుక్రవారం మహారాష్ట్రలో నాసిక్‌లోని శ్రీ కాలారామ్ మందిరాన్ని దర్శించుకున్నారు. రామ్‌కుండ్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు నగరంలో రోడ్ షోలో పాల్గొన్నారు. తర్వాత గోదావరి తీరంలోని రామ్‌కుండ్ వద్ద సంప్రదాయ తలపాగా ధరించి పూజలు చేశారు. జల పూజ, హారతిలో పాలుపంచుకున్నారు. అఖిల భారతీయ స్వామి సమర్థ్ గురుకుల పీఠం అధినేత అన్నాసాహెబ్ మోరే, కైలాస్ మఠాధిపతి స్వామి సంవిదానంద సరస్వతి, తుషార్ బోసలేను కలుసుకున్నారు. తర్వాత పంచవటిలోని ప్రఖ్యాత కాలా రామ్ మందిరంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మోదీ శ్రమదానం చేశారు. చీపురు చేతపట్టి పరిసరాలను చెత్తాచెదారం ఊడ్చేశారు. దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తూ 1930 మార్చి 2న ఇదే మందిరంలో అంబేడ్కర్ తన అనుచరులతో కలిసి నిరసన చేపట్టారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శుక్రవారం రూ.30,000 కోట్ల పై చిలుకు విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించారు.

'అటల్ సేతు' ప్రారంభం


ముంబై: 21.8 కిలోమీటర్లతో అత్యంత పొడవైన సముద్ర వారధి 'అటల్ బిహారీ వాజ్‌పేయి సెవ్రీ–నవా షెవా అటల్ సేతు'ను మోదీ శుక్రవారం ప్రారంభించారు. 'వికసిత్ భారత్'కు ఈ సేతు ఒక ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు. ఈ ఆరు లేన్ల బ్రిడ్జి మహారాష్ట్రలో దక్షిణ ముంబై–నవీ ముంబైని అనుసంధానిస్తుంది.

ప్రధాని మోదీ 11 రోజుల ప్రత్యేక అనుష్ఠానం

న్యూఢిల్లీ: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ శుక్రవారం నుంచి 11 రోజుల అనుష్ఠానం ప్రారంభించినట్టు ప్రధాని మోదీ వెల్లడించారు. ''నాకు చాలా ఉద్వేగంగా ఉంది. జీవితంలో తొలిసారిగా ఇలాంటి భావాలు నా మదిలో వెల్లువెత్తుతున్నాయి. వాటిని అనుభూతి చెందగలను తప్ప మాటల్లో వ్యక్తీకరించలేను. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం ప్రపంచవ్యాప్తంగా భారతీయులందరికీ, రామ భక్తులకు పవిత్ర సందర్భం. గొప్ప వేడుక. ఈ అరుదైన సందర్భానికి ప్రత్యక్ష సాక్షిని కావడం నా అదృష్టంగా భావిస్తున్నా. బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు భారతీయులందరి తరఫున ప్రాతినిధ్యం వహించడానికి భగవంతుడు నన్ను సాధనంగా ఎంచుకున్నాడు. నన్ను ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నా'' అని పేర్కొన్నారు. అనుష్ఠానంలో భాగంగా మోదీ నిత్యం సూర్యోదయానికి ముందే మేల్కొంటారు. యోగా, ధ్యానం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాత్వికాహారమే స్వీకరిస్తారు.

వేలానికి తొలి పోస్టల్ స్టాంప్

ప్రపంచంలోనే మొదటిదని భావిస్తున్న 180 ఏళ్ల నాటి పోస్టల్ స్టాంప్ వేలానికి వచ్చింది. ఒక పెన్నీ ముఖ విలువతో కూడిన దీనికి దాదాపు రూ.20 కోట్ల (25 లక్షల డాలర్ల) దాకా పలకవచ్చని భావిస్తున్నారు. 1850 మే 2 నాటి తేదీ ఉన్న ఈ నల్ల రంగు స్టాంప్‌ను పెన్నీ బ్లాక్ స్టాంప్‌గా పిలుస్తారు. ఇంగ్లండ్‌లో బెడ్లింగ్టన్ పట్టణానికి చెందిన విలియం బ్లెంకిన్‌సోప్ అనే వ్యక్తికి అక్కడికి 300 మైళ్ల దూరంలోని లండన్ నుంచి పంపిన లెటర్‌పై దీన్ని అంటించారు. ఇలా స్టాంపులంటించడం ద్వారా పోస్టేజీ చార్జీలను ముందుగానే చెల్లించే పద్ధతి అప్పటిదాకా ఉండేది కాదు. లెటర్లను అందుకునే వాళ్లే పోస్ట్‌మాన్‌కు పోస్టేజ్ రుసుము చెల్లించేవాళ్లు. వాళ్లు గనక లెటర్లను తీసుకునేందుకు నిరాకరిస్తే పోస్టల్ శాఖకు నష్టమే మిగిలేది. దీనికి చెక్ పెట్టేందుకు సర్ రోలాండ్ హిల్ ఈ పెన్నీ బ్లాక్ పోస్టల్ స్టాంప్‌ను రూపొందించాడు. ప్రఖ్యాత వేలం సంస్థ సోత్‌బీ ఫిబ్రవరిలో దీన్ని వేలం వేయనుంది. ప్రపంచ సమాచార వ్యవస్థలోనే విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఈ పోస్టల్ స్టాంప్ వేలానికి రావడం ఎంతో ఎక్సైటింగ్‌గా ఉందని సోత్‌బీ గ్లోబల్ హెడ్ రిచర్డ్ ఆస్టిన్ అన్నారు.



- సాక్షి, నేషనల్ డెస్క్

అయోధ్య రాముడికి 2.5 కిలోల విల్లు

లక్నో: శ్రీరాముడు అనగానే గుర్తొచ్చే రూపం విల్లు బాణం ధరించిన నిండైన విగ్రహం. ఈ నెల 22న అయోధ్యలోని భవ్య మందిరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరుగనుంది. ఆలయంలో కొలువుదీరే రామయ్యకు బహూకరించడానికి తమిళనాడు రాజధాని చెన్నైలో విల్లు, బాణాలు సిద్ధమవుతున్నాయి. ప్రధాన విగ్రహానికి ఈ విల్లు, బాణాలు అలంకరిస్తారు. 2.5 కిలోల బరువైన ఈ విల్లు తయారీకి ఇతర లోహాలతోపాటు దాదాపు 700 గ్రాముల 23 క్యారెట్ బంగారం ఉపయోగిస్తున్నట్లు అయోధ్యలోని అమావా రామ మందిర్ ట్రస్టీ శయన్ కునాల్ చెప్పారు. వాల్మీకి రామాయణంలో వర్ణించినట్లుగానే విల్లుతోపాటు బాణాలు తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. రాముడు ఉపయోగించిన వేర్వేరు బాణాల వర్ణన వాల్మీకి రామాయణంలో ఉందన్నారు. చెన్నైలో సిద్ధమవుతున్న విల్లు, బాణాలు త్వరలో అయోధ్యకు చేరుకుంటున్నాయని వెల్లడించారు. ఈ నెల 19న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు వీటిని అందజేస్తామని చెప్పారు.

రామ భక్తులు అయోధ్యకు ఎప్పుడైనా వెళ్లొచ్చు

న్యూఢిల్లీ: శ్రీరాముడిపై విశ్వాసం ఉన్న వారు అయోధ్యలోని ఆలయానికి ఎప్పుడైనా వెళ్లవచ్చని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో జరగనున్న ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వెళ్లరాదన్న కాంగ్రెస్ నిర్ణయం కుట్రలో భాగమంటూ బీజేపీ చేసిన ఆరోపణలపై ఖర్గే మీడియా ఎదుట ఈ మేరకు స్పందించారు. బీజేపీ కుట్రలో తాము చిక్కుకోమని అంటూ ఆయన.. అధిక ధరలు, నిరుద్యోగం వంటి ప్రజల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. 'అయోధ్యలో జరగనున్న ఉత్సవానికి సంబంధించి ఈ నెల 6వ తేదీనే స్పష్టం చేశాం. శ్రీరామునిపై నమ్మిక ఉన్న వారు రేపు, ఎల్లుండి ఎప్పుడైనా అయోధ్య వెళ్లొచ్చు. ఈ విషయమై బీజేపీ మాపై దాడి చేయడం సరికాదు. విమర్శలు చేయడం బీజేపీ కుట్రే. అందుకే ఇదే అంశాన్ని బీజేపీ పదేపదే ప్రస్తావిస్తోంది'అని ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ ఏ మతాన్ని, ఏ గురువును ఎన్నడూ అవమానించలేదన్నారు.

కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శలు

రాముడిని వ్యతిరేకించడం కాంగ్రెస్ సంప్రదాయమంటూ బీజేపీ దుయ్యబట్టింది. ఇందుకు సంబంధించిన 35 సెకన్ల వీడియోను, రామ విరోధి కాంగ్రెస్ అంటూ పోస్టర్‌ను విడుదల చేసింది. అందులో, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ వివిధ సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు..'గత జన్మపై నమ్మకం లేకుంటే శ్రీరాముడిని ఎలా నమ్ముతావు?, రామసేతు ఒక భ్రమ, శ్రీరాముడి ఉనికిని ప్రశ్నించడం, అయోధ్యపై సుప్రీంకోర్టును ప్రశ్నించడం, విగ్రహ ప్రతిష్ఠాప కార్యక్రమ ఆహ్వానాన్ని తిరస్కరించడం' వంటివి ప్రస్తావించింది.

లండన్ మేయర్ ఎన్నికల బరిలో ఇద్దరు భారత సంతతి వ్యాపారవేత్తలు

లండన్: ప్రతిష్ఠాత్మక లండన్ మేయర్ పదవికి భారత సంతతికి చెందిన ఇద్దరు వ్యాపారవేత్తలు పోటీ పడనున్నారు. మే 2వ తేదీన జరగనున్న ఈ ఎన్నికలో వీరిద్దరూ స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దీంతో, 2016 నుంచి లండన్ మేయర్‌గా కొనసాగుతున్న పాక్ సంతతికి చెందిన సాదిక్ ఖాన్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది. ఢిల్లీలో జన్మించిన తరుణ్ గులాటి(63) స్ట్రాటజిక్ అడ్వైజర్‌గా లండన్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో భారత్ పర్యటన సమయంలో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అదేవిధంగా, ప్రాపర్టీ వ్యాపారి శ్యామ్ భాటియా(62) మేయర్ ఎన్నికల బరిలో నిలవనున్నట్లు తాజాగా ప్రకటించారు. గులాటి ఎన్నికల ట్యాగ్ లైన్ 'విశ్వాసం–అభివృద్ధి'కాగా, భాటియా 'అంబాసిడర్ ఆఫ్ హోప్'ట్యాగ్‌లైన్‌తో ముందుకు వెళ్తున్నారు.

నేడు 'ఇండియా' కూటమి వర్చువల్ భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి కీలక నేతలు ఈ నెల 13న సమావేశం కానున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపిణీ అంశం, కూటమి బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను చర్చించనున్నారు. శనివారం ఉదయం వర్చువల్‌గా జరిగే ఈ సమావేశంలో టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ పాల్గొనడం లేదు. పలు కార్యక్రమాల్లో ఆమె బిజీగా ఉన్నారని కూటమి నేతలు అంటున్నారు. నితీశ్ కుమార్‌కు ఇండియా కూటమి కన్వీనర్ బాధ్యతలివ్వాలంటూ జేడీయూ కోరుతుండగా, టీఎంసీ ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తోంది. ఈ అంశంపైనా నేటి సమావేశంలో నేతలు చర్చించనున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు

- సర్వీసు నిబంధనలు సవరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు



సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. సర్వీసు నిబంధనల్లోని క్రమశిక్షణ చర్యలు, వాటిపై అప్పీళ్లు, సమీక్షలకు సంబంధించి ఉద్యోగుల డిమాండ్‌పై సానుకూలంగా స్పందించింది. ఆమేరకు ఏపీఎస్‌ఆర్టీసీ సర్వీసు నిబంధనలు–2023లోని సెక్షన్–5ను సవరిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 జూలై 25 కంటే ముందు చేపట్టిన చర్యలకు ఈ సవరణ వర్తిస్తుందని పేర్కొంది. ఉద్యోగులపై చర్యలకు సంబంధించి చార్జ్‌షీట్లను డిస్పోజ్ చేసేటప్పుడు ఉమ్మడి జిల్లా డిప్యూటీ సీటీఎంలను కమిటీ సభ్యులుగా చేర్చడం, అప్పీళ్లను డిస్పోజ్ చేసేటప్పుడు రివ్యూ అథారిటీలో ఉమ్మడి జిల్లా రీజనల్ మేనేజర్‌ను సభ్యుడిగా చేర్చడం, ఆ పైస్థాయిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు మెర్సీ పిటిషన్‌ను పరిశీలించేందుకు అనుమతించింది. రెండేళ్లగా అప్పీళ్లు, రివ్యూ అథారిటీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వులతో ఊరట లభించింది. వారి కేసుల సత్వర పరిష్కారానికి మార్గం సుగమమైంది. 2023 జులై 25 తరువాత వచ్చిన కేసులకు మాత్రం తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు వేచి ఉండాలని అధికారులు పేర్కొన్నారు.

ఉద్యోగ సంఘాల హర్షం

సర్వీసు నిబంధనలను సవరించడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వానికి పలు సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, కార్యనిర్వహణ అధ్యక్షుడు జీఎం నాయుడు, ప్రధాన కార్యదర్శి డీఎస్‌పీ రావు, నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలియజేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా విజయవాడలో ఏర్పాటు చేసిన 'భారతరత్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల విగ్రహం ప్రారంభోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల 19న అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం నేపథ్యంలో ఏర్పాట్లపై శుక్రవారం సీఎస్ తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని, అనంతరం ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని జిల్లాల నుంచి అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు వేలాదిగా పాల్గొంటారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నెల 19న ఒకేసారి వేలాది మంది తరలిరావడం వల్ల విజయవాడలో స్థలాభావం, ట్రాఫిక్ వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో అందరూ ఒకేరోజు రాకుండా 19 నుంచి 26వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించి రోజుకు రెండు, మూడు జిల్లాల నుంచి 20వేల మంది వచ్చేలా చూస్తే బాగుంటుందని, ఈ మేరకు కార్యాచరణ రూపొందించాలని సీఎస్ చెప్పారు.

75వ రిపబ్లిక్ డే వేడుకలకు విస్తృత ఏర్పాట్లు: సీఎస్

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న 75వ రిపబ్లిక్ డే వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సీఎస్ తన క్యాంపు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ 26వ తేదీ ఉదయం 9 గంటలకు మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి రిపబ్లిక్ డే వేడుకల్లో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. తొలుత రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.ముత్యాలరాజు వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వీలుగా శాఖల వారీగా శకటాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకల అనంతరం ఆ శకటాలు విజయవాడ నగర ప్రధాన రహదారిపై ప్రదర్శనగా వెళ్లేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉన్నదాన్ని వాడుకుందాం..!


- రాయ్‌గఢ్–పుగలూర్ హెచ్‌వీడీసీ సిస్టమ్ రివర్స్ పవర్ సామర్థ్యం అంచనా
- 3 వేల మెగావాట్లకు మించి రివర్స్ పవర్ ఫ్లో సామర్థ్యం పెంపు
- సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సదరన్ రీజియన్ పవర్ కమిటీ సూచన
- ఎస్‌ఆర్‌పీసీ చైర్మన్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా అదనపు ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ ఏర్పాటుచేసే బదులు ఉన్న 6వేల మెగావాట్ల రాయగఢ్–పుగలూరు–త్రిచూర్ (ఆర్పీటీ) హైవోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్వీడీసీ) ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌ను పూర్తి సామర్థ్యంతో రివర్స్ మోడ్‌లో ఉపయోగించుకునే అవకాశంపై సదరన్ రీజినల్ పవర్ కమిటీ (ఎస్‌ఆర్‌పీసీ) చర్చించినట్లు ఎస్‌ఆర్‌పీసీ చైర్మన్, రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఐఎల్) ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌పీసీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఏపీ ప్రతినిధిగా విజయానంద్ హాజరయ్యారు. ఆర్పీటీ హెచ్వీడీసీని దిగుమతి మోడ్‌కు మాత్రమే ఆమోదించినప్పటికీ, దాదాపు 50 శాతం (3 వేల మెగావాట్లు) ఎగుమతి మోడ్‌తో ఉపయోగించవచ్చనే అంశాన్ని ఎస్‌ఆర్‌పీసీ కమిటీ పరిశీలిస్తుందని ఆయన వెల్లడించారు. ఇందుకోసం హిటాచీ ఎనర్జీ ఇండియా అధ్యయనాలకు వెళ్లాలని ఎస్‌ఆర్‌పీసీ టెక్నికల్ కో–ఆర్డినేషన్ సబ్–కమిటీ, పీజీసీఐఎల్‌కు సిఫార్సు చేసిందని ఆయన చెప్పారు. రివర్స్ పవర్ ఫ్లో కెపాసిటీ పెంపుదల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని, ప్రాథమిక అధ్యయనం చేయాలని కమిటీ సూచించిందన్నారు. ప్రస్తుత సాంకేతిక పరికరాల్లో మార్పులతో సహా దాని అమలుకు దాదాపు రూ.75 కోట్ల నుంచి రూ.81 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుందని అంచనా వేసినట్లు విజయానంద్ వివరించారు. పవర్ గ్రిడ్, హిటాచీలతో సంయుక్తంగా అధ్యయనం చేసి నెలరోజుల్లో నివేదిక సమర్పించాలని సమావేశంలో ఏకాభిప్రాయం తీసుకుందని, తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏపీలో విద్యుత్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు మద్దతిస్తున్న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి, సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలకు ఈ వేదిక ద్వారా విజయానంద్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో.. కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు సీఎండీ డాక్టర్ రాజన్ ఎన్ ఖోబ్రగాడే, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ కె వరుణ్‌రెడ్డి, పవర్‌గ్రిడ్ సీఎండీ ఆర్కే త్యాగి, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని హత్యకేసులో జీవితఖైదు

- ప్రేమ నిరాకరించిందని ప్రాణం తీశాడు
- యువకుని ఘాతుకం.. సహకరించిన స్నేహితులకూ శిక్ష



శిరీష (ఫైల్)

కడప అర్బన్/బద్వేలు అర్బన్: వైఎస్సార్ జిల్లా బద్వేలు మండలం చింతలచెరువు గ్రామంలో డిగ్రీ విద్యార్థినిని హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గల్లా శ్రీదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల మేరకు.. బద్వేలు మండలం చింతలచెరువుకు చెందిన గొడుగునూరు సుబ్బయ్య, సుబ్బమ్మల కుమార్తె శిరీష. పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అట్లూరు మండలం మాడపూరు పంచాయతీ చిన్నరాజుపల్లెకు చెందిన యువకుడు బాలరాజు చరణ్ కొంత కాలంనుంచి శిరీషను ప్రేమ పేరుతో వేధించసాగాడు. ఈ క్రమంలో విద్యార్థిని గ్రామానికి చెందిన నాయబ్‌రసూల్, మాడపూరుకు చెందిన పేరుసోముల నరసింహ సహకారం తీసుకున్నాడు. వారితో తరచూ శిరీష గ్రామానికి వచ్చి వెళ్లేవాడు. అయితే బాలరాజు చరణ్ ప్రేమ వ్యవహారాన్ని అమ్మాయి నిరాకరించింది. దీంతో ఆమెను అంతమొందించాలనుకున్నాడు. 2021 జూన్, 18న శిరీష పత్తి చేను వద్దకు వెళ్లిందన్న విషయం నాయబ్‌రసూల్ ద్వారా తెలుసుకున్నాడు. చింతలచెరువుకు వెళ్లి అక్కడ స్నేహితులు ముగ్గురూ మాట్లాడుకున్నారు. అనంతరం శిరీష దగ్గరకు బాలరాజు చరణ్ వెళ్లాడు. పథకంలో భాగంగా తనతో తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణా రహితంగా దాడి చేసి గొంతు కోసి పారిపోయాడు. దీంతో విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. హతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ సీఐ రమేశ్ బాబు, ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.ఈ కేసులో బాధిత కుటుంబం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.ప్రతాప్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. విచారణ అనంతరం ఎ1 నిందితుడైన చరణ్‌కు జీవితఖైదుతో పాటు రూ.3 వేలు జరిమానా, ఎ2, ఎ3 నిందితులైన నాయబ్‌రసూల్, నరసింహలకు జీవితఖైదుతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అంగన్‌వాడీల సమస్యలపై
సర్కారు సానుభూతి

- మూడు సార్లు చర్చలు జరిపింది అందుకే...
- జీతాలు మినహా అన్నింటినీ ఆమోదించాం
- జూలై వరకూ వేతనాల పెంపుపై గడువు కోరాం
- చర్చల అనంతరం మీడియాతో సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలపై సానుభూతితో వ్యవహరిస్తోందనీ, ఆయన ఆదేశాలతో ఇప్పటి వరకు మూడు సార్లు చర్చలు జరిపామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వారికి వీలైనంతవరకూ మేలు చేసేందుకే ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులతో రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం రాత్రి చర్చలు జరిపారు. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడుతూ అంగన్‌వాడీల కోర్కెలు అన్యాయమని అనడంలేదని, ప్రభుత్వ ఇబ్బందులను కూడా వారు గుర్తించాలని కోరామని చెప్పారు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా వారిపై ఎటువంటి ఇబ్బందికర చర్యలు చేపట్టలేదన్న విషయాన్ని గమనించాలని తెలిపారు. రాష్ట్రంలో ఏడు లక్షల మంది పిల్లలకు ఆహారం, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీకి నెల రోజులుగా ఇబ్బంది ఏర్పడిందనీ, వారికి సేవలు అందకపోవడంవల్ల పేద వర్గాలే ఇబ్బంది పడుతున్నాయనీ, పరిస్థితిని అర్థం చేసుకుని సమ్మెను విరమించాలని కోరుతున్నామన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

అడిగినవన్నీ ఆమోదించాం..

- ఇప్పటికే రిటైర్మెంట్ బెనిఫిట్ కింద అంగన్‌వాడీ వర్కర్లకు రూ.50 వేల నుంచి రూ.లక్షకు, హెల్పర్లకు రూ.20 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాం. దానిపై వారు మరోసారి ప్రతిపాదించడంతో వర్కర్లకు రూ.1.20లక్షలకు, హెల్పర్లకు రూ.50 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాం.
- సర్వీసులో ఉండగా చనిపోతే గతంలో రూ.3వేలే ఇచ్చేవారు. దాన్ని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రూ.25 వేలు ఇవ్వాలని కోరగా రూ.20 వేలు ఇస్తామన్నాం.
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు, పదోన్నతుల వయో పరిమితి 40 నుంచి 50 ఏళ్లకు అంగీకరించాం.
- టీఏ, డీఏలు, హౌస్ రెంట్ అలవెన్స్ ఎప్పటికప్పుడు రెగ్యులర్‌గా ఇచ్చేలా ఆమోదించాం. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చేందుకు అంగీకారం తెలిపాం.
- మిగిలిన డిమాండ్లు కూడా సమ్మె విరమిస్తే ప్రాధాన్యత క్రమంలో తీరుస్తాం.

వేతనం పెంపుపై పట్టు తగదు..


- చంద్రబాబు హయాంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన వేతనం ఎంత? వైఎస్ జగన్ ఇస్తున్న వేతనం ఎంత? అనేది అంగన్‌వాడీలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.
- 2014లో అంగన్‌వాడీ వర్కర్లకు రూ.4,200, హెల్పర్లకు రూ.2,200, అదే 2016లో రూ.7 వేలు, రూ.4,500 ఇచ్చారు. అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల వేతనం పెంచుతామని పాదయాత్రలో జగన్ హామీ ఇవ్వడంతో ఎన్నికల ఆర్నెల్ల ముందు చంద్రబాబు వేతనాలు పెంచినా... సక్రమంగా అందించలేదు.
- ఇచ్చిన మాట ప్రకారం జగన్ అధికారం చేపట్టిన వెంటనే జూలైలో వర్కర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7వేలకు వేతనాలు పెంచారు. చంద్రబాబు హయాంలో వర్కర్లకు సగటున నెలకు రూ.6,100 మాత్రమే వస్తే... జగన్ పాలనలో నాలుగున్నరేళ్లుగా రూ.11,500 ఇస్తున్నారు.

వేతనాల పెంపునకు గడువు కోరాం

- ప్రభుత్వానికి ఆర్థిక పరమైన అంశాలను అంచనా వేసుకుని వచ్చే ఆర్థిక సంవత్సరం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చాం. 2019 జూలైలో వేతనాలు పెంచాం. కనీసం ఐదేళ్ల గడువు ఇవ్వాలని చెప్పాం. వచ్చే జూలైలో ఆమోదయోగ్యమైన విధంగా వేతనాలు పెంచుతామనీ, సమ్మె విరమించాలని కోరాం. యూనియన్లు ఇప్పటికైనా ఆలోచించాలి.
- రాష్ట్రంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లలు నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నా అంగన్‌వాడీల సమ్మె విషయంలో సంయమనం పాటించాం.
- ఎస్మా విషయంలో రాజకీయ పార్టీలు, అంగన్‌వాడీలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
- ఒక రాజకీయ అజెండాతో రెచ్చగొడుతున్న ప్రతిపక్షాల డైరెక్షన్‌లో అంగన్‌వాడీలు వెళితే నష్టపోక తప్పదు.
- అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇందుకోసం గురువారం నుంచి నోటీసులు ఇస్తోంది. పది రోజుల గడువు ఇచ్చి కొత్త వారిని నియమించుకుంటాం. తెగే వరకు సమస్యను సాగదీయకుండా అంగన్‌వాడీలు అర్థం చేసుకుని సమ్మె విరమించాలి.

ఇస్రో చైర్మన్ కు ఇండియన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు

- కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ పీఎంఓ కార్యదర్శి నుంచి అందుకున్న సోమనాథ్
- 2028 నాటికి భారతీయ అంతరిక్ష స్టేషన్ నిర్మాణం చేపడతామని వెల్లడి



కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, పీఎంఓ కార్యదర్శి జితేంద్రసింగ్ చేతులు మీదుగా అవార్డును అందుకుంటున్న ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ ఎస్.సోమనాథ్‌కు 2023 సంవత్సరానికి ఇండియన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, పీఎంఓ కార్యదర్శి డాక్టర్ జితేంద్ర చేతుల మీదగా శుక్రవారం ఆయన అవార్డు అందుకున్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చరిత్రలో 2023 సంవత్సరం ప్రత్యేకంగా నిలిచింది. ఆ ఏడాది జులై 14న చంద్రయాన్–3 ప్రయోగం చేపట్టి విశ్వవ్యాప్తంగా ఇస్రో కీర్తిపతాకాన్ని ఎగురవేసింది. చంద్రుడి దక్షిణ ధృవం ప్రాంతంలో ల్యాండర్‌ను సేఫ్ ల్యాండింగ్ చేయడంతో పాటు, రోవర్‌ను చంద్రుడి పైకి దించి పరిశోధనలు వంటి ప్రయోగాలతో ఇస్రో ప్రపంచ చరిత్ర పుటల్లోకి ఎక్కింది. అదే ఏడాది సెప్టెంబర్ 2న ఆదిత్య ఎల్1 ప్రయోగాన్ని చేపట్టి జనవరి 6న సూర్యుడికి దగ్గరగా వున్న లాంగ్రేజియన్ బిందువు 1 వద్దకు చేరుకుని విజయవంతంగా పని చేస్తోంది. ఇంతటి ఘన విజయాలను సాధించిన ఇస్రో శాస్త్రవేత్తల కృషి వెనక సంస్థ చైర్మన్ ఎస్. సోమనాథ్ కీలకపాత్ర పోషించడంతో ఆయనకు ఈ అవార్డు వరించింది. ఈ సందర్భంగా చైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ 2028 నాటికి భారతీయ అంతరిక్ష స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. 2035 నాటికి హ్యూమన్ స్పేస్ ప్రోగ్రాంలో భాగంగా మానవుడిని చంద్ర మండలం మీదకు తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చే ప్రయోగాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇస్రో సిబ్బంది అందరి కృషి వల్లే తనకు అవార్డు వచ్చిందని ఈ విజయం వారికే చెందుతుందన్నారు.

కృష్ణాజలాల వివాదంపై 17న ఉన్నతస్థాయి సమావేశం

సాక్షి, అమరావతి: కృష్ణాజలాల వివాదంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.జవహర్‌రెడ్డి, శాంతికుమారిలతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఈనెల 17న ఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన హక్కులను కాపాడుకోవడానికి తన భూభాగంలోని సాగర్ స్పిల్‌వేలో సగం, కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌ను గతేడాది నవంబర్ 30న స్వాధీనం చేసుకోవడంతో ఉత్పన్నమైన వివాదంతోపాటు.. ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించడమే ఈ సమావేశం ప్రధాన అజెండా. స్పిల్‌వేలో సగం, కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌ను నవంబర్ 30న ఏపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఉత్పన్నమైన వివాదంపై డిసెంబర్ 1న కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ బల్లా రెండు రాష్ట్రాల సీఎస్‌లతో ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించి, సాగర్‌పై యథాస్థితిని కొనసాగించాలని ఆదేశించారు.

క్లుప్తంగా...

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

సాక్షి, అమరావతి: దళారుల మాటలు నమ్మి కాంట్రాక్ట్ ఉద్యోగులు మోసపోవద్దని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల నుంచి కొంతమంది దళారులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికొచ్చిందని పేర్కొన్నారు. లంచం ఇచ్చినా, తీసుకున్నా ఇరువురూ శిక్షార్హులేనని స్పష్టం చేశారు. వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఒప్పంద సిబ్బందిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ 21న జీవో నంబర్ 114ను జారీ చేసిందని తెలిపారు. అనంతరం సంబంధిత ఒప్పంద సిబ్బందికి చెందిన వివరాల్ని ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చే ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. పూర్తి పారదర్శకంగా, అవకతవకలకు తావులేకుండా క్రమబద్ధీకరణ ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు.

సీడీఎంఏగా వివేక్ యాదవ్‌కు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ)గా ఉన్న పి.కోటేశ్వర్‌రావును ప్రభుత్వం అడిషనల్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. దీంతో ఆయన స్థానంలో ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌గా ఉన్న వివేక్ యాదవ్‌కు సీడీఎంఏగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.

29, 30 తేదీల్లో స్టీల్‌ప్లాంట్ సమ్మె



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం(గాజువాక): ఉక్కు పరిశ్రమలోని పలు డిమాండ్లపై ఈనెల 29, 30 తేదీల్లో సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు శుక్రవారం స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేకు సమ్మె నోటీసు అందజేశాయి. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ సమ్మె చేపట్టనున్నారు. ఉక్కు కార్మికులకు కొత్త వేతనాలు అమలు చేయాలని, అదనపు ఇంక్రిమెంట్ ఇవ్వాలని, స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక విక్రయం నిలిపివేయాలని, సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయాలని, జిందాల్‌తో ఎంఓయూ రద్దు చేయాలని, ఎన్‌జేసీఎస్ ఒప్పందం పూర్తి చేసి 39 నెలల ఏరియర్స్ చెల్లించాలనే తదితర 18 డిమాండ్లను నోటీసులో పొందుపరిచారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్. రావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

అదనపు సీసీఎల్‌ఏ ఇంతియాజ్‌కు వినతి

సాక్షి, అమరావతి: వీఆర్‌ఏల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ నేతృత్వంలో పలువురు శుక్రవారం అదనపు సీసీఎల్‌ఏ ఇంతియాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వీఆర్‌ఏలకు పే స్కేలు ఇవ్వాలని, అర్హత మేరకు వారికి పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెంకటేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం నాయకులు ధైర్యం, సత్యరాజు, ప్రభాకరరావు, కేస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలిసారి 5జీ టెక్నాలజీ కోర్సు

- అందుబాటులోకి తీసుకొచ్చిన ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ
- టీఎస్ఎస్‌సీ, జర్మన్ అకాడమీతో కలిసి ఉచితంగా ఆన్‌లైన్ కోర్సు

సాక్షి, అమరావతి: టెలికాం రంగంలో సంచలనాలు సృష్టిస్తున్న 5జీ టెక్నాలజీకి సంబంధించి రాష్ట్రంలో తొలి కోర్సును ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) అందుబాటులోకి తీసుకొచ్చింది. సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి ఈ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం 5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీ పేరిట ప్రత్యేక కోర్సును ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వరంగానికి చెందిన టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ (టీఎస్ఎస్‌సీ), జర్మన్ అకాడమీ ఆఫ్ డిజిటల్ ఎడ్యుకేషన్ (జీఏడీఈ)లతో ఒప్పందం కుదుర్చుకుని ఈ కోర్సును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మొత్తం 250 గంటలు ఉండే ఈ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. రెండున్నర నెలల పాటు శిక్షణ ఇచ్చే ఈ కోర్సు 70 శాతం ఆన్‌లైన్, 30 శాతం ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలను పెంచేవిధంగా ఈ కోర్సును ప్రవేశపెట్టామన్నారు. 5జీ టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు చాలా అధికంగా ఉండటంతో ఈ కోర్సును ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

వర్షాలకు ఇక విరామం..

- 15తో ముగియనున్న 'ఈశాన్య' పవనాల ప్రభావం
- కొన్నాళ్లు రాష్ట్రంలో పొడి వాతావరణం
- నెలాఖరు దాకా కొనసాగనున్న చలి, పొగ మంచు



సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల నుంచి మరికొద్ది రోజుల్లోనే ఈశాన్య రుతుపవనాలు ఉపసంహరించుకోనున్నాయి. ఈనెల 15కల్లా వీటి సీజను పూర్తిగా ముగియనుంది. దీంతో వర్షాలకు విరామం దొరకనుంది. ఫలితంగా కొద్దిరోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగనుంది. నిజానికి.. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల సీజనుగా పరిగణిస్తారు. ఏటా అక్టోబరు 18–22 తేదీల మధ్య ఈశాన్య రుతుపవనాలు తమిళనాడులోకి ప్రవేశిస్తాయి. ఆ తర్వాత రెండుమూడ్రోజుల్లో రాష్ట్రంలోకి విస్తరిస్తాయి. అయితే, ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాలు నిర్ణీత సమయాని కంటే వారం రోజులు ఆలస్యంగా ప్రవేశించాయి. కానీ, అరకొర వర్షాలను మాత్రమే కురిపించాయి. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు మూడునెలల్లో రాష్ట్రంలో 287.2 మి.మీల వర్షపాతం నమోదు కావలసి ఉండగా 219 మి.మీల వర్షపాతం మాత్రమే రికార్డయింది. అంటే.. సాధారణం కంటే 24 శాతం తక్కువ వర్షం కురిసిందన్న మాట. కోస్తాంధ్ర కంటే రాయలసీమలో మరింత తక్కువ వర్షపాతం నమోదైంది. కోస్తాంధ్రలో 18 శాతం (322.9 మి.మీలకు గాను 265.8 మి.మీలు), రాయలసీమలో 30 శాతం (236.4కి 164.7 మి.మీలు) చొప్పున లోటు వర్షపాతం రికార్డయింది. ఈ సీజనులో రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా ఏలూరు జిల్లాలో 42 శాతం అధిక వర్షపాతం కురవగా, అత్యల్పంగా నంద్యాల జిల్లాలో 89 శాతం లోటు వర్షపాతం కురిసింది. ఇక కోస్తాంధ్రలోని 18 జిల్లాలకు గాను అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, బాపట్ల, ఏలూరు, కృష్ణా, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. రాయలసీమలో ఒక్క తిరుపతి మినహా మిగిలి ఏడు జిల్లాల్లోనూ లోటు వర్షపాతమే రికార్డయింది.

రాక.. పోక ఆలస్యమే..

ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల ఆగమనం, తిరోగమనం (నిష్క్రమణ) కూడా ఆలస్యంగానే జరగడం విశేషం. ఈశాన్య రుతుపవనాల సీజను డిసెంబర్ ఆఖరుతో ముగియాల్సి ఉన్నా జనవరిలోనూ రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో.. నిర్ణీత సమయానికి దాదాపు పక్షం రోజులు ఆలస్యంగా ఈ రుతుపవనాలు ఉపసంహరించుకుంటున్నాయి. దీంతో.. ఈనెల 15 తేదీ నాటికి ఈశాన్య రుతుపవనాలు ఉపసంహరణతో అవి బలహీనపడతాయని, ఫలితంగా రాష్ట్రంలో ఇప్పట్లో వర్షాలు కురవవని భారత వాతావరణశాఖ శుక్రవారం వెల్లడించింది.

కొనసాగనున్న మంచు, చలి..

రాష్ట్రంలో ఈ నెలాఖరు వరకు పొగమంచు, చలి కొనసాగనుంది. సాధారణం కంటే కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలు 2–4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అయితే, చలి తీవ్రత అంతగా ఉండదని.. పొగ మంచు ప్రభావం మాత్రం ఉంటుందన్నారు.

విశాఖ–గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కు పచ్చజెండా

- గుంటూరులో జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- మరో రెండు రైలు సర్వీసులు ఆన్‌లైన్ ద్వారా ప్రారంభం



ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పక్కన మేయర్ కావటి

లక్ష్మీపురం/సాక్షి–అమరావతి: మూడు రైలు సర్వీసుల పొడిగింపు ఏపీ ప్రజలకు మేలు చేస్తుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో శుక్రవారం మూడు రైలు సర్వీసులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం–గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు గుంటూరు డివిజన్ వాసులకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఇకపై ఈ రైలు గుంటూరు నుంచి ప్రయాణిస్తుందని తెలిపారు. అలాగే నర్సాపూర్–హుబ్లీ–నర్సాపూర్ అమరావతి ఎక్స్‌ప్రెస్, నంద్యాల–రేణిగుంట నంద్యాల ప్యాసింజర్ రైళ్ల సర్వీసులను కూడా ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. నర్సాపూర్–హుబ్లీ ఎక్స్‌ప్రెస్ కోస్తాంధ్రా నుంచి కర్ణాటక ప్రాంతానికి అదనపు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. నంద్యాల–రేణిగుంట ప్రత్యేక రైలు ద్వారా తిరుమల శ్రీవారి ఆలయానికి వెళ్లేందుకు యాత్రికులకు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ, నగర్ మేయర్ కావటి మనోహర్ నాయుడు, డివిజన్ ఏడీఆర్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో నంబర్‌వన్‌గా భారత్ రైల్వే

రైల్వే నెట్‌వర్క్‌లో ప్రపంచంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విజయవాడలో ఆయన మాట్లాడారు. ఏపీకి రైల్వే బడ్జెట్ కేటాయింపులను రూ.886 కోట్ల నుంచి రూ.8,400 కోట్లకు పెంచామని పేర్కొన్నారు. 41 వందేభారత్ రైళ్లలో ఐదు రైళ్లు ఏపీకి కేటాయించామని చెప్పారు. ఏపీలో 371 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్లు నిర్మించినట్టు తెలిపారు. రూ.38,600కోట్లతో దేశంలో రైల్వేలైన్ల విద్యుదీకరణను పెంచామన్నారు. 2018– 23 మధ్య కాలంలో రైల్వేశాఖ దేశంలో మూడు లక్షలమందికి ఉపాధి అవకాశాలు వివరించారు.

టీడీపీ 'ఓటర్ల' అక్రమాలపై రుజువులతో సహా ఫిర్యాదు

- విచారించి చర్యలు తీసుకుంటామన్న భారత ఎన్నికల కమిషన్
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

కొండపి (సింగరాయకొండ): తెలుగుదేశం పార్టీ దొంగ ఓట్లను ఎలా నమోదు చేసింది, 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్ర ఓటర్ల జాబితాను ఏ విధంగా తారుమారు చేశారనే వాటిపై ఆధారాలతో సహా భారత ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి చెప్పారు. ప్రకాశం జిల్లా కొండపి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. టీడీపీ ఓటర్ల జాబితాలో చేసిన అవకతవకలపై వైఎస్సార్‌సీపీ చేసిన ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ సానుకూలంగా స్పందించిందని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎటువంటి ఆవేదన, సమస్యలు లేవన్నారు. జిల్లాకు బాలినేని అత్యంత విలువైన నాయకుడని, పార్టీలో ఆయన ప్రాధాన్యత ఏ రోజూ తగ్గదని చెప్పారు. సీఎంకు అత్యంత సన్నిహితుడైన బాలినేని వచ్చే ఎన్నికల్లో ఒంగోలు నుంచే పోటీచేస్తారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు గెలుపే లక్ష్యంగా 3 జాబితాలను విడుదల చేశామని, త్వరలో నాలుగో జాబితా ఉంటుందని తెలిపారు. మాగుంట ఎన్నికల్లో పోటీ చేయాలంటే చంద్రబాబును తిట్టాలని, రూ.150 కోట్లు ఇవ్వాలని షరతులు పెట్టారని ప్రచారం జరుగుతుందని, ఇది వాస్తవం కాదా అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. ఇది కేవలం మీడియా, టీడీపీ, చంద్రబాబు సృష్టిస్తున్న కథనం మాత్రమేనని చెప్పారు. విమర్శలు, ప్రతి విమర్శలు రాజకీయాల్లో సహజమన్నారు. 'మా అధినాయకుడిని విమర్శిస్తే తిప్పికొట్టడం ఆయన అనుచరులుగా మా బాధ్యత. ఈ బాధ్యతను పార్టీలోని ప్రతి ఒక్కరు తప్పకుండా నిర్వర్తించాల్సిందే..' అని ఆయన స్పష్టం చేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

'భ్రమరావతి' అని తేలిపోయింది!

- 1,202వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాజధాని పేరుతో బాబు నిర్మిస్తున్నది అమరావతి కాదని.. భ్రమరావతి అని తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన కేశినేని నాని వంటి సీనియర్ నాయకులే చెబుతుండటంతో బాబు బండారం బయటపడిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,202వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. భూములిచ్చిన రైతులను నిలువునా ముంచినందునే చంద్రబాబు 29 గ్రామాల్లో ఘోరంగా ఓడిపోయారన్నారు. బాబు రూ.400 కోట్లు పెట్టుబడి పెట్టి అమరావతి పేరిట దొంగ ఉద్యమం నడిపిస్తున్నారని మండిపడ్డారు. నేడు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఒక్క రూపాయి అవినీతి లేకుండా పేదల ఖాతాలకే సంక్షేమ నగదు వచ్చి చేరుతుందంటే అది కేవలం జగనన్న పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచిందనేందుకు విద్యలో కేరళను మించి ప్రథమ స్థానానికి రావడమే తార్కాణంగా నిలుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం ఎదుర్కోలేక ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని బాబు అధికారం కోసం కుట్రలు చేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మంగళగిరిలో లోకేశ్‌కు మరోసారి ఓటమి తప్పదని హెచ్చరించారు. కుప్పంలోనూ బాబును కుప్ప తొట్టిలో పడేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, ఇందుపల్లి సుభాషిణి, ఈపూరి ఆదాం, పులిదాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు వేళాయె

సాక్షి, అమరావతి: విద్యా సంవత్సరం ముగుస్తుండటంతో విద్యార్థులకు పరీక్షల కాలం మొదలైంది. ఒకటో తరగతి నుంచి టెన్త్, ఇంటర్మీడియెట్ వరకు మార్చి, ఏప్రిల్ నెలల్లో ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఒకటి నుంచి 9వ తరగతి వరకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్–4 (ఎఫ్ఏ–4) జరుగుతాయి. ఈనెల 23 నుంచి ఎఫ్ఏ–4, ఫిబ్రవరిలో టెన్త్ ప్రిఫైనల్ జరగనున్నాయి. వీటికోసం పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ప్రకటించింది. ఏప్రిల్ 8 నుంచి 22వ తేదీ వరకు ఒకటి నుంచి 9 తరగతులకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్టు ఏపీఎస్సీఈఆర్టీ షెడ్యూల్ ప్రకటించింది. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు, మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి ఫైన్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఏప్రిల్ 8 నుంచి వార్షిక పరీక్షలు

ఒకటి నుంచి 9వ తరగతి వరకు నిర్వహించే ఫార్మెటివ్ అసెస్‌మెంట్లలో చివరిదైన ఎఫ్ఏ–4ను ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఏ తేదీల్లో ఏ పరీక్ష జరిగేదీ తరగతులవారీగా ప్రత్యేక షెడ్యూల్‌ను రాష్ట్రంలోని అన్ని పాఠశాలకు ఎస్సీఈఆర్టీ పంపించింది. మార్చిలో పది, ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత ఏప్రిల్ 8 నుంచి 22వ తేదీ వరకు ఒకటి నుంచి 9 తరగతుల విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు.

ఫిబ్రవరి 23 నుంచి ఎస్సెస్సీ ప్రీఫైనల్స్

మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలకు బోర్డు ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించింది. వాటికి ముందు నిర్వహించే ప్రిఫైనల్ పరీక్షలను ఫిబ్రవరి 23 నుంచి మార్చి 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రీ ఫైనల్ షెడ్యూల్‌ను ఎస్సీఈఆర్టీ జిల్లా విద్యా శాఖాధికారులకు పంపించింది.

టీడీపీ నుంచి ఇంకా చాలామంది వస్తారు

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి తదితరులు

మధురవాడ (భీమిలి): తెలుగుదేశం పార్టీ నుంచి ఇంకా చాలామంది బయటకు వస్తారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. టీడీపీని నమ్ముకున్నోళ్లకు చంద్రబాబు నమ్మకద్రోహం చేశాడని, అందుకే చాలామంది తమ పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. వెన్నుపోటు చంద్రబాబుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రామాలాడడం, వేషాలు వేయడంలో చంద్రబాబు దిట్ట అని విమర్శించారు. ఆయన శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులతో కలిసి జీవీఎంసీ జోన్–2 మధురవాడ సుద్దగెడ్డ వద్ద రూ.18.90 కోట్లతో నిర్మించిన టిడ్కో ఇళ్లను 240 మంది లబ్ధిదారులకు అందజేసి గృహప్రవేశాలు చేయించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మధురవాడ హైవేపై ప్రకాష్ యాడ్స్ సీఎస్ఆర్ నిధులు రు.2.50 కోట్లతో నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షలమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి దేశంలో ప్రథమంగా నిలిచామన్నారు. నామమాత్రపు ధరతో రిజిస్ట్రేషన్ కూడా చేయించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెళ్లకు సంక్రాంతి కానుకగా ఇస్తున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచాడని, మొదటినుంచి టీడీపీలో ఉన్న వారికి సీట్లు ఇవ్వలేదు కాబట్టే వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారని తెలిపారు. గెలుపు కోసం వైఎస్సార్‌సీపీ కొంతమందిని మారుస్తుంటే చంద్రబాబు డబ్బులు ఖర్చుపెట్టలేని వారిని మారుస్తున్నాడని విమర్శించారు. టీడీపీ నుంచి ఇంకా చాలామంది బైటకు వచ్చేస్తారని, 2024లో గెలిచే పార్టీ వైఎస్సార్‌సీపీనే అని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తారన్నారు. చంద్రబాబును పొరపాటున అయినా నమ్మితే కోట్లాదిమంది ప్రజలు ఇబ్బంది పడతారని, అలాగే సంక్షేమ పథకాలు కూడా ఆగిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదన్నది అందరికీ తెలుసని చెప్పారు. రైతులు, డ్వాక్రా మహిళలు, నిరుద్యోగ యువకులను మోసం చేశాడని గుర్తుచేశారు. మళ్లీ చంద్రబాబునాయుడు, ఆయన దత్తపుత్రుడు వచ్చి మాయమాటలు చెబుతున్నారని వై.వి.సుబ్బారెడ్డి విమర్శించారు.

విశ్వసనీయత లేని నాయకుడు చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇక్బాయేల్

సాక్షి, అమరావతి: చంద్రబాబు విశ్వసనీయత లేని నాయకుడని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్ విమర్శించారు. ఆయన ప్రజల్లో పూర్తిగా నమ్మకం కోల్పోయారన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్ కులాలు, కుటుంబాల మధ్య చిచ్చు పెట్టే స్థాయికి దిగజారారు అని ధ్వజమెత్తారు. అంత పెద్దనేతగా పేరొందిన చంద్రబాబు చివరికి 'తమ్ముళ్లూ.. నాకు అవకాశం ఇవ్వండి, టీడీపీని గెలిపించండి చౌకగా మద్యం అందిస్తానని' సిగ్గు, ఎగ్గులేకుండా ఓట్లు అడుగుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలోనే బాబు లాంటి నీచమైన నాయకుడిని చూడం అని విమర్శించారు. ప్రజలకు ఏం మేలు చేశాడో చెప్పడని.. తాను ముఖ్యమంత్రిగా చేయలేదన్నట్లు, ఏదో కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పార్లమెంటు నియోజకవర్గానికో సభ అంటూ బయలు దేరాడని, ఆయన సభలకు జనాలు లేకపోయినా జనసునామీ అంటాడని విమర్శించారు. కులాల పేరెత్తి మాట్లాడటం, ఇంత నీచానికి దిగజారడం అవసరమా? బాబు అని ప్రశ్నించారు. ''ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీలు జడ్జిలుగా ఉండటానికి అర్హతలేదన్నారు? ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారు అన్నారు. ధైర్యముంటే సీఎంగా బాబు ఏం చేశారో చెప్పాలి. సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోవాలి, అంతేకానీ దిగజారి మాట్లాడటం ఎంత వరకూ సమంజసం? బాబు తన సభల్లో 2014 ఎన్నికల మేనిఫెస్టో తీసుకుని ప్రజలకు చూపిస్తూ వీటిలో నేను చెప్పినవి అన్నీ చేశానని ప్రజలకు చదవి వినిపించాలి. అప్పుడు ఆయన క్రెడిబిలిటీ, నిజాయితీ ప్రజలకు తెలుస్తుంది. వైనాట్ 175 అనేదే మా టార్గెట్. మా నాయకుడి ధైర్యమే మా ధైర్యం. 2024 ఎన్నికల్లో విజయం వైఎస్సార్‌సీపీదే'' అని ఇజ్రాయేల్ చెప్పారు.

యువతకు స్ఫూర్తి వివేకానంద

- మందలో కాకుండా వందలో ఒకరిగా నిలవాలి
- ఆయన ప్రసంగాలు యువతకు మార్గదర్శకాలు
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



భవానీపురం (విజయవాడ పశ్చిమ): పడి లేచే కెరటం తనకు ఆదర్శమన్న స్వామి వివేకానంద మాటలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా సూచించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశానికి వెన్నెముకలైన యువత అన్ని రంగాల్లో తమ ప్రాముఖ్యతను చాటుకుని ఐకాన్‌లుగా తయారుకావాలని ఆకాంక్షించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి స్ఫూర్తి స్వామి వివేకానందుడని, ఆయన అడుగుజాడల్లోనే సీఎం జగన్ పాలన సాగుతుందన్నారు. వివేకానందుని ప్రసంగాలను యువత మార్గదర్శకాలుగా తీసుకోవాలన్నారు. నేటి యువత మందలో ఒకరిగా కాకుండా వందలో ఒకరిగా నిలవటానికి కృషిచేయాలని సూచించారు. రామకృష్ణ మిషన్ ప్రతినిధి తాతా మహరాజ్ స్వామీజీ మాట్లాడుతూ.. సనాతన ధర్మం, ఉపనిషత్తులు, సంస్కృతి, సంప్రదాయాలను విదేశాల్లో చాటిచెప్పిన శివాంశ సంభూతుడు స్వామి వివేకానంద అన్నారు. యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా మాట్లాడారు. ఈ ఏడాది ఏపీ సాధించిన లార్జెస్ట్ యూత్ ఐకాన్ ఫెస్టివల్ అవార్డును మంత్రి రోజా యువజన సర్వీసుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్నకు అందచేశారు.

సీట్లు అమ్ముకునే సంస్కృతి చంద్రబాబుదే

మంత్రి రోజా మాట్లాడుతూ.. డబ్బుకి సీట్లు అమ్ముకునే నీచ సంస్కతి చంద్రబాబుదేనని.. అంత ఖర్మ సీఎం జగనన్నకు పట్టలేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసి వెళ్లినా లేదా రాష్ట్రాన్ని విడగొట్టినా వైఎస్ జగన్ సమర్థవంతగా ఎలా పరిపాలిస్తున్నారో అందరూ చూస్తున్నారన్నారు. కుప్పంలో ఓటమి భయం పట్టుకున్న చంద్రబాబు మరో నియోజకవర్గం వెతుకులాటలో పడ్డారని.. అలాగే, పవన్, లోకేశ్ కూడా వేర్వేరు నియోజకవర్గాల వేటలో ఉన్నారని అన్నారు. జగనన్నే కావాలని ప్రజలు నిర్ణయించుకున్నారని.. ఆ దిశగానే 'ట్వంటీ ట్వంటీ ఫోర్ జగనన్న వన్స్‌మోర్' అంటున్నారని చెప్పారు. పొద్దున జనసేనతో, మధ్యాహ్నం కాంగ్రెస్‌తో, మధ్యలో సీపీఎం–సీపీఐ, రాత్రికి బీజేపీతో మంతనాలు మినహా చంద్రబాబుకు సొంత జెండా, ఎజెండా లేదని ఆమె ఎద్దేవా చేశారు.

ఆయనకు టికెట్ ఇస్తే సహకరించం

- గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటిపై అసమ్మతి స్వరం
- ఉభయ గోదావరి జిల్లాల నుంచి దాదాపు 500 కార్లలో మంగళగిరికి ర్యాలీగా పార్టీ శ్రేణులు
- పార్టీ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన
- చంద్రబాబు, లోకేశ్ లేకపోవడంతో మరింత ఆగ్రహించిన తమ్ముళ్లు
- రెబల్ అభ్యర్థిని రంగంలో దింపుతామంటూ అల్టిమేటం



అమరావతి టీడీపీ కార్యాలయంలో అధిష్టానాన్ని కలిసిన మద్దిపాటి వ్యతిరేక వర్గం

ద్వారకాతిరుమల/దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో టీడీపీలో వర్గ విభేదాలు రోడ్డునపడ్డాయి. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా మద్దిపాటి వెంకట్రాజు వద్దంటూ ఉభయ గోదావరి జిల్లాల పార్టీ నేతలు మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి మద్దిపాటి వెంకట్రాజును గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినప్పటి నుంచి ఆ పార్టీ నేతల్లో ఆందోళన మొదలైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులు ఒక వర్గంగా ఉన్నారు. వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజుకు మధ్య రెండేళ్లుగా వర్గ పోరు జరుగుతోంది. అనేకసార్లు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు వద్ద పంచాయితీలు నిర్వహించినప్పటికీ సయోధ్య కుదరకపోగా నేటికీ పోరు హోరాహోరీగా సాగుతోంది. మద్దిపాటి వెంకట్రాజు ఒంటెద్దు పోకడలో వెళ్తున్నారని, పార్టీ శ్రేణులను కలుపుకు వెళ్లడం లేదని బాపిరాజు వర్గం ఆరోపిస్తోంది. మద్దిపాటే ఇన్‌చార్జి అని చంద్రబాబు, లోకేశ్‌లు పలుమార్లు బాపిరాజుకు, ఆ పార్టీ నేతలకు తేల్చి చెప్పారు. అయినా బాపిరాజు వర్గీయులు ససేమిరా అంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో మద్దిపాటి వద్దని వారు తీర్మానించారు. ఈ క్రమంలోనే శుక్రవారం సుమారు 500 కార్లలో మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయానికి బయల్దేరి ముందుగా కలపర్రు టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా మంగళగిరి చేరుకుని, టీడీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. మద్దిపాటి వద్దంటూ నేలపై బైఠాయించి నిరసన తెలియజేశారు. చంద్రబాబు, లోకేశ్‌లు కార్యాలయంలో లేరన్న విషయం తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా భగ్గుమన్నారు. నియోజకవర్గాన్ని మద్దిపాటి సర్వనాశనం చేస్తున్నాడంటూ నిప్పులు చెరిగారు. దీంతో టీడీపీ ప్రోగ్రాం కమిటీ చైర్‌పర్సన్ స్వాతి ఆందోళనకారులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఎన్నికల సమయంలో అంతర్గత కలహాలను బయటపెట్టుకోవడం సరికాదని హితవు పలికారు. పార్టీ శ్రేణులను మద్దిపాటి విభజించి పాలిస్తున్నారని, నిజమైన కార్యకర్తలను దూరంపెట్టి, అనర్హులను వెంటేసుకుని తిరుగుతున్నారని వారు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. మద్దిపాటికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని, అవసరమైతే రెబల్ అభ్యర్థిని రంగంలో దింపుతామంటూ తెగేసి చెప్పి, అక్కడి నుంచి వెనుదిరిగారు.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 13 । జనవరి । 2024



సంస్కృతి తెలియజేయడానికే..

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంస్కృతి తెలపడానికే నిర్వహిస్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. ▸8లో



అంబేడ్కర్‌తో స్వేచ్ఛా జీవితం

మచిలీపట్నం జెడ్పీ కన్వెన్షన్ హాలులో 'సామాజిక సమతా సంకల్పం' నిర్వహించారు. అంబేడ్కర్‌తో అందరికీ స్వేచ్ఛా జీవితం లభించిందని అతిథులు తెలిపారు. ▸8లో

క్రైం ఏడీసీపీగా కృష్ణమూర్తి



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ క్రైం ఏడీసీపీగా కృష్ణమూర్తి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీపీ టీకే రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఉమ్మడి జిల్లాకు చెందిన భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. కానూరు టీచర్స్ కాలనీకి చెందిన నంబూరి వెంకట శేషా రెడ్డి కుటుంబం అమ్మవారి నిత్యాన్నదానికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. దాతలకు ఆలయ పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, ప్రత్యేక ఆహ్వానితులు జక్కి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

104 సర్వీసుల్లో ఉద్యోగ అవకాశాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని 104 అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్‌లో డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పీటర్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు డిగ్రీతో పాటు, కంప్యూటర్ పరిజ్ఞానమున్న అభ్యర్థులు బయోడేటాతో పాటు, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను పాత ప్రభుత్వాస్పత్రిలోని తమ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ లోపు అందజేయాలని సూచించారు. మరింత సమాచారానికి 89195 95936, 92463 34977 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముగిసిన మండల దీక్ష మాలధారణ



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ మండల దీక్ష మాలధారణ తీసుకునే భక్తులతో శుక్రవారం ఆలయ ప్రాంగణం సందడిగా కనిపించింది. మాల స్వీకరణకు ఆలయం వారు నిర్ణయించిన చివరి రోజు కావడంతో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు నాలుగు వేల మంది భక్తులు దీక్ష తీసుకున్నారు. దీక్షాధారులు, వారి వెంట వచ్చిన వారితో ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి. జనవరి 6 నుంచి 12వ తేదీ వరకు జరిగిన మాలధారణలో సుమారు 8 వేల మంది ఆలయంలో దీక్ష స్వీకరించారు. వివిధ గ్రామాల్లో గురుస్వాములు మాలవేసిన వారు మరో 20 వేల మంది ఉంటారని ఆలయ అధికారులు అంటున్నారు. ఏర్పాట్లను ఈవో కె.రమేష్ నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, అధికారులు, సభ్యులు పర్యవేక్షించారు.

నేటి నుంచి జోసఫ్ తంబి మహోత్సవాలు



ఉంగుటూరు: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలు ఈ నెల 13,14,15 తేదీల్లో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ తెలిపారు. మహోత్సవాల సందర్భంగా అందరిలో ఆధ్యాత్మికతను నింపడానికి నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. కడప మేత్రాసనం, కమలాపురం విచారణ ఫాదర్ బుడ్డాయపల్లి సతీష్ దివ్యపూజాబలిని సమర్పించారు. తంబి మహోత్సవాలకు వచ్చే యాత్రికులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. గుంటూరు, కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం వసతులు ఏర్పాటు చేశారు. పెద అవుటపల్లిలో మహోత్సవాల మూడు రోజులూ రైల్వేస్టేషన్‌లో రైళ్లు నిలపడానికి చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక పోలీసు బృందాలు, ప్రైవేటు సెక్యూరిటీ, వలంటీర్లను ఏర్పాటు చేశారు. తాగునీరు, పారిశుద్ధ్యం కోసం పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ప్రతి అడుగులో ప్రగతి

ప్రతి అడుగులో ప్రగతి పరుగులు తీస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేయూతతో కృష్ణా జిల్లా అభివృద్ధి పథాన పయనిస్తోంది. సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతులు, ఉపాధి కల్పనకు పెద్ద పీట వేస్తూ సామాజిక, ఆర్థిక స్వావలంబనకు అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల నిధులు కేటాయించడంతో జిల్లాలో సమగ్రాభివృద్ధి జరుగుతోంది.

- కృష్ణా.. పురోగతి
- సంక్షేమంతో పాటు సమగ్రాభివృద్ధికి నిధులు
- జిల్లాకు కొత్త హంగులు
- 22.58 లక్షల మందికి సంక్షేమ పథకాలు
- నేరుగా వారి ఖాతాల్లో రూ.7,170 కోట్లు జమ

ఇది కదా.. అభివృద్ధి

సాక్షి, మచిలీపట్నం: కృష్ణా జిల్లా అభివృద్ధికి రాష్ట్ర పాలకులు నిధులు మంజూరు చేయడంతో పనులు నాణ్యతతో, వేగంగా పూర్తవుతున్నాయి. వందేళ్ల చరిత్ర ఉన్న జిల్లాలో సముద్ర తీరం, సహజ వనరులు, మత్స్య సంపదతో పాటు పలు అంశాలకు ప్రత్యేక పేరుగాంచింది. అయితే గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో జిల్లా అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత జిల్లా అభివృద్ధి బాట పట్టింది. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో 'కృష్ణా'లో జరిగిన అభివృద్ధిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



మచిలీపట్నం పోర్టు పనులు

పేదల బతుకు మారుస్తున్న నవరత్నాలు

పేదల బతుకులు మార్చడానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి 'నవరత్నాలను' అందుబాటులోకి తెచ్చారు. ఎవరి సిఫార్సు లేకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే నగదును జమ చేస్తూ వచ్చారు. కృష్ణాలో 22,58,735 మంది ఖాతాల్లోకి వివిధ సంక్షేమ పథకాల కింద రూ.7,170.82 కోట్లు జమ చేశారు.

అభివృద్ధికి అందలం

జిల్లాలో సంక్షేమంతోపాటు అభివృద్ధికి అందలమేశారు. రోడ్లు, వంతెనలు, డ్రైనేజీలు, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, జగనన్న కాలనీలు, డిజిటల్ లైబ్రరీలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీకేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, నాడు– నేడు కింద పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల రూపు రేఖలు మార్చడానికి నిధులు మంజూరు చేశారు. నాలుగున్నరేళ్లలో కేవలం కృష్ణా జిల్లాలో 6,974 అభివృద్ధి పనులకు రూ.2 వేల కోట్లకుపైగా ప్రభుత్వం మంజూరు చేసింది.

విద్యా విప్లవం

నాడు నేడుతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయి. నాడు నేడు మొదటి, రెండు విడతల్లో 1,075 స్కూళ్లలో వసతుల ఏర్పాట్లు, అదనపు తరగతుల నిర్మాణానికి 286.22కోట్లు మంజూరు చేసింది.

వాణిజ్య పురోగతికి 'బందరు పోర్టు'

ఒక ప్రాంత అభివృద్ధికి వాణిజ్య వసతులు చాలా అవసరం. రోడ్డు, రైలు మార్గాలకు భిన్నంగా సముద్ర మార్గం చాలా కీలకం. గత ప్రభుత్వం బందరు పోర్టును నిర్లక్ష్యం చేసింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి బందరుపోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అనుమతులు పొంది, రూ.11,464 కోట్ల అంచనాతో పనులు వేగంగా చేయిస్తోంది. మత్స్యకారుల కోసం మచిలీపట్నం సమీపంలో హార్బర్ ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం రూ.422 కోట్లతో పనులు చేస్తుండగా 3,300 మంది మత్స్యకారులకు ప్రయోజనం కలగనుంది. ఈ హార్బర్ 550 బోట్లు నిలిపే సామర్థ్యం కలిగి ఉంది.

చెంతనే వైద్య విద్య

పేదల వైద్య విద్య కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మచిలీపట్నంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇందుకు కావాల్సిన భవనాలు, తరగతి గదులు, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్ భవనం, బాయ్స్, గరల్స్ హాస్టల్స్ తదితర నిర్మాణాలకు రూ.550 కోట్లు మంజూరు చేసి పూర్తి చేశారు ఏటా కొత్తగా 150 మంది ఎంబీబీఎస్ చేసే అవకాశం లభించింది.



బందరులో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాల

91 వేల మందికి ఇళ్లు

పేదల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో 91,295 ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ. 1,646.31కోట్లు మంజూరు చేసింది.



మచిలీపట్నం మండలం మేకవానిపాలెం వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీ

పేదల ఆర్థికాభ్యున్నతికి అదనపు సాయం



పేదల ఇతర అవసరాలు తీరాలంటే ఎవరో ఒకరు సాయం చేయాలి. ప్రభుత్వం ఇదే చేస్తోంది. వివిధ సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో విద్య, వైద్య, ఇళ్లు, స్థలాలు ఇలా అన్ని రకాల అవసరాలు తీరుతున్నాయి. ఇలా సంక్షేమ పథకాలతో పేదలకు అనేక రకాలుగా మేలు జరుగుతోంది. జిల్లాల 20 వేల ఇళ్లు పూర్తయ్యాయి. వేలాది మందికి నిర్మాణ రంగంలో ఉపాధి లభించింది.

–రాజాబాబు, కలెక్టర్, కృష్ణా జిల్లా

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మంజూరు చేసిన నిధులు (రూ. కోట్లలో)
ఆసరా	3,03,694	884.51
అమ్మఒడి	1,62,899	537.37
అమ్మఒడి (ఇతరులు)	1,51,928	38.71
అర్చకులు	819	0.41
చేదోడు	12,243	27.04
క్రాప్ ఇన్సూరెన్స్	58,595	128.85
ఈబీసీ నేస్తం	11,414	30.47
హౌసింగ్ (డీబీటీ)	33,662	323.58
ఇమామ్స్	36	0.02
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	85,909	69.43
జగనన్న చేదోడు (వడ్డీ)	30,791	1.30
జగనన్న చేదోడు (రుణాలు)	49,992	78.84
జగనన్న వసతి దీవెన	96,849	112.08
జగనన్న విద్యాదీవెన	1,06,837	326.36
కల్యాణమస్తు	463	3.53
కాపునేస్తం	28,204	95.86
లా నేస్తం	53	0.32
మత్స్యకార భరోసా	18,229	44.13
నేతన్న నేస్తం	5,040	35.13
పాస్టర్స్	1,982	0.99
రైతుభరోసా	1,72,821	777.60
సున్నా వడ్డీ రుణాలు	61,943	14.92
సున్నా వడ్డీ	3,71,662	85.38
వాహనమిత్ర	14,409	41.04
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	39,246	28.38
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	61,050	266.26
వైఎస్సార్ బీమా	4,916	72.08
వైఎస్సార్ చేయూత	1,18,546	531.44
వైఎస్సార్ పింఛన్ కానుక	2,81,373	2611.20
జగనన్న విదేశీ విద్యాదీవెన	24	2.59
జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం	106	1.00
మొత్తం	22,58,735	రూ.7170.82

అందరి సహకారంతో ఉత్తమ ర్యాంకు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అందరి సహకారంతో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ చెప్పారు. జాతీయ స్థాయిలో విజయవాడ నగర పాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ఉత్తమ ర్యాంక్ సాధించడంతో వీఎంసీ మినిస్టీరియల్–ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం వీఎంసీ సిబ్బంది ఆయన్ని అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వీఎంసీ సిబ్బంది, కార్మికులు, ప్రజాప్రతినిధులు, నగరవాసుల సహకారంతో నగరానికి ఖ్యాతి తీసుకొస్తున్నామని తెలిపారు.



వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌ను సన్మానిస్తున్న వీఎంసీ మినిస్టీరియల్ సిబ్బంది

కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ దార రాంబాబు, జనరల్ సెక్రటరీ ఎస్వీఎస్ చలం, సంయుక్త కార్యదర్శి టి. ప్రతాప్ కుమార్, ఉపాధ్యక్షులు పి. మురళీకృష్ణ వెంకటరత్నం, ట్రెజరర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ సంఘు క్యాలెండర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ (హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్ విభాగాల యూనిట్) రూపొందించిన నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ సుసర్ల శ్రీనివాసరావు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ క్యాడర్ సర్వీస్ మేటర్స్‌లో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భవిరి రవి మాట్లాడుతూ సభ్యులందరి సహాయ, సహకారాలతో టేబుల్ క్యాలెండర్‌ను తయారు చేయటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శిసోమయాజులు, ఫైనాన్స్ సెక్రటరీ టి.హేమ సుందర్, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈ ఎస్.శ్రీనివాసరావును అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.

సమన్వయంతో పని చేయాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- 19న బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సామాజిక న్యాయస్ఫూర్తికి ప్రతిరూపమైన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభ మహోత్సవం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19న జరగనుందని.. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. సీపీ టీకే రాణా, జేసీ సంపత్‌కుమార్, డీసీపీ విశాల్ గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్ తదితరులతో కలిసి కార్యక్రమానికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. పటిష్ట భద్రత, బందోబస్తు, బారికేడింగ్, పార్కింగ్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, రవాణా, సభా వేదిక తదితరాలకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో బహిరంగ సభ అనంతరం స్వరాజ్య మైదానంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ జరుగుతుందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజాప్రతినిధులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలోని వివిధ కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలని.. పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డీసీపీలు వి.అజిత, చక్రవర్తి, ఆర్ అండ్ బీ ఎస్ఈ వీకే విజయశ్రీ, వీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈఈ ఎల్.రమాదేవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టీకే రాణా

సమష్టి కృషితో వైఎస్సార్ సీపీ విజయం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేశినేని నాని, సామినేని ఉదయభాను, వెలంపల్లి శ్రీనివాసరావు

పార్టీ జిల్లా కార్యాలయంలో కేశినేని నానికి ఘన స్వాగతం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమష్టి కృషితో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేద్దామని ఆ పార్టీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ కేశినేని నాని చెప్పారు. వైఎస్సార్ సీపీలో చేరిన కేశినేని నాని తొలిసారిగా ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయానికి విచ్చేశారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనకు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్య లక్ష్మి, తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జులు దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులను ఎంపీ కేశినేని నానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా కేశినేని మాట్లాడుతూ పార్లమెంట్‌తో సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు. దీనికి ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ టీం కృషి చేయాలని తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై భక్తజన కోలాహలం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వరస సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రి భక్తజన కోలాహలంగా మారింది. మెట్రో నగరాల నుంచి సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు విచ్చేస్తున్న వారు అమ్మవారి దర్శనం కోసం ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దుర్గామల్లేశ్వరస్వామివార్ల పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. సర్వ దర్శనం, రూ.100, రూ.300, రూ.500 టికెట్ క్యూలైన్‌లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో రూ.కోటితో పార్క్ ఏర్పాటు

పెనుగంచిప్రోలు: పవిత్ర పుణ్యక్షేత్రం పెనుగంచిప్రోలులో కోటి రూపాయలతో చెరువు కట్ట వద్ద పార్క్ ఏర్పాటు చేస్తున్నామని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. ఆయన శుక్రవారం పార్క్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని శ్రీతిరుపతమ్మ వారి ఆలయాన్ని రూ.14 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

బాడీ బిల్డింగ్‌లో విద్యార్థికి బంగారు పతకం

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బాడీబిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ హెచ్‌వీ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సూరంపాలెంలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల బాడీ బిల్డింగ్ పోటీల్లో తమ విద్యార్థి విజయాన్ని సాధించారని పేర్కొన్నారు. పతకం సాధించిన సూరవరపు దిలీప్‌ను శుక్రవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దిలీప్ అండర్ 70 కిలోల విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నారని వివరించారు. జేఎన్‌టీయూ స్పోర్ట్స్ అథారిటీ శ్యామ్ కుమార్ నుంచి బహుమతి అందుకున్నారన్నారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తింపు



కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరు కాలువలో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైన ఘటన కృష్ణలంక పోలీస స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో బస్టాండ్ ఆవరణలో ఉన్న గంగోత్రి హోటల్ సమీప బందరు కాలువలో నీటిలో ఒక మహిళ మృతదేహం తేలియాడుతుండటాన్ని అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నీటిలో నుంచి వెలుపలికి తీశారు. మృతదేహం వద్ద ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి ఆచూకీ గుర్తించిన వారు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో గానీ, 0866 2482320 నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కంకిపాడు: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... పట్టణానికి చెందిన పి.వెంకటేష్ (24) క్యాటరింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. మద్యం సేవిస్తున్నాడని తల్లి మందలించటంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

విజయవాడస్పోర్ట్స్: భవానీపురం స్వాతి రోడ్డులోని ఓ ఫొటో స్టూడియోలో చోరీకి పాల్పడిన కారం నరేష్ అనే నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.రాజశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు గ్రామానికి చెందిన నిందితుడు నరేష్ 2023 ఆగస్టు 11వ తేదీన ఈ చోరీకి పాల్పడ్డారు. స్టూడియో యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు.

అంగరంగ వైభవంగా స్మృతి వనం



స్మృతివనం పనులు పరిశీలిస్తున్న ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి



ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీపీ టీకే రాణా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్ మైదానంలో ఈ నెల 19వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి అన్నారు. స్మృతి వనం ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోనే అత్యంత వైభవంగా స్మృతివనం ప్రారంభోత్సవం చేస్తాయని తెలిపారు. భారత రాజ్యాంగ రూపకర్తకు అరుదైన గౌరవం లభించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్మృతివనాన్ని తీర్చిదిద్దారని చెప్పారు. ఏర్పాట్లను విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ్ పరిశీలించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మున్సిపల్ కమిషనర్లు వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

అంబేడ్కర్ స్మృతివనం భద్రతా ఏర్పాట్లు పరిశీలన

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 19వ తేదీన ప్రారంభం కానున్న అంబేడ్కర్ స్మృతివనం వద్ద తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం పరిశీలించారు. స్మృతివనం ప్రాంగణాన్ని పరిశీలించిన సీపీ రాణా అక్కడ తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లను పోలీసు అధికారులకు వివరించారు. ఈ పర్యటనలో డీసీపీలు విశాల్‌గున్ని, వి.అజిత, మునిసిపల్ కమిషనర్ స్విప్నిల్ దినకర్‌పుండ్కర్, ఏసీపీ డాక్టర్ రవికిరణ్ ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు

ఉంగుటూరు: సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి పండుగ అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరులో విజయవాడ చాప్టర్ స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖులు పాల్గొని సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగైన సంక్రాంతిని కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో స్వర్ణభారత్ ట్రస్ట్‌లో చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. పంట ఇంటికి వచ్చిందన్న సంతోషాలకు గుర్తే సంక్రాంతి అని తెలిపారు. స్వామి వివేకానంద జయంతి రోజు సంక్రాంతి సంబరాలు చేసుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మరో అతిథి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వృత్తి పరంగా తెలుగువారు ఏ ప్రదేశంలో ఉన్నా సంక్రాంతి పండుగకి సొంత ఊరు చేరుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారని తెలిపారు. సంక్రాంతి వేడుకల్లో పాల్గొనడం శుభ సూచకం అన్నారు. ప్రతి ఒక్కరిలో కాంతి నింపాలని ఆకాంక్షించారు. తెలుగువారందరికీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ తరుపున సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా గరికపాటి నరసింహారావు ప్రవచనాలు, టీటీడీ ఆస్థాన విద్వాంసులు వేదవ్యాస ఆనందభట్టర్, ప్రముఖ గాయకురాలు ఎస్పీ శైలజ వంటి వారు సంక్రాంతి పండుగ విశిష్టతను తమ ప్రవచనాలు, పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎండీ దీపావెంకట్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాసరావు, పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మిప్రసాద్, మాజీ ఎంపీ మాగంటి బాబు, ట్రస్ట్ సభ్యులు, డైరెక్టర్ పరదేశి పాల్గొన్నారు.

చిత్రకారుడు డాక్టర్ 'బొండా'కు లెజండరీ ఆర్టిస్ట్ అవార్డు



అవార్డుతో డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ చిత్రకారుడు, భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు ప్రతిష్టాత్మక 'లెజండరీ ఆర్టిస్ట్– 2023' అవార్డ్ లభించింది. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన సాంస్కృతిక సంస్థ డ్రీమ్ పెయింట్ బ్రష్ సంస్థ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ చిత్రకళ పోటీలో ఆయన ఈ అవార్డ్ దక్కించుకున్నారు. గిరిజనుల జీవనశైలిపై అనేక చిత్రాలను గీచిన జగన్‌మోహన్‌రావుకు ఈ అవార్డ్‌తోపాటు ఆయన చిత్రీకరించిన చిత్రాలతో కూడిన 2024 టేబుల్ క్యాలండర్, శాలువాలను నిర్వాహకులు పోస్ట్ ద్వారా పంపించారు. ఈ అవార్డ్‌ను అందుకున్న ఆయన్ని పలువురు చిత్రకారు లు, నగర ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా అవార్డ్ గ్రహీత డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డ్ తనకు లభించడం, తాను పోటీకి పంపించిన చిత్రాల్లో 12 చిత్రాలను ఎన్నుకుని వాటితో తన పేరున క్యాలండర్‌ను ముద్రించటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. గిరిజనుల జీవితాలపై వందలాది చిత్రాలను చిత్రీకరించి పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నానని చెప్పారు. సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ చిత్రకారులు తమ చిత్రాలను గీయాలని కోరారు. తనకు లభిస్తున్న ప్రతి అవార్డ్‌తో తనపై మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు.

మరిది, ఆడపడుచు హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు

పెనమలూరు: కానూరులో మరిది, ఆడపడుచును హత్య చేసిన కేసులో మహిళకు (వదిన) జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ మహిళ సెషన్స్ కోర్టు జడ్జి ఐ.శైలజ శుక్రవారం తీర్పునిచ్చారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ కేసుపై కానూరు సిద్ధిక్ నగర్‌లో ఉంటున్న ఎండి.హమీదున్నీసా 2019 సంవత్సరం జూన్ 17వ తేదీన పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన ఫిర్యాదులో ఆమె పెద్ద కోడలు ముంతాజ్‌బేగం చిన్న కుమారుడు ఖలీల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఖలీల్‌కు వివాహం జరిగిన తరువాత వదిన ముంతాజ్‌బేగంతో సఖ్యతగా ఉండటం లేదని కక్ష పెంచుకుంది. ఈ నేపథ్యంలో 2019 సంవత్సరం జూన్ 17వ తేదీన ముంతాజ్‌బేగం ఖలీల్ ఇంటికి వెళ్లింది. ఖలీల్ తన సోదరి హాజిన్నితో మాట్లాడుతుండగా ముంతాజ్‌బేగం తనతో తెచ్చుకున్న పెట్రోల్ ఇద్దరిపై పోసి నిప్పు అంటించింది. ఈ ఘటనలో హాజిన్ని అక్కడికక్కడే మృతి చెందగా ఖలీల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులకు అందిన ఫిర్యాదుతో అప్పటి సీఐ ముత్యాల సత్యనారాయణ ముంతాజ్‌బేగంపై హత్య కేసు నమోదు చేసి అదే ఏడాది జూన్ 21వ తేదీన అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. మహిళ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రగిరి విష్ణువర్ధన్ కేసు విచారించగా జడ్జి 26 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావటంతో ముంతాజ్‌బేగంకు జీవిత ఖైదుతోపాటు రూ. 2500 జరిమానా విధించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

అన్నవరం (జగ్గయ్యపేట): ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. భీమనపల్లి శ్రీనివాసరావు (36) తెలంగాణ రాష్ట్రంలోని ఓ పేపర్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. మందు కొట్టేందుకు బావి వద్దకు నీళ్ల తెచ్చుకోవడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. అయితే పొలానికి వెళ్లిన శ్రీనివాసరావు మధ్యాహ్నం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదు. అనుమానం వచ్చి బావి వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిల్లకల్లు ఎస్ఐ కృష్ణబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద నుంచి రూ.12 లక్షలు తీసుకొని ఓ వ్యక్తి మోసం చేశాడంటూ యువకుడు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామకృష్ణాపురం ప్రాంతానికి చెందిన ఉప్పలపాటి అనిల్‌వర్మ ఈస్ట్ గోదావరిలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుంటాడు. వీరి ఇంటి పక్కనే విజయదుర్గ, సాయినాథ్ దంపతులు నివసిస్తున్నారు. సాయినాథ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో రూ.12 లక్షలు కడితే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని భార్యాభర్తలిద్దరు అనిల్‌వర్మను నమ్మించారు. వారి మాటలు నమ్మిన 2020 లో కొంత, 2021లో మరికొంత కలిపి మొత్తం వారు అడిగిన డబ్బులను ఇచ్చాడు. సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగం గురించి ఏమి చెప్పకుండా రేపు మాపు అంటూ కాలయాపన చేసుకుంటూ వస్తున్నారు. సాయినాథ్ భార్య ఇటీవలే అనారోగ్యంతో కూడా మృతిచెందడంతో అనిల్‌వర్మ సాయినాథ్‌ను తన ఉద్యోగం, ఇచ్చిన డబ్బుల గురించి అడగ్గా ఆయన నీకు దిక్కున దగ్గర చెప్పుకో ఏమీ ఇవ్వనని చెప్పడంతో తాను మోసపోయినట్లుగా గుర్తించిన అనిల్‌వర్మ సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, సర్పంచ్



తహసీల్దార్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

వత్సవాయి : లంచం తీసుకుంటూ గ్రామ సర్పంచ్‌తో పాటు తహసీల్దార్ ఏసీబీకి చిక్కిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఏసీబీ అడిషనల్ ఎస్పీ ఎం.స్నేహిత తెలిపిన వివరాల మేరకు... రాష్ట్ర ప్రభుత్వం ఇనాం భూములకు పట్టాలు ఇచ్చేందుకు జీవో జారీ చేసింది. మండలంలోని ఆళ్లూరుపాడు గ్రామానికి చెందిన పణితి గోపాలకృష్ణ తన బాబాయి కొండకు చెందిన 84 సెంట్ల భూమికి పట్టా ఇచ్చేందుకు గ్రామ సర్పంచ్ వై.నరేంద్ర ద్వారా రూ.50,400 ఇచ్చేందుకు తహసీల్దార్ వైకుంఠరావుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని గోపాలకృష్ణ స్పందన ద్వారా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో వారు రెండు రోజులుగా రెక్కీ నిర్వహించారు. శుక్రవారం రాత్రి సర్పంచ్‌కు ఇంటి వద్ద నగదు ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకే నగదు తీసుకున్నానని సర్పంచ్ చెప్పడంతో తొలుత ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సర్పంచ్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్కడి రికార్డులను తనిఖీ చేసి తహసీల్దార్ ఆదేశాల మేరకే సర్పంచ్ నగదు తీసుకున్నాడని గుర్తించినట్లు తెలిపారు. ఘటనపై తహసీల్దార్, సర్పంచ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీలు డి.శ్రీనివాస్, శరత్‌బాబు, సీఐలు శివకుమార్, శ్రీనివాస్, హ్యాపీ కృపానందం పాల్గొన్నారు.

స్వేచ్ఛా జీవితానికి అంబేడ్కర్ ముఖ్య కారణం

ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ చిత్రంలో కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): దేశంలో అందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే అందుకు ముఖ్య కారణం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా జిల్లా స్థాయి సామాజిక సమతా సంకల్ప కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితచరిత్ర ఒక మహాకావ్యమని తెలిపారు. 140 కోట్ల మంది భారతీయులు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే అందుకు కారణం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాత్రమేనని తెలిపారు. సమాజంలోని అసమానతలు, రుగ్మతలు రూపుమాపేందుకు అంబేడ్కర్ ఎంతగానో పాటుపడ్డారని చెప్పారు. 100 సంవత్సరాల క్రితం ఎవరైనా ఉద్యోగం, చదువు, వ్యాపారం కోసం బయట ప్రదేశాలకు వెళ్లేందుకు హక్కు ఉండేది కాదన్నారు. మహిళలు నేడు స్వేచ్ఛగా అమెరికాకు, ఇతర ప్రాంతాలకు వెళుతున్నారంటే అంబేడ్కర్ చలువేనని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం ద్వారా 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. చట్టం ముందు అందరూ సమానమేనని సమాజంలో అందరికీ సమానమైన స్వేచ్ఛ ఉందన్నారు. అటువంటి మహనీయుని 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున 20ఎకరాల్లో రూ. 400 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. విగ్రహం కింది భాగాన 3 వేల మంది కూర్చునేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాటు, 2 వేల మందికి కూర్చునే వీలుగా ఓపెన్ థియేటర్, 10 వేల పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేశారన్నారు. ఆయన జన్మదినం రోజున ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ విజ్ఞాన దినోత్సవంగా ప్రకటించిందని అదే మన దేశానికి గర్వకారణమన్నారు. ఈ నెల 19వ తేదీన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి దేశంలోని లక్షలాది మంది ప్రజలు వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అందరూ పాలు పంచుకోవాలని కోరారు. కలెక్టర్ రాజాబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ కె. సంతోషరావు అధికారులను ఆదేశించారు. గవర్నర్‌పేటలోని సర్కిల్ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎస్ఈలు, ఈఈలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అవాంతరాలను తొలగించాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించాలని కోరారు. 33, 11 కేవీ, ఎల్ టీ లైన్లలో తనిఖీలు నిర్వహించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలన్నారు. అగ్రికల్చర్, హెచ్‌టీ, ఎల్‌టీ సర్వీసు లైను చార్జీలు చెల్లించిన వారికి వాటిని త్వరితగతిన రిలీజు చేయాలన్నారు. సమావేశంలో టెక్నికల్ డైరెక్టర్ జయభారతరావు, డైరెక్టర్ ఫైనాన్స్ బ్రహ్మానందరెడ్డి, సీజీఎంలు, డీఎంలు, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం

సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు రాకేష్ తికాయత్



మాట్లాడుతున్న రాకేష్ తికాయత్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు రాకేష్ తికాయత్ అన్నారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో 'మోదీ, షా హటావో –దేశ్ బచావో' పేరుతో శుక్రవారం సభ నిర్వహించారు. తికాయత్ మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ప్రాథమిక హక్కులు, పత్రిక స్వేచ్ఛపై మోదీ ప్రభుత్వం దాడి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ కేంద్ర మంత్రి జేడీ.శీలం, ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ ఏటా నిర్వహించే జాతీయ సైన్స్ కాంగ్రెస్ మీట్ నిర్వహణకు కూడా మోదీ ప్రభుత్వం సహకరించకపోవడం వల్ల ఈ ఏడాది సైన్స్ కాంగ్రెస్ సభ జరగలేదన్నారు. సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ అజీజ్ బాషా మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలు, మేధావులు, రాజకీయ ప్రత్యర్థుల గొంతు నొక్కటమే పనిగా మోడి పాలన సాగుతోందన్నారు. సభకు అధ్యక్షత వహించిన వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఈ అంశంపైనే ఈ నెల 22వ తేదీ లోపు తిరుపతి, కర్నూలు, విశాఖ, రాజమండ్రిలో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. సభ అనంతరం మేలుకో భారత్ పేరుతో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.విజయరావు, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, జై భారత నేషనల్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి వహీదా నిజాం, ప్రత్యేక హోదా సాధన కమిటీ కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా క్రికెట్ జట్టు కోచ్‌గా గాంధీ



గాంధీని అభినందిస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర మహిళ అండర్–23 క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా విజయవాడకు చెందిన ఎస్.రామ్‌కుమార్ (గాంధీ) ఎంపికయ్యారు. కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోచ్‌గా పని చేస్తున్న గాంధీని ఏసీఏ జట్టు కోచ్‌గా నియమిస్తూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 26 నుంచి కోల్‌కత్తాలో జరిగే బీసీసీఐ అండర్–23 మహిళల జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఏసీఏ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా ఎంపికైన గాంధీని కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహాక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథరాజు, కన్వీనర్ ఎం.రవిశంకర్ ఇందిరాగాంధీ స్టేడియంలోని కేడీసీఏ హాలులో శుక్రవారం అభినందించారు.

మంగినపూడి బీచ్ అభివృద్ధికి చర్యలు

జిల్లా కలెక్టర్ రాజాబాబు

కోనేరుసెంటర్: మంగినపూడి బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. శుక్రవారం ఆయన పర్యాటక, ఉద్యాన, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో కలసి బీచ్‌ను సందర్శించారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యాటకులు కొంత సమయం అక్కడ సేద తీరేందుకు సముద్ర తీరం ఆహ్లాదాన్ని పొందేలా బీచ్‌లో గ్రీనరీ అభివృద్ధి చేయడం, హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేసే విషయంపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. విశాఖ నుంచి విచ్చేసిన సన్ రే రిసార్ట్స్ అధినేత ఐ.ఏ.రాజావర్మ కలెక్టర్ వెంట ఉన్నారు. మంగినపూడి బీచ్ వద్ద చేపట్టాల్సిన గ్రీనరీ, లైటింగ్ తదితర అంశాలను కలెక్టర్‌కు ఆయన వివరించగా ఆ మేరకు చర్యలు తీసుకోవాలని పర్యాటక అధికారులను ఆదేశించారు. గ్రీనరీ ఏర్పాటుతోపాటు వాటరింగ్ కోసం నీటి సరఫరాపై ఆరా తీశారు. సమీపంలో సంపు నిర్మించి, డ్రిప్ ఇరిగేషన్ విధానంలో వాటరింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

స్వామి వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్వామి వివేకానంద బోధనలు యువతలో స్ఫూర్తిని నింపుతాయని జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం సభ జరిగింది. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. యువత జీవితంలో ఎదగాలంటే తనలోని అహంకారాన్ని వదిలేసి, మనసును నిర్మలంగా ఉంచుకోవాలని సూచించారు. జనశిక్షణ సంస్థ రిసోర్స్ పర్సన్ పి.వరలక్ష్మి మాట్లాడుతూ.. జనవరి 12 తేదీని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జనశిక్షణ సంస్థ సిబ్బంది, శిక్షణకు హాజరైన వారు పాల్గొన్నారు.

ఆంధ్రా క్రికెట్ సంఘంపై కేసు డిస్మిస్

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలను సవాల్ చేస్తూ పలువురు వేసిన కేసును దేశ అత్యున్నత స్థానం శుక్రవారం తోసిపుచ్చిందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసోసియేషన్ ఎన్నికలపై స్టే విధించాలని కోరుతూ కబడ్డీ క్రీడాకారులు వీర్లంకయ్యతో పాటు పలువురు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. ఫిర్యాదుదారులు ఫిర్యాదులో పేర్కొన్న విషయాలను నిరాధారమైనవిగా న్యాయస్థానం పరిగణలోకి తీసుకుని కేసును డిస్మిస్ చేసిందన్నారు. ఇదే విషయంపై ఫిర్యాదుదారులు ఆరు నెలల క్రితం తొలుత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారని, ఈ నెల 5వ తేదీన హైకోర్టు ఈ కేసును కొట్టివేసిందని వారు పేర్కొన్నారు.

స్విమ్మర్ తులసీచైతన్యకు అభినందన



విజయవాడస్పోర్ట్స్: ప్రపంచంలోని ఐదు జలసంధులను ఈదిన హెడ్‌కానిస్టేబుల్, అంతర్జాతీయ స్విమ్మర్ ఎం.తులసీచైతన్య సాహసం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. ప్రతిష్టాత్మకమైన ఐదు జల సంధులను ఈదిన చైతన్యను 'టెన్సింగ్ నార్కే నేషనల్ అడ్వెంచర్ అవార్డు'తో ఇటీవల కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సీపీ రాణా ఆయన కార్యాలయంలో తులసీచైతన్యను శుక్రవారం అభినందించారు. గిబ్రల్టర్, పాక్, ఇంగ్లిష్, బొడెన్సీ, కాటలీనా జలసంధులను ఈదిన తులసీచైతన్య పోలీస్ కమిషనరేట్ ఉద్యోగి కావడం గర్వంగా ఉందన్నారు. ఐదు జల సంధులను ఈదిన మొదటి ఇండియన్ పోలీస్‌గా రికార్డు సొంతం చేసుకున్నాడన్నారు. రాష్ట్ర, జిల్లా, విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటడం సంతోషంగా ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2024 జనవరి నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణతై విద్యార్హత ఉండాలని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీ://40.80.241.107/ఏపీవలంటీర్20/ఏపీవలంటీర్090420201049 వీటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వీఎంసీ వార్డు సెక్రటరీస్ స్పెషల్ సెల్ 81859 33187 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): సంక్రాంతి సంబరాల్లో భాగంగా కృష్ణలంక, మెట్లబజార్‌లోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 52 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు దిద్దారు. వాసవీ సేవా సంఘం సభ్యులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ప్రకటించారు. విజేతలకు సంఘం సభ్యులు బహుమతులను ప్రదానం చేశారు. సేవా సంఘం అధ్యక్షుడు మానేపల్లి మాణిక్యాలరావు, ప్రధాన కార్యదర్శి గొంట్లా రామ్మోహనరావు, కోశాధికారి చందలూరి సుబ్బారావు, గౌరవ సలహాదారుడు మట్టా సుబ్బారావు, కార్యదర్శి ఎస్.గోపాలశెట్టి, సభ్యులు ఎస్.మల్లికార్జునరావు, ఎ.రామ్మూర్తి పాల్గొన్నారు.

శరవేగంగా కాలనీల అభివృద్ధి

- రెండు దశాబ్దాల తర్వాత విజయలక్ష్మి కాలనీలో సీసీ రోడ్లు
- కోట్లాది రూపాయలతో బీటీ రోడ్లు, పార్కుల అభివృద్ధి
- దేవినేని అవినాష్ చొరవతోనే అంటున్న కాలనీ వాసులు



కనకదుర్గానగర్‌లోని రహదారి



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): కాలనీల్లో శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది. రెండు దశాబ్దాల కిందట వేసిన రోడ్లు శిథిలమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా గత పాలకులెవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఆ కాలనీలో రోడ్లన్నీ సీసీ రోడ్లుగా మారాయి. ఇలా విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 3వ డివిజన్ శివారు ప్రాంతాలైన విజయలక్ష్మి కాలనీ, కనకదుర్గానగర్, కామినేని నగర్‌లు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయి. ఒకప్పుడు దుమ్ముధూళితో ఉన్న కాలనీలో ఇప్పుడు రివ్వున దూసుకు పోయే రోడ్లు ఏర్పాటు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు రూ.20 కోట్లతో అత్యాధునిక సబ్‌స్టేషన్ రూపుదిద్దుకుంది. అందుకు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవ ఎంతో ఉందని కాలనీ వాసులు కొనియాడుతున్నారు.

రూ.7 కోట్లతో రోడ్ల అభివృద్ధి..

మూడో డివిజన్‌లోని శివారు ప్రాంత కాలనీల్లో ఇప్పుడు రోడ్లు మెరిసిపోతున్నాయి. విజయలక్ష్మి కాలనీలో 2006వ సంవత్సరంలో రోడ్లు వేయగా, మళ్లీ ఇప్పుడు సీసీ రోడ్లు వేశారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో పాటు, మరో రూ.49 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. అదే విధంగా కనకదుర్గానగర్ ప్రధాన రోడ్డు రూ.4.28 కోట్లుతో బీటీ రోడ్డు వేయగా, కామినేని నగర్‌లో సుమారు రూ.2 కోట్లతో రోడ్లు వేయడంతో ఇప్పుడు ఆ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయి. ఒకప్పుడు సమస్యల వలయంగా ఉన్న కాలనీలో ఇప్పుడు అభివృద్ధి చెందిన కాలనీల చెంతన చేరాయి.

రూ.1.40 కోట్లతో పార్కుల అభివృద్ధి..

కాలనీ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా కనకదుర్గానగర్‌లో రెండు పార్కులు అభివృద్ధి చేశారు. ఒక్కో పార్కును రూ.70 లక్షలతో అభివృద్ధి చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం కాలనీ ప్రజలు పార్కులకు వెళ్తున్నారు. ఆ పార్కుల్లో పిల్లల ఆట పరికరాలతో పాటు ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. వాకింగ్, వ్యాయామం చేసేందుకు కాలనీ వాసులకు ఎంతో ఉపయోగపడుతుంది.

మా రోడ్లు బాగుపడ్డాయి..



మా కాలనీలో రోడ్లు శిథిలమవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఎప్పుడో 2006వ సంవత్సరంలో రోడ్లు వేశారు. మళ్లీ ఇప్పుడు అన్ని రోడ్లు సీసీ రోడ్లు వేశారు. చాలా సంతోషంగా ఉంది. దేవినేని అవినాష్ మేము ఏ సమస్య చెప్పినా వెంటనే పరిష్కరిస్తున్నాం. మా రోడ్లు బాగుపడ్డాయి.

– జమ్ముల ప్రసాద్, విజయలక్ష్మి కాలనీ

అందుబాటులో పార్కులు



ఒకప్పుడు రోడ్లు అన్నీ శిథిలమై ఉండగా, ఇప్పుడు సీసీ రోడ్లు వేశారు. ప్రతి రోజూ శానిటేషన్ వాళ్లు వచ్చి చెత్తను సేకరిస్తూ, అన్ని రకాలుగా సమస్యలు పరిష్కరిస్తున్నారు. మెయిన్ రోడ్డు కూడా త్వరలోనే బీటీ రోడ్డు వేస్తామని చెప్పారు. పార్కులు అందుబాటులోకి రావడంతో ఆనందంగా ఉంది

– కృష్ణారెడ్డి, విజయలక్ష్మి కాలనీ

ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నాం..



డివిజన్‌లోని కాలనీల్లో ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నాం. అందులో భాగంగా కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, పార్కుల ఏర్పాట్లకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సహకారంతో అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటి వరకు రూ.7 కోట్లతో రోడ్లు వేశాం. పార్కులు అభివృద్ధి చేశాం.

– భీమిశెట్టి ప్రవల్లిక, 3వ డివిజన్ కార్పొరేటర్

స్మృతివనం వద్ద విద్యుద్దీకరణ పనులు పూర్తి చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వరాజ్‌మైదానంలో అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం వద్ద విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేయాలని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు సిబ్బందిని ఆదేశించారు. అంబేడ్కర్ స్మృతివనం వద్ద జరుగుతున్న విద్యుత్ పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాట్లాడుతూ.. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రోడ్డులో అడ్డుగా ఉన్న 33 కేవీ లైన్లను తొలిగించాలన్నారు. తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. . కొత్తగా రిలీజ్ చేసిన హెచ్‌టీ సర్వీస్‌ను చెక్ చేశారు. ఎస్ఈ ఏ.మురళీ మోహన్, టౌన్ ఈఈ బి.వి.సుధాకర్, ఏడీఈ పి. శ్రీధర్, ఏఈలు ఉన్నారు.

భవిష్యత్‌ను దీవెనకరంగా మలుచుకోండి



లబ్బీపేట(విజయవాడ తూర్పు): దేవుడి యందు విశ్వాసపాత్రులుగా మెలుగుతూ, ఇతరుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు చూపితే భవిష్యత్ దీవెనకరంగా ఉంటుందని లైఫ్ ఛేంజింగ్ రివైవల్ సెంటర్ ఫౌండర్ పీజే స్టీఫెన్ పాల్ అన్నారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం స్టీఫెన్ పాల్, సిస్టర్ షైలా పాల్‌ల ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయవాడతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాలో నుంచి విశ్వాసులు హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీకి మళ్లీ అధికారం ఖాయం

- విజయవాడ ఎంపీ కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి
- కార్మికవాడలో రూ.3.38 కోట్లతో వాటర్ ట్యాంక్ ప్రారంభం



కుళాయిని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి, అవినాష్ తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరిగిందని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని విజయవాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకులు కేశినేని శ్రీనివాస్ అలియాస్(నాని) స్పష్టం చేశారు. ఆటోనగర్‌లో రూ.3.38 కోట్లతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును శుక్రవారం ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నాని మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. జవహర్ ఆటోనగర్‌కు ఆసియా ఖండంలో గొప్పపేరు ఉందన్నారు. గతంలో ఆటోనగర్ అప్రోచ్ రోడ్డుకు తన ఇంటి ముందు స్థలం రెండు ఎకరాలు బాండ్ లేకుండా ఉచితంగా ఇచ్చానన్నారు. పార్టీలో చేరిన వెంటనే తనకు ఎంపీ సీటు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అవినాష్‌ను ఎమ్మెల్యేగా, ఎంపీగా తనను వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

శరవేగంగా నగరాభివృద్ధి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ నగరాన్ని శరవేగంగా అభివృద్ధి చేసేందుకు గాను రూ.కోట్లాది డబ్బును హెచ్చించామని మేయర్ భాగ్యలక్ష్మి చెప్పారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో నగరం బాగా అభివృద్ధి చెందిందన్నారు. తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు.

గత ప్రభుత్వం నీరు ఇవ్వలేదు..

కార్మికవాడ ఏర్పడి 40 ఏళ్లు అవుతున్నప్పటికీ తాగు నీటికి నోచుకోలేదని.. దీనికి అంతటికి చంద్రబాబు పుణ్యమేనని నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇక్కడ ఉన్న అన్ని కార్మిక సంఘాల నాయకత్వంలో ఎంపీ కేశినేని నాని సహకారంతో ఆటోనగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంపీ నిధులు, ఐలా నిధులతో సుమారు రూ.3.38 కోట్లతో నీటి ట్యాంక్‌ను నిర్మించారన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని 7 నియోజవర్గాలతో పాటు ఎంపీ సీట్‌ను గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ నానిని సన్మానించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఐలా మాజీ చైర్మన్ ఎస్ దుర్గాప్రసాద్, ఓల్డ్ ఐరన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల ప్రసాద్‌రెడ్డి, విజయవాడ క్లస్టర్ ఫైనాన్స్ డైరెక్టర్ బాయన బాబూజీ, ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, వివిధ అసోసియేషన్ల అధ్యక్షులు అబ్దుల్ కలాం, గౌస్‌ఖాన్, పూర్ణ, 11వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పర్వతనేని బాబి పాల్గొన్నారు.

ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి వివేకానంద

తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డా.నందమూరి లక్ష్మీపార్వతి, కొమ్మినేని శ్రీనివాసరావు



పురస్కార గ్రహీతలతో నందమూరి లక్ష్మీపార్వతి, శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన బోధనలతో ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి స్వామి వివేకానంద అని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డా.నందమూరి లక్ష్మీపార్వతి, మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని హోటల్ ఐలాపురం కన్వెన్షన్ హాలులో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి. తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వేడుకల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ వివేకానంద బోధనలతో యువతను జాగృతం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. తన బోధనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచారని తెలిపారు. మాస్టర్ మోటివేటర్ బ్రదర్ షఫీ మాట్లాడుతూ యువత తమలో దాగివున్న నైపుణ్యాలను గుర్తెరిగి తద్వారా సామాజిక చైతన్యానికి, దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 25 మందికి సంఘ మిత్ర జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, అద్దంకి రాజాయోనా, మీడియా అకాడమీ రాష్ట్ర కార్యదర్శి యం.బాలగంగాధర్ తిలక్, పుడమి సాహితీవేదిక అధ్యక్షుడు డా.చిలుముల బాల్‌రెడ్డి, సాహితీవేత్త కొల్లి రమావతి, డ్రీమ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మేదర సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో సంక్రాంతి సంబరాలు



లయోలా కాలేజీలో భోగి మంట వెలిగించి వేడుకలు ప్రారంభించిన అధ్యాపకులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని లయోలా కళాశాల్లో రెండు రోజుల నుంచి జరుగుతున్న స్ఫూర్తి కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. విద్యార్థులకు డిబేట్, వక్తృత్వం, వ్యాస రచన, సమూహ చర్చ, క్విజ్ సాహిత్య పోటీలు, పోస్టర్ మేకింగ్, కార్టూనింగ్, స్పాట్ ఫోటోగ్రఫీ, మెహందీ, రంగోలి, సంగీతం- క్లాసికల్ డ్యాన్స్ (సోలో), వెస్టర్న్ (సోలో), జానపద సమూహ నృత్యం, క్లాసికల్ వంటి లలిత కళలు గాత్రం (సోలో), వెస్టర్న్ వోకల్(సోలో), థియేటర్ ఆర్ట్స్ - స్కిట్, మైమ్, మిమిక్రీ, స్టాండ్ అప్ కామెడీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ ఎం. కృష్ణకుమారి బహుమతులను అందించారు. మధ్యాహ్నం సెషన్‌లో, సంప్రదాయ బ్యాండ్‌తో ఊరేగింపుతో సంక్రాంతి సంబరాలు ప్రారంభమవ్వగా రంగవల్లులు, భోగి మంటలు, గాలిపటాలుతో విద్యార్థులు సంక్రాతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సగయరాజ్, ప్రిన్సిపాల్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్స్ కె.కిరణ్ కుమార్, ప్రభుదాస్, స్టూడెంట్ యాక్టివిటీస్ డీన్ డాక్టర్ ఎల్.సుభ, స్టాఫ్ కోఆర్డినేటర్లు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.



హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్కులో సంక్రాంతి వేడుకలు

ఫార్చ్యూన్ పార్కులో..

లబ్బీపేట(విజయవాడ తూర్పు): నగరంలోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్కులో గ్రామీణ వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో హోటల్ సిబ్బందితో పాటు, పలువురు కస్టమర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో హోటల్ జనరల్ మేనేజర్ విజయకృష్ణ, సేల్స్ మేనేజర్లు జిలానీ, పవన్, చీఫ్ ఇంజినీర్ వైకుంఠరావు, సుధాకర్, నాగబాబు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాల మంజూరు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



మీ అవినాష్ అన్న హామీ కరపత్రాలు అందజేస్తున్న అవినాష్, నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కుల, మత, పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట 17వ డివిజన్‌లోని చలసానినగర్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. గడప గడపకు వెళ్లి నాలుగున్నరేళ్ల జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మరలా అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాలను మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు.

టీడీపీకి అధికారం కలే..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కరకట్ట వాసుల చిరకాల కోరిక రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని గడువు కంటే ముందే పూర్తిచేశామని గుర్తుచేశారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇవ్వలేని గ్యారెంటీ ఇప్పుడు అధికారం ఇస్తే ఇస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకే మాత్రమే పచ్చ మీడియా, సోషల్ మీడియాల్లో అధికారంలోకి వస్తున్నాం అని ప్రచారం చేసుకుంటున్నారని, వారు అధికారంలోకి రావడం కలగానే మిగిలిపోతుందన్నారు. ప్రజలందరూ వైఎస్సార్ సీపీ పక్షానే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధించడం తథ్యమన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు డివిజన్లలో పర్యటన

అలాగే దేవినేని అవినాష్ కుటుంబ సభ్యులు పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. 3వ డివిజన్‌లో పలు వీధుల్లో దేవినేని సుధీర, 12వ డివిజన్‌లో దేవినేని క్రాంతి గడప గడపకు వెళ్లి గత నాలుగున్నరేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కో ఆప్షన్ మెంబర్ ముసునూరు సుబ్బారావు, 12వ డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహాయం అభినందనీయం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తాము చదువుకున్న కళాశాలలో సమస్యలను పరిష్కరించడానికి పూర్వ విద్యార్థులు సహాయం చేయడం అభినందనీయమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కళాశాల ఎలక్ట్రికల్ లాబోరేటరీలో అవసరమైన ఫ్లోరింగ్, రంగులు వేయడం, తలుపులు, కిటికీలకు సుమారు 2.15 లక్షల రూపాయలతో రిపేర్లు చేయించారు. పూర్తి అయిన పనులను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఎలక్ట్రికల్ శాఖాధిపతి భీమా నాయక్, అధ్యాపకులు రాకేష్ బాబు, రిటైర్డ్ అధ్యాపకుడు భానుమూర్తి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎంవీ.బాబు, కార్యదర్శి గోపిచంద్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులు రామచంద్రరావు, వెంకటేశ్వరరావు, గిరిజా కుమారి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

వీఎంసీలో మరో ఐదు ప్రత్యేక కమిటీల ఏర్పాటు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ సెక్రటరీ సెల్‌లో సెక్రటరీ వసంతలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీకి మరో ఐదు ప్రత్యేక కమిటీ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యింది. పారిశుద్ధ్యం, ఆరోగ్యం ప్రత్యేక కమిటీకి చైర్‌పర్సన్‌గా 59వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ షహీనా సుల్తానా, డెప్యూటీ చైర్‌పర్సన్‌గా 35వ డివిజన్ కార్పొరేటర్ బలసాని మణెమ్మను నియమించారు. నగర సమగ్రాభివృద్ధి ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, డెప్యూటీ చైర్మన్‌గా 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత, ఆర్థిక, ఆడిట్ ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్‌గా 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మల కుమారి, వైస్ చైర్‌పర్సన్‌గా 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్యను నియమించారు. మహిళాభ్యుదయ ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్‌గా 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైస్ చైర్‌పర్సన్‌గా 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, విద్యా, సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేక కమిటీకి 32వ డివిజన్ చైర్మన్‌గా రామ్మోహనరావు, వైస్ చైర్మన్‌గా 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావును నియమించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ పటమట కరణం బజారుకు చెందిన శతాధిక వృద్ధురాలు బొడ్డపల్లి వెంకట స్వరాజ్యలక్ష్మి(106) గురువారం కన్నుమూశారు. ఈమె మృతి చెందే రోజు వరకు తన పని చేసుకొనేది అని బంధువులు చెబుతున్నారు. ఈమె భర్త బ్రహ్మానందరావు కరణంగా 25 ఏళ్లు పని చేశారు. ఆయన 1968వ సంవత్సరంలో మరణించారు. వీరికి ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు సంతానం కలరు.

చంద్రబాబు, లోకేశ్ దొంగలు

టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాయపాటి రంగారావు


చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టిన రంగారావు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు లోకేశ్ దొంగలని, ఆ పార్టీ ఓ దిక్కుమాలిన పార్టీ అని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాయపాటి రంగారావు చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేశ్ ధన దాహానికి తమ కుటుంబం సర్వనాశనం అయిపోయిందని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌కు డబ్బే ముఖ్యమని, మరేమీ అవసరం లేదని అన్నారు. ఇక టీడీపీలో ఉండలేనని స్పష్టం చేశారు. పార్టీకీ, పదవికి రాజీనామ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ వెంటనే తన కార్యాలయంలో ఉన్న చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరిన తాము ఆ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. గత ఎన్నికలకు ముందు తమ నుంచి రూ. 150 కోట్లు తీసుకున్నారని తెలిపారు. లోకేశ్, చంద్రబాబునాయుడు ఎంతెంత తీసుకున్నారో తమ వద్ద లెక్కలున్నాయన్నారు. తండ్రి, కొడుకు ఒకరికి తెలియకుండా మరొకరు డబ్బులు తీసుకున్నారన్నారు. డబ్బులు తీసుకుని కూడా పోలవరం ప్రాజెక్టు విషయంలో తమను సర్వ నాశనం చేశారన్నారు. చంద్రబాబు కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారని చెప్పారు. సోమవారం పోలవారం అని చంద్రబాబు చెప్పడం ఉత్త బోగస్ అని అన్నారు. చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరంపై సమీక్ష చేసింది కేవలం లంచాల కోసమేనని చెప్పారు. ప్రతి వారం డబ్బులు వసూలు చేశారని తెలిపారు. తమని హింసించి మరీ డబ్బులు వసూలు చేశారన్నారు. తమ ఆస్తులన్నీ బ్యాంకులో పెట్టుకున్నారని అన్నారు. డబ్బులు వాడుకుని మూడు సంవత్సరాల తర్వాత మమ్మల్ని ప్రాజెక్టు నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి చేసినట్లుగా చంద్రబాబు చెబుతున్నది పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు.

పేదల కోసం పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం పనిచేస్తున్నారని రంగారావు చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని సీఎం జగన్ ఒక సంవత్సరం బడ్జెట్ మొత్తం ఖర్చు పెట్టారని చెప్పారు. ఆ రెండేళ్ల ఆంధ్రప్రదేశ్ జీడీపీ ఎక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంక్ వెబ్‌సైటే చెబుతోందని తెలిపారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయన్నారు. జగన్ అంటే తమకు ఇష్టమని, ఆయన సీటు ఇస్తే పోటీ చేస్తానని చెప్పారు.

టీడీపీ ఫక్తు వ్యాపార సంస్థ

తెలుగుదేశం రాజకీయ పార్టీయే కాదని, ఫక్తు వ్యాపార సంస్థ అని ఆరోపించారు. ఆ పార్టీ ఉంది ప్రజల కోసం కాదని, కేవలం వాళ్లు బాగుపడటం కోసమేనని చెప్పారు. లక్ష ఉద్యోగాలు తెచ్చామని, శ్రీసిటీ కట్టించామన్నారని, కియా కంపెనీ తెచ్చామని చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. కియా కంపెనీ తెస్తే అనంతపురంలో ఎందుకు ఓడిపోయారని అన్నారు. లోకేశ్ రాయలసీమలో కాకుండా మంగళగిరి ఎందుకొచ్చాడని ప్రశ్నించారు. లోకేశ్‌కు ధైర్యం ఉంటే రాయలసీమలో పోటీ చేయాలని సవాల్ చేశారు. మంగళగిరిలో లోకేశ్‌ను ఓడిస్తానని చెప్పారు. గతంలో మంగళగిరిలో కాండ్రు కమల, మురుగుడు హనుమంతరావులను తామే గెలిపించుకున్నామని అన్నారు. బాబు, లోకేశ్ గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కులచిచ్చు లేపుతున్నారని ఆరోపించారు.

టీడీపీని నమ్ముకున్న వాళ్లంతా అప్పుల్లో ఉన్నారు

తమ కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉందని, ఎవరినీ మోసం చేయలేదని తెలిపారు. తాను సత్తెనపల్లి సీటు అడిగినా, కన్నా లక్ష్మీనారాయణను నియమించారన్నారు. కన్నా నియామకంతో 83 ఏళ్ల తమ తండ్రి రాయపాటి సాంబశివరావు ఆవేదన చెందారన్నారు. 2014లో రాయపాటి సాంబశివరావు ఎంపీగా గెలిచాక కూడా టీడీపీలో అనేక అవమానాలు ఎదుర్కొన్నారని తెలిపారు. వినుకొండలో మంచినీటి పథకం తెస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును అడిగితే చిన బాబును అడగాలని చెప్పారన్నారు. ఇదేం పద్ధతని, లోకేశ్ ఏమైనా డైరెక్ట్ ఎలక్షన్‌లో గెలిచారా అని నిలదీశారు. తామే కాదని, పార్టీని నమ్ముకున్న అనేకమంది అప్పుల్లో ఉన్నారని తెలిపారు. చనిపోయిన వారికి ఇన్సూరెన్స్ ఇస్తానని డబ్బులు వసూలు చేసిన లోకేశ్ ఎంతమందికి ఇచ్చారని నిలదీశారు. చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్ర ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. రెండు, మూడు లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారని, ఆ డబ్బులు ఎక్కడ ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు.

రియల్ ఎస్టేట్ కోసమే అమరావతి

భూములు తీసుకుని రైతులను చంద్రబాబు నట్టేట ముంచాడు

- ఏ రాజైనా కోట కడతాడు కానీ.. నగరాన్ని కట్టడు
- విజయవాడకు నిధులు ఇవ్వని ఏకైక సీఎం బాబు
- చంద్రబాబుపై మండిపడ్డ ఎంపీ కేశినేని నాని


మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని

ఆటోనగర్(విజయవాడతూర్పు): 'ప్రజలకు మంచిచేద్దామనే ఆలోచన చంద్రబాబుకు ఏనాడు లేదు.. రియల్ ఎస్టేట్ కోసమే అమరావతిని రాజధానిగా ఎంపిక చేశాడు. భూములు తీసుకుని రైతులను నట్టేట ముంచాడు. ఏ రాజైనా కోట కడతాడు కానీ నగరాన్ని కట్టడు. ఆయనది సింగిల్ అజెండా .. ఎందుకూ పనికిరాని ఆయన కొడుకు లోకేశ్‌ను సీఎం చేయడానికే నిరంతరం పాకులాడుతున్నాడు' అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఆటోనగర్‌లో నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ఇందులో పాల్గొన్న కేశినేని నాని విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అమరావతి పేరుతో రైతుల నుంచి 33వేల ఎకరాలు సేకరించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం మినహా.. వారి ప్రయోజనానికి వీసమెత్తు కృషి కూడా చేయలేదని మండిపడ్డారు. 'రాజధాని పేరుతో ల్యాండ్ మాఫియా దోచుకుంది. నేను రాజధానికి వ్యతిరేకం కాదు. రాజధాని వారధి దాటిన తర్వాత కాజా సమీపంలో నిర్మించాల్సి ఉంది. ఆ పని చేయకుండా రైతుల భూములను తీసుకుని దాని మీద భూ మాఫియాదారుల జేబులు నింపేసుకున్నారు' అని విమర్శించారు. విజయవాడ ఎంపీగా తాను అధికంగా నిధులు తీసుకొచ్చానని చెప్పారు. 2014–2019 కాలానికి విజయవాడ అభివృద్ధికి రూ.100 కోట్లు కూడా బాబు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. విజయవాడకు నిధులు ఇవ్వని ఏకైక సీఎం చంద్రబాబేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను విజయవాడ (గన్నవరం) ఎయిర్‌పోర్టు అభివృద్ధికి అప్పట్లో రూ.వెయ్యి కోట్లు నిధులు కేంద్రం నుంచి తీసుకువచ్చానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుతో పవన్‌కళ్యాణ్ పొత్తుపెట్టుకున్నారని.. పవన్‌కళ్యాణ్‌ను కూడా ఆయన మోసం చేస్తాడని నాని మండిపడ్డారు. అలాంటి మనస్తత్వం చంద్రబాబుదని తీవ్రస్థాయిలో విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అతి తక్కువ సీట్లకు మాత్రమే పరిమితం అవుతుందని చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని అన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన మంత్రి కారుమూరి

వైఎస్సార్‌సీపీ ఏలూరు లోక్‌సభ సమన్వయకర్త సునీల్‌కుమార్ యాదవ్ కూడా..

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ ఏలూరు లోక్‌సభ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ కలిశారు. సునీల్‌కుమార్ యాదవ్‌ను వైఎస్సార్‌సీపీ ఏలూరు లోక్‌సభ సమన్వయకర్తగా సీఎం జగన్ నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సీఎం జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని చెప్పారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఎంతోమంది లబ్ధిపొందారని తెలిపారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ తిరుపతి లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులైన కోనేటి ఆదిమూలం శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ సీఎం జగన్ నిర్ణయమే తనకు శిరోధార్యం అని చెప్పారు.

పార్టీ ప్రకటించిన అభ్యర్థితో కలిసి పనిచేస్తాం

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



కర్నూలు సిటీ: పార్టీ ప్రకటించిన అభ్యర్థికి తాను పూర్తి సహకారం అందించి ఆయన గెలుపునకు కృషి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ స్పష్టంచేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి కోడుమూరు నియోజకవర్గం అడ్డా అని, కచ్చితంగా 2024లో పార్టీని గెలిపించుకుంటామన్నారు. కోడుమూరులో 2014, 2019లో రెండుసార్లు ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారని, ఈసారి కూడా ప్రజలు అదే తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఇక కోడుమూరులో టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. అందరం సమష్టిగా పని చేస్తామని, తమలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకుని ముందుకెళ్తామని చెప్పారు. సీఎం జగనన్నపై తనకు పూర్తిస్థాయిలో విశ్వాసం ఉందని, భవిష్యత్‌లో తనకు మంచి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం పార్టీ ప్రకటించిన అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ స్థానికులేనని, ఇక్కడే విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు సేవ చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్పష్టంచేశారు.

ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీలోనే

మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కుటుంబానికి బీఎస్ఆర్ ఫ్యామిలీ ఎప్పుడూ విధేయతగానే ఉంటుందని, ఊపిరి ఉన్నంత వరకు తానూ, కుటుంబ సభ్యులంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని అనంతపురం మాజీ ఎమ్మెల్యే గురునాథ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నగరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో తాము కాంగ్రెస్‌లోకి వెళుతున్నట్లు ప్రచారం చేయడాన్ని ఖండించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో తమ కుటుంబం సన్నిహితంగా ఉండడమే కాకుండా రాజకీయాలతో సంబంధం లేకుండా బంధుత్వం ఉందన్నారు. చాలా ఏళ్లుగా వైఎస్సార్ కుటుంబ అడుగుజాడల్లోనే నడుస్తున్నామన్నారు. ఈ క్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచేందుకు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వైఎస్సార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్ కుటుంబానికి ద్రోహం చేసిందన్నారు. వైఎస్సార్ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేసి, రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసిన కాంగ్రెస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మరోసారి వైఎస్సార్ కుటుంబంపై కక్ష కట్టి.. ఆ ఫ్యామిలీని విడదీసేలా వ్యవహరిస్తోందన్నారు. ఇందులో మాజీ సీఎం చంద్రబాబు, ఎల్లో మీడియా కుట్ర కూడా ఉందని గురునాథ రెడ్డి విమర్శించారు.

రీజియన్ల వారీగా క్యాడర్ మీటింగ్‌లు

- 175 సీట్లలో గెలిచేలా కార్యకర్తలను సిద్ధం చేసేందుకు కార్యక్రమాలు
- 4 లేదా 6 జిల్లాలను కలిపి ఒక సమావేశం
- జనవరి 25న విశాఖపట్నం, భీమిలిలో మొదటి భేటీ

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని '5 రీజియన్లలో క్యాడర్ మీటింగ్'లను నిర్వహించి వారికి దిశానిర్దేశం చేయబోతున్నారు. ఈ మేరకు పార్టీ క్యాడర్‌కు వైఎస్సార్‌సీపీ సందేశం పంపింది. 4 లేదా 6 జిల్లాలను కలిపి ఒక సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ సభ్యులందరినీ ఏకం చేసి, వారిలో చైతన్యం నింపుతూ రాబోయే ఎన్నికల్లో 175 /175 సీట్లలో గెలిచేలా వారిని సంసిద్ధం చేయడమే ఈ సమావేశాల ముఖ్యమైన లక్ష్యం. మొదటి సమావేశం ఈనెల 25న విశాఖపట్నం, భీమిలిలో జరగనుంది. మిగిలిన నాలుగు ప్రాంతాల తేదీలను త్వరలో తెలియజేస్తారు.

మంత్రి పదవి ఇవ్వలేదని వేరే పార్టీకి వెళ్లడం సిగ్గుచేటు

- నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు: మంత్రి పదవి ఇవ్వలేదని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఒక ఎమ్మెల్యే వేరే పార్టీకి వెళ్లడం సిగ్గుచేటని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలంలోని తూర్పు దిగవల్లిలో శుక్రవారం గ్రామ సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రాజకీయాల్లో ఓర్పు ఉండాలని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు సేవ చేయాలని చెప్పారు. గెలిచిన 151 మంది ఎమ్మెల్యేలకూ మంత్రి కావాలనే ఉంటుందని, అందరికీ మంత్రి పదవులు ఇవ్వలేరు కదా.. అని అన్నారు. అధిష్టానానికి ఎన్నో సమీకరణాలు, సవాళ్లు ఉంటాయని, వాటన్నింటిని అధిగమిస్తూ పార్టీని విజయపథాన నడపాల్సి ఉంటుందన్నారు. మంత్రి పదవుల కోసమే పార్టీలో ఉండే వారిని పక్కన పెట్టేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

యువత నన్ను వాళ్లలో చూసుకుంటున్నారు

- జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: దశాబ్దం పాటు తనను అన్ని విధాలా నమ్మి, తన లక్ష్య సాధనలో యువతరం నిలబడిందని, తనను వారిలో చూసుకుంటారని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో 'జనసేనానితో గ్లాసు టీ' పేరుతో కొంత మంది యువకులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసారి కచ్చితంగా చట్టసభల్లో జనసేన గొంతు వినిపించాలని, 15 ఏళ్లకు పైగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తిరిగానని, సమస్యలను తెలుసుకున్నానని చెప్పారు. చట్టసభల్లో జనసేన ఉండాలని, సమస్యలను తీర్చే స్థాయిలో ముందడుగు వేయాలని పవన్ అన్నారు.

తెలుగుదేశంలో గందరగోళం

- పోటీకి అభ్యర్థులు కరువు
- పొత్తుల వల్ల ముందుకెళ్లలేని దుస్థితి
- క్షేత్రస్థాయిలో నిరాశ, నిస్పృహ
- వైఎస్సార్‌సీపీ దూకుడుతో వెన్నులో వణుకు
- బలహీనతను కప్పిపుచ్చేందుకు తొలి దశగా 25 మందితో జాబితా విడుదలకు కసరత్తు!



సాక్షి, అమరావతి: ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీలో తీవ్ర గందరగోళం నెలకొంది. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీకి అభ్యర్థులు దొరక్కపోవడం, పొత్తుల నేపథ్యంలో శ్రేణుల్లో నెలకొన్న నైరాశ్యం ఆ పార్టీని పట్టిపీడిస్తున్నాయి. ఓ వైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపికలో దూకుడు ప్రదర్శిస్తూ ఇప్పటికే మూడు జాబితాలు ప్రకటించడం టీడీపీ అధిష్టానం వెన్నులో వణుకుపుట్టిస్తోంది. చాలాచోట్ల తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేయాలంటేనే అభ్యర్థులు వెనుకాడుతున్నారు. మెజార్టీ ఎంపీ స్థానాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సాధారణంగా ఎన్నికలకు ముందు నుంచే అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు కసరత్తు ప్రారంభించేవారు. ఈ ప్రక్రియను సుదీర్ఘంగా సాగదీసేవారు. ఇప్పుడు అసలు ఆ పార్టీలో ఆ హడావుడి ఏమీ కనిపించడం లేదు. మరోవైపు పొత్తుల వల్ల నియోజకవర్గాల్లో విభేదాలు తారాస్థాయికి చేరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ దశలో జనసేన–టీడీపీ మధ్య సీట్ల పంపకం కత్తిమీద సాములా మారనుంది. దీనికితోడు బీజేపీతోనూ పొత్తు కోసం బాబు తహతహలాడుతున్న నేపథ్యంలో స్థానాల కేటాయింపు మరింత సంక్లిష్టంగా మారే ఆస్కారం ఉందనే వాదన టీడీపీ నేతల్లో వ్యక్తమవుతోంది.

సీఎం జగన్ ఎత్తుగడలతో కలవరం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ఎత్తుగడలు టీడీపీని కలవరపెడుతున్నాయి. సీఎం చకచక వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రకటించడంతోపాటు సామాజిక సమతూకం పాటిస్తుండడం, కొత్త అభ్యర్థులు ప్రజల్లోకి త్వరగా వెళ్లేలా చూడడం వంటి చర్యలు టీడీపీని సతమతం చేస్తున్నాయి. దీంతో ఆత్మరక్షణలో పడిన తెలుగుదేశం సొంత సోషల్ మీడియా, ఎల్లో మీడియా, నోటి ప్రచార వ్యూహాలతో బలంగా ఉన్నట్టు కలరింగ్ ఇచ్చుకునేందుకు యత్నిస్తోంది. వాస్తవానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఏమీ బాగోలేవని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ఆత్మరక్షణగా తొలి జాబితా విడుదలకు యత్నం!

బలహీనతలను కప్పిపుచ్చుకునేందుకు, క్యాడర్‌ను సమాధానపరిచేందుకు టీడీపీ ఆత్మరక్షణ చర్యలు చేపట్టింది. పొత్తులతో సంబంధం లేకుండా ఇబ్బందులేమీ లేవని భావిస్తున్న కుప్పం, హిందూపురం, మంగళగిరి వంటి కొన్ని స్థానాలను గుర్తించి 25 మందితో తొలి జాబితాను ప్రకటించాలని చూస్తోంది. సంక్రాంతికి ఈ జాబితా విడుదలకు యత్నిస్తున్నా.. అది ఎంతవరకూ సాధ్యమనే అనుమానాలు సొంత పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి.

బాబు పక్కచూపులు

టీడీపీ నుంచి పోటీకి అభ్యర్థులు దొరక్కపోవడంతో అధికార పార్టీలోని అసంతృప్తుల వైపు చంద్రబాబు చూస్తున్నారు. అక్కడ చోటు లేక బయటకు వచ్చేవారిని చేర్చుకుని సీటు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే అధికార పార్టీలో సీటు దక్కని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని పార్టీలో చేర్చుకుంటున్నట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఆయనకు పెనమలూరు లేదా నూజివీడు సీటు ఇచ్చేందుకు చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇలా చాలాచోట్ల వైఎస్సార్‌సీపీ సీటు నిరాకరించిన నేతలను చేర్చుకుని అభ్యర్థుల కొరత తీర్చుకోవాలని బాబు చూస్తున్నారు. దీన్నిబట్టి ఆ పార్టీ ఎంత బలహీనంగా ఉందో స్పష్టమవుతోందనే వాదన రాజకీయవర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

చంద్రబాబుకు వరుస షాక్‌లు

- టీడీపీకి రాజీనామా చేసిన మాజీ ఎంపీ రాయపాటి తనయుడు రంగారావు
- పార్టీలో కీలక పదవిలో ఉన్న రంగారావు
- ఇప్పటికే కేశినేని నాని రాజీనామాతో తెలుగుదేశం కుదేలు
- టీడీపీకి గుడ్ బై చెప్పిన తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు
- అదే బాటలో మరికొందరు ముఖ్య నేతలు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకి వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. ఎన్నికల ముంగిట్లో ముఖ్య నేతలు వరుసగా చంద్రబాబుకి ఝలక్ ఇచ్చి పార్టీని వీడిపోతున్నారు. రెండు రోజుల క్రితం విజయవాడ ఎంపీ కేశినేని నాని టీడీపీని వీడిపోగా, శుక్రవారం గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తనయుడు, టీడీపీలో కీలక పదవిలో ఉన్న రాయపాటి రంగారావు పార్టీకి రాజీనామా చేశారు. రాయపాటి సాంబశివరావు 2014లో టీడీపీ తరఫున నర్సరావుపేట ఎంపీగా గెలిచారు. 2019లో అదే పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. టీడీపీకి, చంద్రబాబుకు అనేక విధాలుగా సహాయ పడిన రాయపాటి కుటుంబాన్ని చంద్రబాబు తీవ్రంగా అవమానించారు. దీంతో ఆ కుటుంబం చంద్రబాబుపై ఆగ్రహంతో పార్టీని వదిలేసింది. రంగారావు తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చంద్రబాబు లేఖ రాశారు.

కేశినేని రాజీనామాతో కంగారు

విజయవాడ ఎంపీ కేశినేని నాని రాజీనామాతో తెలుగుదేశం పార్టీ నేతలు ఉలిక్కిపడ్డారు. ఆయన రాజీనామా ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీపై బాగా ప్రభావం చూపుతుండడంతో చంద్రబాబు పరిస్థితి కక్కలేక మింగలేక అన్నట్లు తయారైంది. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌పై నాని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడం పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. చంద్రబాబు నైజాన్ని ఆయన బయటపెట్టడంతో పార్టీలో ఉన్న డొల్లతనం బయటపడింది. కేశినేనికి మద్దతుగా ఎన్టీఆర్ జిల్లాలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, ఆయన భార్య సుధారాణి టీడీపీకి రాజీనామా చేసి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇంకా మరికొందరు ముఖ్య నాయకులు కేశినేని వెంట నడిచేందుకు సిద్ధమవడంతో ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ కకావికలమవుతోంది.

క్యూలో మరికొందరు ముఖ్యులు

టీడీపీని వీడేందుకు మరికొందరు ముఖ్య నాయకులు రెడీగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో పార్టీ పరిస్థితి దిగజారిపోవడం, చంద్రబాబు, లోకేశ్ వ్యవహార శైలి భరించలేకపోవడం వల్ల అనేక మంది వేరే దారి చూసుకోవాలని భావిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పల్నాడు జిల్లా నుంచి కీలక నాయకులు టీడీపీకి దూరం అవుతారనే ప్రచారం రెండు రోజులుగా విస్తృతంగా జరుగుతోంది. దీంతో క్యాడర్ బెంబేలెత్తిపోతోంది. ఇప్పటికే సరైన అభ్యర్థులు దొరక్క ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఉన్న వారు కూడా వెళ్లిపోతే పార్టీ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని పార్టీ నేతలు చెబుతున్నారు.

టీడీపీకి విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణ గుడ్‌బై

- ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగమనేని శివరామప్రసాద్ కూడా రాజీనామా
- మరికొందరు నేతలూ పార్టీకి రాంరాం

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్) : టీడీపీకి ఆ పార్టీ సీనియర్ నాయకుడు, బీసీ నేత, మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణ రాజీనామా చేశారు. విజయవాడలోని ఎంపీ కేశినేని నాని భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ అస్తవ్యస్తంగా మారిందన్నారు. తాను పాతికేళ్లుగా టీడీపీ కోసం పనిచేస్తున్నానని.. ఆ పార్టీలో బీసీలకు ఏమాత్రం గౌరవంలేదని, ఇందుకు తానే నిదర్శనమని తెలిపారు. తనకు గత కార్పొరేషన్ ఎన్నికల్లో బొండా ఉమామహేశ్వరరావు సీటు ఇవ్వకుండా అడ్డుకున్నారని.. తాను ఎంపీ కేశినేని నాని ద్వారా సీటు తెచ్చుకుంటే పార్టీలోనే మరో వ్యక్తిని ఇండిపెండెంట్‌గా తనపై పోటీచేయించి ఉమా భార్య, అన్న, కుమారుడు తనను ఓడించారన్నారు. ఇకపై తన పయనం కేశినేని నానితోనేనని ఆయన స్పష్టంచేశారు.

టీడీపీకి మూకుమ్మడి రాజీనామాలు

ఎంపీ కేశినేని నాని టీడీపీకి రాజీనామా చేసిన తర్వాత ఒక్కొక్కరు ఆ పార్టీని వీడుతున్నారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగమనేని శివరామ్ ప్రసాద్ పార్టీకి రాజీనామా చేసి తన రాజీనామా లేఖను పార్టీ కార్యాలయానికి పంపారు. ఆయన తోపాటు మరికొందరు నేతలూ పార్టీకి రాజీనామా సమర్పిస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా చేసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమానుల్లా, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు అద్దేపల్లి శివ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కరీముల్లా, నగర బీసీ సెల్ కార్యదర్శి అంగడాల ఏడుకొండలు, పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ హబీబ్, డివిజన్ స్థాయి నాయకులు నీలం వెంకట నారాయణ, వెలగలేటి భార్గవ్, తస్లీమా భాను, నాగమల్లేశ్వరరావు, సయ్యద్ ఫయాజ్ హుస్సేన్, నీలం మనోజ్ బాబు ఉన్నారు.

పచ్చ 'సేన'

టీడీపీ నేతలకు జనసేన ముసుగు
పొత్తులో కేటాయించే అరకొర సీట్లకూ బాబు ఎసరు



సాక్షి, అమరావతి: పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించే అరకొర సీట్లకూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎసరు పెట్టారు! పచ్చ ముఖాలకే జనసేన ముసుగు వేసి ఆ పార్టీకి కేటాయించే సీట్లలో పోటీకి దించే ఎత్తుగడకు శ్రీకారం చుట్టారు. వారంతా పైకి మాత్రం జనసేనలో కొనసాగుతూ తాను చెప్పినట్లు నడుచుకునేలా వ్యూహం సిద్ధం చేశారు. పథకం ప్రకారం ఒక్కో నేతను జనసేనలో చేర్చే కార్యక్రమాన్ని ఇప్పటికే మొదలు పెట్టారు.

బాబు ఆదేశాలతో బూరగడ్డ..!

కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత బూరగడ్డ వేదవ్యాస్ గురువారం మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వెళ్లి పవన్‌కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. వేదవ్యాస్‌తోపాటు మరో టీడీపీ నేత కాగిత కృష్ణప్రసాద్ కూడా పెడన టిక్కెట్ ఆశిస్తుండగా, పొత్తుల్లో భాగంగా తమకు కేటాయించాలంటూ జనసేన ఇప్పటికే ప్రతిపాదించడం గమనార్హం. వేదవ్యాస్ గతంలో ప్రజారాజ్యం పార్టీలో పని చేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఆదేశాల మేరకు ఆయన పవన్‌ను కలసినట్లు జనసేనలో చర్చ సాగుతోంది. టీడీపీకే చెందిన మాగంటి బాబు, జలీల్‌ఖాన్ తదితరులు కూడా పవన్ కళ్యాణ్‌తో సమావేశం కావడం వెనుక చంద్రబాబు పాత్ర ఉన్నట్లు జనసైనికులు భావిస్తున్నారు.


ఎమ్మెల్సీ వంశీకృష్ణ చేరిక కూడా..

వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ టికెట్ నిరాకరించడంతో ఎమ్మెల్సీ వంశీకృష్ణ ఇటీవల జనసేనలో చేరారు. ఆయన తొలుత చంద్రబాబును సంప్రదించారని, టీడీపీ అధినేత ఆదేశాల మేరకే జనసేనలో చేరారనే చర్చ సాగుతోంది. జనసేనకు కేటాయించే సీట్ల సంఖ్య ఇంకా ఖరారు కాకున్నా, అతి తక్కువగా కేటాయించడంతోపాటు అందులోనూ ఇన్నాళ్లు జనసేనను నమ్ముకున్న నాయకులకు కాకుండా తన మనుషులను చంద్రబాబు ప్రవేశపెడుతున్నట్లు రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఎన్నికల అనంతరం తమ పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని జనసేన నేతలు ఆందోళన చెందుతున్నారు.

2014 పొత్తులే నిదర్శనం..

2014 ఎన్నికల సమయంలో కూడా బీజేపీతో పొత్తు పెట్టుకొని చంద్రబాబు ఇదే ఎత్తుగడ అమలు చేసినట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. బీజేపీకి తొలుత 15 అసెంబ్లీ సీట్లను కేటాయించి నామినేషన్ల సమయానికి 11కి పరిమితం చేశారు. తీరా అందులోనూ మూడు చోట్ల స్నేహపూర్వక పోటీ పేరుతో టీడీపీ అభ్యర్థులను కూడా బరిలోకి దించినట్లు గుర్తు చేస్తున్నారు. మొత్తంగా ఆ ఎన్నికల ముందు కొత్తగా బీజేపీలో చేరిన చంద్రబాబు మనుషులకే టిక్కెట్లు దక్కాయని పేర్కొంటున్నారు.

'యావజ్జీవం' తప్పదు!



'చంద్రబాబు శాశ్వతంగా జైలు పక్షిగా మారక తప్పదు. ఒకట్రెండ్రోజులు ఆలస్యం కావచ్చు తప్ప, యావజ్జీవ కారాగార శిక్ష మాత్రం పక్కా' అని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఐపీసీ 409 సెక్షన్ కింద ఒక్కో కేసులో విడివిడిగా యావజ్జీవ కారాగార శిక్ష, పీసీ యాక్ట్ 13(ఐ) కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రోజుకు రూ.కోటి ఫీజు చెల్లిస్తూ.. ప్రత్యేక విమానాల్లో చంద్రబాబు తీసుకువచ్చే న్యాయవాదులతో కేసు విచారణను కాస్త జాప్యం చేయగలరేమోగానీ నేరం నుంచి మాత్రం తప్పించలేరని స్పష్టం చేస్తున్నారు.

భారీ అవినీతి కుంభకోణాల కుట్రదారు, లబ్ధిదారులు.. చంద్రబాబు, ఆయన కుటుంబం, సన్నిహితులు, బినామీలేనని డాక్యుమెంటరీ ఆధారాలు, న్యాయ స్థానాల్లో నమోదు చేసిన కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుపై అభియోగాలతో ఏకీభవిస్తూ ఏసీబీ న్యాయస్థానం జ్యుడిషియల్ రిమాండ్ విధించడాన్ని బట్టి చూస్తుంటే.. ఈ ఒక్క కేసు చాలు చంద్రబాబుకు యావజ్జీవ శిక్ష పడటానికి అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అనారోగ్య కారణాలతో స్కిల్ స్కామ్ కేసులో బెయిల్ ఇస్తున్నప్పుడు గానీ.. తాజాగా మూడు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ సందర్భంగా గానీ చంద్రబాబు అవినీతి చేయలేదని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నారు. తద్వారా చంద్రబాబు, లోకేశ్‌తోపాటు సహచర కుట్రదారులైన టీడీపీ ప్రభుత్వంలో మంత్రులది కూడా జైలు దారేనన్నది స్పష్టమవుతోంది. స్కిల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాల ద్వారా చంద్రబాబు ముఠా ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి ఎంతగా బరితెగించిందనే విషయం చర్చనీయాంశమైంది.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్కిల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాలకు కర్త, కర్మ, క్రియ గత ముఖ్యమంత్రి చంద్రబాబే అని సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతో వెల్లడి కావడంతో ఆయనకు ఏ రకంగా చూసినా జీవిత ఖైదు తప్పదని న్యాయ నిపుణులు బల్ల గుద్ది చెబుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలోనే ఆయన సర్వం తానై కుట్ర పన్నారు. అందుకోసం కేబినెట్‌కు తెలియకుండా చీకటి జీవోలు జారీ చేశారు. స్కిల్ ప్రాజెక్ట్, ఫైబర్ నెట్, బినామీల పేరుతో అసైన్డ్ భూములు పొందిన వారికి భూ సమీకరణ ప్యాకేజ్, మద్యం కొనుగోళ్లపై ప్రివిలేజ్ పన్ను.. జీఎస్టీ ఎత్తివేత, ఉచిత ఇసుక విధానం.. ఇలా అన్ని కుంభకోణాలకు మార్గం సుగమం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం వేర్వేరు జీవోలను జారీ చేసింది. ఆ జీవోకు కూడా కేబినెట్ ఆమోదం లేకపోవడం చంద్రబాబు కుట్రను వెల్లడిస్తోంది. ఆ జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను కూడా మాయం చేయడం గమనార్హం. మాయం చేసిన నోట్ ఫైళ్లను సీఐడీ అధికారులు రిట్రీవ్ చేసి వెలుగులోకి తేవడంతో అన్ని కుంభకోణాల కుట్రలకు కీలక ఆధారాలు లభించాయి. చంద్రబాబు ముఠా గల్లంతు చేసిన అమరావతిలో అసైన్డ్ భూముల రికార్డులను సీఐడీ వెలికి తీసింది. స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్‌లలో కొల్లగొట్టిన నిధులు చంద్రబాబు నివాసానికే చేర్చిన అవినీతి నెట్‌వర్క్‌ను బ్యాంకు ఖాతాల వివరాలతోసహా ఛేదించింది. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పులు, క్విడ్ ప్రో కో కింద చంద్రబాబు కరకట్ట నివాసం పొందడం, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు దక్కడం, చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట భూ సమీకరణ ప్యాకేజీ పొందడం మొదలైనవన్నీ రికార్డులతో సహా వెలుగులోకి వచ్చాయి. ఈ విధంగా చంద్రబాబు, లోకేశ్, నారాయణల పాత్రను స్పష్టం చేస్తూ పూర్తి డాక్యుమెంటరీ ఆధారాలు లభించాయి. మరోవైపు ఈ కుంభకోణాలన్నింటికి చంద్రబాబే అని కీలక సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. అది కూడా 164 సీఆర్‌పీసీ కింద న్యాయస్థానంలో వాంగ్మూలాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేయడం చట్ట విరుద్ధమని చెప్పినప్పటికీ చంద్రబాబు పట్టించుకోలేదని అప్పటి సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, గుంటూరు జిల్లా కలెక్టర్ వాంగ్మూలాలు ఇచ్చారు. ఫైబర్‌నెట్, స్కిల్ స్కామ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు మంజూరు చేయొద్దని చెప్పినా చంద్రబాబు పట్టించుకోలేదని కీలక అధికారుల వాంగ్మూలాలు నమోదు చేశారు. షెల్ కంపెనీల ప్రతినిధులు కూడా అప్రూవర్‌గా మారి అదే విషయాన్ని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో కన్సల్టెన్సీ కంపెనీ, స్కిల్ స్కామ్‌కు సంబంధించి సీమెన్స్ కంపెనీ కూడా 164 సీఆర్‌సీపీ కింద వాంగ్మూలాలు నమోదు చేశాయి. ఈ విధంగా అన్ని కుంభకోణాల్లో చంద్రబాబు ప్రధాన కుట్రదారు, ప్రధాన లబ్ధిదారు అనే దానికి అటు డాక్యుమెంటరీ ఆధారాలు, ఇటు కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కేసుల నుంచి చంద్రబాబు తప్పించుకోవడం ఇక అసాధ్యమని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు.

చంద్రబాబును రిమాండ్‌కు పంపడమే తార్కాణం

ఒక్క మెతుకు చూస్తే చాలు అన్నం ఉడికిందో లేదో చెప్పొచ్చు. అలానే చంద్రబాబు పాల్పడ్డ ఇన్ని కుంభకోణాలలో ఒక్క స్కిల్ స్కామ్‌ను పరిశీలిస్తే చాలు.. ఆయన అవినీతి బాగోతం తెలిసిపోతోంది. సీఐడీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి చంద్రబాబును అరెస్ట్ చేసిన అనంతరం విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరిచింది. ఆ సందర్భంగా దాదాపు 10 గంటలపాటు ఇరుపక్షాల వాదనలను విన్న తర్వాత ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించాలని న్యాయమూర్తి ఆదేశించారు. సీఐడీ నమోదు చేసిన అభియోగాలు, అందులో పేర్కొన్న సెక్షన్లతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ ఈ నిర్ణయం ప్రకటించారు. దాంతోనే చంద్రబాబు 52 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అనంతరం అనారోగ్య కారణాలతోనే ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. ఇక సెక్షన్ 17–ఏను వక్రీకరిస్తూ కేసుల నుంచి తప్పించుకునేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఇప్పటి వరకు ఫలించ లేదు.

ముందస్తు బెయిల్‌పై ఎల్లో మీడియా వక్రీకరణ

ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాల కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కానీ ఆ సందర్భంగా కూడా ఆయన అవినీతికి ఆధారాలు లేవని న్యాయస్థానం చెప్ప లేదు. కేసు పూర్వాపరాల్లోకి ఇంకా తాము వెళ్లడం లేదని కూడా స్పష్టం చేసింది. కేవలం షరతులతోనే ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. విచారణకు చంద్రబాబు సహకరించాలని.. విచారణకు పిలిస్తే వెళ్లాలని కూడా చెప్పింది. కానీ హైకోర్టు తీర్పుకు వక్రభాష్యం చెబుతూ చంద్రబాబుకు క్లీన్ చిట్ లభించినట్టుగా ఈనాడు, ఇతర ఎల్లో మీడియా హడావుడి చేయడం విస్మయ పరుస్తోంది. సీఐడీ సేకరించిన ఆధారాలతో నేరం రుజువు కావడం ఖాయమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నేరం నిరూపితమైన తర్వాత ఒక్కో కేసులో చంద్రబాబుకు యావజ్జీవ జైలు శిక్ష పడుతుందని కూడా తేల్చి చెబుతున్నారు. ఆయనపై సీఐడీ నమోదు చేసిన వివిధ సెక్షన్ల తీవ్రత, కేసుల విచారణ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తున్న నిపుణులు ఈ విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిందితులు వీరే

- నారా చంద్రబాబునాయుడు
- నారా లోకేశ్, పొంగూరు నారాయణ
- కింజరాపు అచ్చెన్నాయుడు
- దేవినేని ఉమామహేశ్వరరావు
- కొల్లు రవీంద్ర, పీతల సుజాత
- చింతమనేని ప్రభాకర్

ఆరు కేసుల్లోనూ శిక్ష తప్పదు

చంద్రబాబుపై ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఎ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37 లతోపాటు అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటిలో అత్యంత కీలకమైనది సెక్షన్ 409. ఆ సెక్షన్ కింద నేరం నిరూపితమైతే యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. అవినీతి నిరోధక చట్టంలోని 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద నేరం నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఇతర సెక్షన్లు సరేసరి. ఈ ఆరు కేసుల్లో తీర్పులు వేర్వేరుగా వస్తాయి. నేరం నిరూపితమై శిక్షలు పడితే చంద్రబాబు వేర్వేరుగా శిక్షలు అనుభవించాల్సి వస్తుంది. ఇప్పటికే బాబుకు 73 ఏళ్లు నిండుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓసారి నేరం నిరూపితమై ఒక్కో కేసులో ఐపీసీ 409 సెక్షన్ కింద యావజ్జీవ కారాగార శిక్ష, అవినీతి నిరోధక చట్టం 13(2) కింద గరిష్టంగా పదేళ్ల కారాగార శిక్ష పడితే తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూముల కేసుల్లో లోకేశ్ కూడా నిందితుడిగా ఉన్నారు. నారాయణతో పాటు టీడీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన వారు కూడా ఉన్నారు. వారంతా శిక్ష అనుభవించాల్సిందేనని నిపుణులు తేల్చి చెబుతున్నారు. సీఎంగా ఉంటూ అవినీతికి పాల్పడిన కేసుల్లో హరియాణా మాజీ సీఎం ఓమ్ ప్రకాశ్ చౌతాలాకు 16 ఏళ్ల తర్వాత జైలు శిక్ష పడిన ఉదంతాన్ని ఉదాహరిస్తున్నారు. తాజాగా తమిళనాడులో మంత్రిగా చేసిన సెంథిల్ బాలాజీ, మద్యం కేసుల్లో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఇప్పటికీ బెయిల్ రాకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు.

3 కేసుల్లో నేడు సీఐడీ ఎదుట
బాబు హాజరు

సాక్షి, అమరావతి: మూడు కేసుల్లో హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందిన టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం ఆ కేసుల దర్యాప్తు అధికారుల వద్దకు వచ్చి పూచీకత్తులు సమర్పించనున్నారు. బాబు హయాంలో జరిగిన ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్), ఇసుక, మద్యం అక్రమాలపై కేసులు నమోదు చేయగా.. ఈ కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పూచీకత్తులను దర్యాప్తు అధికారులకు ఆయన సమర్పించాల్సి ఉంది. ఉ. 11 గంటలకు మద్యం కేసులో గుంటూరు సీఐడీ కార్యాలయానికి, ఇసుక కేసులో విజయవాడ సీఐడీ కార్యాలయానికి మధ్యాహ్నం 3.30 గంటలకు, ఐఆర్ఆర్ కేసులో సాయంత్రం 4.20 గంటలకు తాడేపల్లిలోని సిట్ కార్యాలయానికి వెళ్లి పూచీకత్తులు సమర్పించనున్నారు.


తవ్వేకొద్దీ అవినీతే

- స్కిల్ స్కామ్‌లో రూ.241 కోట్లు చంద్రబాబు నివాసానికి చేరాయని సీఐడీ ఆధారాలతోసహా వెలుగులోకి తెచ్చింది.
- ఫైబర్ నెట్ ప్రాజెక్ట్‌ను నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు తన బినామీ అయిన వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి కట్టబెట్టేశారు. ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించి మరీ టెండరు అప్పగించారు. నాసిరకం పనులు చేసినాసరే పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా రూ.244 కోట్లు చెల్లించగా అందులో రూ.144 కోట్లు చంద్రబాబు నివాసానికే చేరాయి.
- అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట చంద్రబాబు, లోకేశ్, నారాయణ భారీ భూ బాగోతానికి పాల్పడ్డారు. తమ బినామీ అయిన లింగమనేని కుటుంబానికి చెందిన భూములను ఆనుకుని నిర్మించేలా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఖరారులో క్విడ్ ప్రో కోకు పాల్పడ్డారు. కృష్ణా నదికి ఇటూ అటూ కూడా లింగమనేని కుటుంబం, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ విద్యా సంస్థలకు చెందిన 355 ఎకరాల సమీపం నుంచి నిర్మించేలా రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. అందుకోసం కన్సల్టెన్సీ ఎంపిక కోసం టెండర్లు పిలవకుండా నామినేషన్‌పై కట్టబెట్టారు. అనంతరం అదే అలైన్‌మెంట్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చేలా ముందుగానే షరతు విధించి మరీ రాజధాని మాస్టర్ ప్లాన్ డెవలపర్‌ను నిర్ణయించారు. దాంతో అప్పటి వరకు చంద్రబాబు, లింగమనేని, నారాయణ భూముల మార్కెట్ విలువ మొత్తం రూ.177.50 కోట్లు ఉండగా.. అలైన్‌మెంట్ ఖరారుతో ఏకంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చెప్పిన దాని ప్రకారమే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించిన తర్వాత అమాంతంగా రూ.2,130 కోట్లకు పెరుగుతుందని స్పష్టమైంది. అంటే అలైన్‌మెంట్ ఖరారులో అక్రమాలకు పాల్పడి దాదాపు రూ.2 వేల కోట్ల అక్రమ లబ్ధికి పచ్చ ముఠా కుట్ర పన్నింది.
- చంద్రబాబు కనుసన్నల్లో సాగిన అమరావతిలోని అసైన్డ్ భూముల దందా దేశ చరిత్రలోనే అతి పెద్ద భూ దోపిడీగా రికార్డు సృష్టించింది. సీఎం పదవిని అడ్డుపెట్టుకుని ఏకంగా కేంద్ర అసైన్డ్ భూముల చట్టాన్ని ఉల్లంఘించి ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల అసైన్డ్ భూములు కొల్లగొట్టారు. అందుకోసం అమరావతి పరిధిలో అసలు 1954 తర్వాత అసైన్డ్ భూములే ఇవ్వలేదంటూ భూ రికార్డులు తారుమారు చేశారు. అసైన్డ్ భూములను జిరాయితీ భూములుగా రికార్డుల్లో కనికట్టు చేశారు. పరిహారం ఇవ్వకుండా అసైన్డ్ భూములను రాజధాని కోసం ప్రభుత్వం తీసుకుంటుందని రైతులను భయపెట్టారు. అందుకోసం మొదట జీవో నంబర్–1 జారీ చేశారు. ఆ జీవోను బూచిగా చూపిస్తూ తమ ఏజంట్ల ద్వారా 617.70 ఎకరాల అసైన్డ్ భూములను నిబంధనలకు విరుద్ధంగా హస్తగతం చేసుకున్నారు. అనంతరం అసైన్డ్ భూములకు కూడా భూ సమీకరణ ప్యాకేజీ ప్రకటిస్తూ జీవో నంబర్–41 జారీ చేశారు. తద్వారా భూ సమీకరణ ప్యాకేజీ కింద రూ.3,737.30 కోట్ల విలువైన స్థలాలు కొల్లగొట్టారు. ప్రభుత్వ భూములను కూడా తమ బినామీల భూములుగా చూపిస్తూ ఏకంగా 328 ఎకరాలను కొల్లగొట్టారు. భూ సమీకరణ ప్యాకేజీ కింద రూ.760.25 కోట్లు విలువైన స్థలాలు పొందారు.
- పేరుకు ఉచిత ఇసుక అని చెప్పి.. చంద్రబాబు తన బినామీలు, సన్నిహితులు మాత్రమే ఉచితంగా ఇసుక కొల్లగొట్టి బహిరంగ మార్కెట్‌లో అత్యధిక ధరలకు విక్రయించేలా చక్రం తిప్పారు. తద్వారా ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల విలువైన ఇసుక దోపిడీకి పాల్పడ్డారు.
- తమ అస్మదీయ, బినామీ కంపెనీలకు మద్యం కొనుగోళ్ల కాంట్రాక్టులు కట్టబెడుతూ చంద్రబాబు భారీ అవినీతికి పాల్పడ్డారు. 2012 నుంచి అమలులో ఉన్న మద్యం దుకాణాలు, బార్లపై ఉన్న ప్రివిలేజ్ ట్యాక్స్.. జీఎస్టీని తొలగిస్తూ చీకటి జీవోలు జారీ చేశారు. మద్యం డిస్టిలరీలు, మద్యం దుకాణాలు, బార్ల యజమానుల నుంచి భారీగా ముడుపులు తీసుకున్నారు. తద్వారా ఖజానాకు ఏటా రూ.1,300 కోట్ల మేర గండి కొట్టారు.


'స్కిల్డ్' క్రిమినల్ చంద్రబాబు

కమీషన్లు పోనూ షెల్ కంపెనీల ద్వారా బాబు నివాసానికి రూ.241 కోట్లు

- హవాలా అక్రమాలను నిర్ధారించిన ఈడీ, కాగ్
- ఏ–1 చంద్రబాబు పాత్రను ఆధారాలతో సహా రుజువు చేసిన సీఐడీ
- ఖైదీగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో 52 రోజులు బాబు



బాబు సంతకం సాక్షిగా.. స్కిల్ కుంభకోణం



షెల్ కంపెనీల్లోకి నిధుల మళ్లింపు ఇలా..

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం చంద్రబాబు అంతులేని అక్రమాలకు ఓ మచ్చు తునక మాత్రమే. యువతకు నైపుణ్య శిక్షణ పేరిట చంద్రబాబు సాగించిన బాగోతం చూసి యావత్ దేశం అవాక్కయ్యింది. జర్మనీకి చెందిన సీమెన్స్‌కి తెలియకుండా ఆ కంపెనీ పేరుతో కాగితాలపై ప్రాజెక్టు సృష్టించారు. రూ.370 కోట్ల వ్యయాన్ని ఏకంగా రూ.3,300 కోట్లకు పెంచేశారు. సీమెన్స్ పేరుతో జీవో జారీ చేసి తన బినామీ కంపెనీ డిజైన్‌టెక్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఉన్నతాధికారుల అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా రూ.271 కోట్లు విడుదల చేసి షెల్ కంపెనీల ద్వారా అక్రమార్జనను తన నివాసానికే చేరవేశారు. ఈ అవినీతి నెట్‌వర్క్ గుట్టును సీఐడీ ఛేదించడంతో చంద్రబాబు అక్రమాలు బట్టబయలయ్యాయి. స్కిల్ స్కామ్ సృష్టికర్త చంద్రబాబేనని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో ఆధారాలతో సహా వెల్లడైంది. దీంతో చంద్రబాబును ఏ–1గా పేర్కొంటూ చార్జ్‌షీట్ నమోదు చేసింది. టీడీపీ హయాంలో కార్మిక శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు ఏ–2గా, మరో 38 మందిని నిందితులుగా పేర్కొంటూ సిట్ కేసు నమోదు చేసింది. గతేడాది సెప్టెంబరు 9న చంద్రబాబును అరెస్ట్ చేసి విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరిచింది. చంద్రబాబు పాత్రను నిర్ధారిస్తూ సీఐడీ అధికారులు సమర్పించిన నివేదికతో సంతృప్తి చెందిన న్యాయమూర్తి ఆయనకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీ నంబర్ 7691గా చంద్రబాబు 52 రోజులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. పలుమార్లు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైన తరువాత అనారోగ్య కారణాలతో హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు సాగించిన స్కిల్ స్కామ్ ఇలా సాగింది..

విద్యా శాఖ స్థానంలో ఏపీఎస్ఎస్‌డీసీ

2014లో అధికారంలోకి రాగానే ప్రజాధనాన్ని కొల్లగొట్టటాన్నే చంద్రబాబు లక్ష్యంగా చేసుకున్నారు. డిజైన్ టెక్ కంపెనీకి చెందిన సంజయ్ దంగాను పిలిపించుకుని యువతకు నైపుణ్య శిక్షణ పేరిట ఉత్తుత్తి ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ ముసుగులో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. వాస్తవానికి సీమెన్స్ కంపెనీకి ఈ ప్రాజెక్టు గురించి ఏమాత్రం తెలియదు. భారత్‌లో ఆ కంపెనీ ఎండీగా ఉన్న సుమన్ బోస్, డిజైన్ టెక్ ఎంపీ వికాస్ వినాయక్ కన్విల్కర్ సహకారంతో చంద్రబాబు అక్రమాలకు తెర తీశారు. మొదట విద్యా శాఖ ద్వారా సీమెన్స్ కంపెనీ పేరుతో 2014 ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆమేరకు జీవో జారీ చేశారు. కనీసం కేబినెట్ ఆమోదం కూడా లేకుండానే ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ని ఏర్పాటు చేశారు. అనంతరం సీమెన్స్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకున్నట్టు మభ్యపుచ్చారు.

అంతా బాబు ముఠానే..

ఏపీఎస్ఎస్‌డీసీకి అప్పట్లో డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, చంద్రబాబు సన్నిహితుడు కె.లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు ఇందులో కీలకంగా వ్యవహరించారు. గంటా సుబ్బారావుకు ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ–సీఈవో పోస్టుతోపాటు ఉన్నత విద్యా శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ – ఇన్నోవేటివ్ కార్పొరేషన్ కార్యదర్శి, ముఖ్యమంత్రికి ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా ఏకంగా 4 పోస్టులు కట్టబెట్టారు. నేరుగా నిధులు మంజూరు జరిగేలా కుతంత్రం పన్నారు. అనంతరం సీమెన్స్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ జీవీఎస్‌భాస్కర్ సతీమణి, యూపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి అపర్ణను ఏపీఎస్ఎస్‌డీసీ డిప్యూటీ సీఈవోగా నియమించారు.

రూ.370 కోట్ల నుంచి రూ.3,300 కోట్లకు..

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర అంశాలకు సంబంధించిన ఇన్వాయిస్‌లు, ప్రాథమిక నివేదిక ప్రకారం ఈ ప్రాజెక్టు విలువ రూ.370 కోట్లు మాత్రమే. చంద్రబాబు దీన్ని అమాంతం రూ.3,300 కోట్లకు పెంచేసి ఆ మేరకు నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వం పది శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ 90 శాతం నిధులు పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు 2015 జూన్ 30న ఉత్తర్వులు జారీ చేశారు.

ఎయిడ్ లేదు.. కైండ్ అంత కంటే లేదు

సీమెన్స్‌కి తెలియకుండా సుమన్ బోస్ నడిపిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో (నేరుగా ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబుకు లేఖలు రాశారు) గ్రాంట్ ఇన్ ఎయిడ్ అనే పదం ఎక్కడా లేదు. ఆ స్థానంలో 'గ్రాంట్ ఇన్ కైండ్' అని పేర్కొన్నారు. పోనీ ఆ విధంగానైనా సాఫ్ట్‌వేర్, ఇతర మౌలిక సదుపాయాలు ఉచితంగా అందించారా? అంటే అదీ లేదు. ప్రాజెక్టు వ్యయంగా చెప్పుకున్న రూ.3,300 కోట్లలో 90% కాదు కదా కనీసం ఒక్క రూపాయి విలువైన ఆర్థిక సహకారంగానీ వస్తు సహాయాన్ని గానీ అందించ లేదు. అంటే గ్రాంట్ ఇన్ ఎయిడ్ లేదు! గ్రాంట్ ఇన్ కైండ్ అంత కంటే లేదు! గ్రాంట్ ఇన్ ఎయిడ్ అని ఉంటే టెండర్లు పిలవాల్సిన అవసరం లేదు. టెండర్లు లేకుండా తన బినామీ కంపెనీకి ప్రాజెక్ట్ కట్టబెట్టేందుకే ఈ ఎత్తుగడ వేశారు.

నో రూల్స్...

సీమెన్స్– డిజైన్ టెక్ ఒక్కరూపాయి కూడా ఇవ్వకుండానే ఏపీఎస్ఎస్‌డీసీ తన వాటా కింద జీఎస్టీ కలిపి డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్ల విడుదలకు ప్రతిపాదనలు పంపింది. దీనిపై అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్, ప్రత్యేక కార్యదర్శి సునీత అభ్యంతరం తెలిపారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఏర్పడిన ఏపీఎస్ఎస్‌డీసీ తరఫున నిధులు ఎలా మంజూరు చేస్తామని పీవీ రమేశ్ నోట్ ఫైల్‌లో పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు కూడా నిధులు విడుదల నిబంధనలకు విరుద్ధమని వారించినా చంద్రబాబు లెక్క చేయలేదు. గంటా సుబ్బారావు చెప్పినట్లు నిధులు విడుదల చేయాలని ఐవైఆర్ కృష్ణారావును ఆదేశించారు. దీంతో నోట్ ఫైళ్లలో సీఎం కాలమ్‌లో 'ఏఐ' (ఆఫ్టర్ ఇష్యూ..) అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోట్ చేశారు. నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారని, తరువాత ఆ ఫైల్‌ను సీఎంకు పంపించాలని పేర్కొన్నారు. అదే విషయాన్ని ఆర్థిక శాఖ కార్యదర్శి సునీతకు పీవీ రమేశ్ తెలియచేశారు. నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తనతో చెప్పారని, గంటా సుబ్బారావు తనను వచ్చి కలిశారని పేర్కొన్నారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లను మంజూరు చేశారు.

13 చోట్ల చంద్రబాబు సంతకాలు

ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణానికి సంబంధించి ఆర్థిక, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్మెంట్–ట్రైనింగ్, సాధారణ పరిపాలన శాఖకు చెందిన మొత్తం 13 నోట్ ఫైళ్లలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు సంతకాలు చేశారు. అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు ఐదు చోట్ల సంతకాలు చేశారు.

షెల్ కంపెనీల ద్వారా బాబు బంగ్లాకు

డిజైన్ టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి వివిధ దశల్లో అక్రమంగా తరలించారు. షెల్ కంపెనీల సృష్టికర్తలు, దళారుల కమీషన్లు పోనూ చంద్రబాబు బంగ్లాకు రూ.241 కోట్లు చేరవేశారు.

కేసులో కీలక నిందితులు

ఏ–1 చంద్రబాబు, నాటి ముఖ్యమంత్రి
ఏ–2 కింజరాపు అచ్చెన్నాయుడు, నాటి కార్మిక శాఖ మంత్రి
ఏ–3 గంటా సుబ్బారావు, నాటి ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ–సీఈవో
ఏ–4 కె.లక్ష్మీ నారాయణ, రిటైర్డ్ ఐఏఎస్, నాటి ఏపీఎస్ఎస్‌డీసీ సలహాదారు
ఏ–5 నిమ్మగడ్డ వెంకట కృష్ణ ప్రసాద్, మాజీ ఓఎస్డీ
ఏ–6 అపర్ణ ఉపాధ్యాయుల, ఐఏఎస్, నాటి ఏపీఎస్ఎస్‌డీసీ డిప్యూటీ సీఈవో
ఏ–7 ప్రతాప్ కుమార్, నాటి ఫైనాన్షియల్ ఆఫీసర్, ఏపీఎస్ఎస్‌డీసీ
ఏ–8 సుమన్ బోస్, సీమెన్స్ ఇండియా మాజీ ఎండీ
ఏ–9 జీవీఎస్ భాస్కర్ ప్రసాద్, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ హెడ్
ఏ–10 వికాస్ వినాయక్ ఖన్వేల్కర్, డిజైన్‌టెక్ ఎండీ

బాబు అవినీతి నెట్‌వర్క్ ఇదిగో..

టీడీపీ ప్రభుత్వం పుణెకు చెందిన డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించింది.

డిజైన్ టెక్ కంపెనీ నుంచి పుణెలోని పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి రూ.238.29 కోట్లు, ఢిల్లీలోని ఏసీఐ కంపెనీకి రూ.2.71 కోట్లు అంటే మొత్తం రూ.241 కోట్లు తరలించారు.

పీవీఎస్‌పీ కంపెనీ నుంచి మళ్లీ ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్‌లో ఉన్న వివిధ షెల్ కంపెనీలతోపాటు దుబాయ్, సింగపూర్‌లోని కంపెనీలకు నిధుల తరలింపు ఇలా సాగింది...

ఏసీఐ: రూ.56 కోట్లు	నాలెడ్జ్ పోడియమ్: రూ.45.28 కోట్లు	ఈటా: రూ.14.1 కోట్లు	పాట్రిక్స్: రూ.3.13 కోట్లు
ఐటీ స్మిత్: రూ.3.13 కోట్లు	భారతీయ గ్లోబల్: రూ.3.13 కోట్లు	ఇన్‌వెబ్: రూ.1.56 కోట్లు	పోలారీస్: రూ.2.2 కోట్లు

కాడెన్స్ పార్టనర్స్: రూ.12 కోట్లు

- మొత్తం రూ.140.53 కోట్లను ఆ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి యోగేశ్ గుప్తా డ్రా చేసి షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందించారు. మనోజ్ పార్థసాని ఆ నగదు మొత్తాన్ని చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో ముట్టజెప్పారు. అంటే ఆ రూ.140.53 కోట్లను చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- ఇక మిగిలిన రూ.100.47 కోట్లను పీవీఎస్‌పీ కంపెనీ దుబాయి, సింగపూర్‌లోని కంపెనీలకు మళ్లించింది. ఆ నిధులను మళ్లీ హవాలా మార్గంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ మనోజ్ పార్థసాని ద్వారా చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. అనంతరం చంద్రబాబు నివాసానికి చేర్చారు.
- ఏపీఎస్ఎస్‌డీసీకి చెందిన రూ.241 కోట్లు అవినీతి నెట్‌వర్క్ ద్వారా గుట్టు చప్పుడు కాకుండా ఇలా చంద్రబాబు బంగ్లాకు చేరిపోయాయి.
- అమెరికాకు శ్రీనివాస్... దుబాయ్‌కి మనోజ్ అక్రమ నిధులను తరలించిన పాత్రధారులు చంద్రబాబు ఆదేశాలతో విదేశాలకు పరారయ్యారు. విచారణకు రావాలని నోటీసులు జారీ చేయగానే చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకు, మనోజ్ పార్థసాని దుబాయ్‌కు ఉడాయించారు.

ప్రాజెక్ట్ గురించి తెలియదన్న సీమెన్స్

సీఐడీ అధికారులు జర్మనీలోని సీమెన్స్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు తమకు ఆ ప్రాజెక్టు గురించే తెలియదని స్పష్టం చేసింది. ఆ వెంటనే సీమెన్స్ కంపెనీ భారత్‌లోని తమ ఎండీ సుమన్ బోస్‌ను పదవి నుంచి తొలగించింది. ఈ కేసులో కీలక సాక్షులైన ఐవైఆర్ కృష్ణారావు, పీవీ రమేశ్, సునీత తదితరులు చంద్రబాబు ఆదేశాలతోనే నిబంధనలకు విరుద్ధంగా నిధులను విడుదల చేసినట్లు వాంగ్మూలం ఇచ్చారు. స్కిల్ స్కామ్‌లో కీలక పాత్రధారిగా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా మొత్తం అవినీతి నెట్‌వర్క్‌ను వెల్లడిస్తూ వాంగ్మూలం ఇచ్చారు.

మదింపు బూటకం.. నివేదిక నాటకం

ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టు సరైందేనంటూ 'సెంటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ) థర్డ్ పార్టీగా మదింపు జరిపి నివేదిక సమర్పించిందంటూ చంద్రబాబు అడ్డగోలుగా వాదించి అడ్డంగా దొరికిపోయారు. తాము ఇచ్చింది మూడో పార్టీ నివేదికే కాదని, కేవలం ఏపీఎస్ఎస్‌డీసీ ఇచ్చిన పత్రాల పరిశీలన మాత్రమేనని 'సీఐటీడీ' స్పష్టం చేసింది. వాస్తవానికి అంతకంటే ముందే డిజైన్ టెక్‌కు టీడీపీ సర్కారు నిధులు విడుదల చేసేసింది.

కొరడా ఝుళిపించిన ఈడీ

ఈ స్కామ్‌పై ఈడీ కూడా దర్యాప్తు చేపట్టడం గమనార్హం. షెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి అవి ఏఏ బ్యాంకు ఖాతాల నుంచి సింగపూర్‌కు వెళ్లాయి? తిరిగి దేశంలోని ఏ ఖాతాలకు వచ్చాయన్న విషయాన్ని గుర్తించింది. రూ.70 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్టు ఇప్పటికే నిర్ధారించింది.

నాడే గుట్టు రట్టు.. ఫైళ్లు మాయం

టీడీపీ హయాంలోనే 2017లోనే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం గుట్టు రట్టైంది. కేంద్ర జీఎస్టీ అధికారులు పుణెలోని పలు షెల్ కంపెనీల్లో సోదాలు చేసి భారీగా నకిలీ ఇన్‌వాయిస్‌లను గుర్తించి ఏపీ ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే దీనిపై విచారణ చేయకుండా నాడు ఏసీబీని చంద్రబాబు అడ్డుకున్నారు. ఆ వెంటనే ఏపీఎస్ఎస్‌డీసీ ఆఫీసులో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫైళ్లను మాయం చేశారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సంక్రాంతి పండగ వస్తే ఊర్లోకి పాత బంధువులొస్తారు.
పండిన పంట నుంచి హక్కుగా తమ భాగం తీసుకుపోతారు.
హరిదాసులు, గంగిరెద్దుల వారు,
కొమ్మదాసరులు, జంగం దేవరలు,
పిట్టల దొరలు, గారడీ వాళ్లు...
వీరందరికీ సంక్రాంతి వస్తే సంవత్సరానికి సరిపడా సాయం.
సాటివారికి సాయం చేయడమే సంక్రాంతి.

సంక్రాంతి

ఊరికి బంధువులు



సంక్రాంతి అనగానే ఊళ్లోకి బంధువులే కాదు డూడూ బసవన్నలు కూడా వస్తారు. సంక్రాంతి అంటే తిని, తేన్చి, సంబరాలు చేసుకునే పండగ మాత్రమే కాదు... రైతు సౌభాగ్యానికీ పల్లె సౌభాగ్యానికీ సహకారం అందించిన అన్ని వర్గాల వారికీ పంపకాలు చేసే పండగ కూడా. సంక్రాంతి పండగ సమయంలో ఇంటికి పుట్ల కొద్దీ చేరిన ధాన్యం నుంచి రైతు తనకు సేవ చేసిన, సాయం చేసిన వర్గాల వారికి భాగం ఇస్తాడు. 'మేర' పంచుతాడు. పాలేర్లకి, సేద్యగాళ్లకి. పనివాళ్లకి వడ్లు పోస్తాడు. కొందరికి కొత్తబట్టలు పెడతాడు. అయితే వీరు కాకుండా ఊరి మీద హక్కుగా తమ వాటా కోసం వచ్చే సంప్రదాయ వృత్తికళాకారులు వచ్చి ఊరిలో ఆడి, పాడి వినోదం పంచి తమ వడ్ల మూట గట్టుకుని పోతారు.

శ్రీమద్రమా రమణ...

'సద్గురుని కృపచే తారతమ్యము తరచి గనుమన్నా .... ధరణి లోపల మూఢమతులకు దొరుకుటకు బహు దుర్లభమ్మిది'.... అని పాడుతూ గురు కటాక్షం వలనే భక్తిని, ముక్తిని చేరుకోవాలని బోధిస్తూ వీధివీధిన తిరుగుతూ సంక్రాంతి శోభను తెస్తాడు హరిదాసు. పండగ రోజుల్లో దానికి ముందు ధనుర్మాసంలో హరిదాసు తిరగని ఊరు, వీధి ఎంతో బోసిపోతాయి. నెత్తిన అక్షయపాత్ర, భుజాన తంబూర, చేతిలో చిడతలతో 'శ్రీమద్రమా రమణ గోవిందా' అంటూ భిక్ష స్వీకరించా 'కృష్ణార్పణం' అంటూ మనం సంపాదించిన దానిలో కొంత పేదలకు అర్పణం చేయడం ద్వారా దేవునికి సమర్పణం చేసిన పుణ్యం పొందాలని సూచిస్తాడు హరిదాసు. ఒకప్పుడు పల్లెల్లో ప్రతి వీధి వాకిట్లో హరిదాసు కోసం గృహిణులు కాచుకుని ఉండేవారు. ఇప్పుడు పై అంతస్తుల్లో, అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో నుంచి చూస్తూ కిందకు దిగడానికి బద్ధకిస్తున్నారు. హరిదాసు అక్షయపాత్రలో జారవిడిచే కాసిన్ని బియ్యం మన ఇంటి సంపదను అక్షయపాత్రగా మారుస్తాయి.

డూడూ బసవన్నలు

'గంగిరెద్దులా తల ఊపకు' అని అంటారు గాని దైవచిత్తానికి తల ఊపుతూ భారం అంతా నీదే అనుకోవడానికి మించిన వేరే సుఖం ఏముంటుంది? డూడూలు కొట్టే బసవన్నను యజమాని ముద్దుగా చూసుకున్నట్టే జీవుణ్ణి దేవుడు ముద్దుగా చూసుకుంటారు. గంగిరెద్దులు ఇంటి ముందుకొచ్చి సన్నాయి పాట వినిపిస్తే ఆ కళే వేరు.



రంగు రంగుల పాతబట్టలు ఇస్తే అవి బసవడి మూపురం మీదకు చేరుతాయి. కాసులిస్తే గంగిరెద్దులవాడి నల్లకోటు జేబులో చేరుతాయి. కాసిన్ని డబ్బులు ఎక్కువిస్తే గంగిరెద్దులు విన్యాసం చేస్తాయి. యజమాని ఛాతీ మీద సుతారంగా గిట్టలు ఆడిస్తాయి.

బుడబుడలు... కొమ్మదాసరులు

'అంబ పలుకు జగదంబ పలుకు' అంటూ డమరుకం వాయిస్తూ బుడబుక్కల వాళ్ళు వస్తారు సంక్రాంతికి. తలపాగా, కోటు, గొడుగు చేతబూని శుభాల భవిష్యత్తును చెబుతూ భిక్ష స్వీకరిస్తారు. వారు వేగంగా వాయించే డమరుకం గొప్ప శబ్ద విన్యాసం సృష్టిస్తుంది. వీరికి డబ్బు. వడ్లు, పాతబట్టలు ఇవ్వాల్సిందే. ఇక ఊరికి ఒకప్పుడు కొమ్మదాసరులు వచ్చేవారు. వీరు ఊరి మధ్యలోని చెట్టు కొమ్మెక్కి కూచుని కింద గుడ్డ పరిచి వచ్చేపోయేవారి మీద వ్యాఖ్యానం వినిపిస్తుండేవారు. తగిన సొమ్ము ముట్టజెప్తేనే దిగేవారు. కొయ్య తుపాకీతో పిట్టల దొరలు వస్తారు పెద్ద పెద్ద వాళ్లతో కలిసి తిరగాలనుకునే సామాన్యుడి కలలకు మాటల మలాం పూస్తారు. 'మేము స్నానం చేసిన సబ్బు నీళ్లతో పేద దేశాల వాళ్లు డ్యాములు కట్టుకున్నారు' అంటారు. 'మా ఇంట్లో కేజీ బంగారం కుక్క నాకిందని చెత్తకుప్పలో పడేశాం' అంటారు. 'మోదీ గారు పిలిచి పాకిస్తాన్ మీద యుద్ధానికి పొమ్మని ఆర్రూపాయలు అడ్మాన్సు ఇచ్చారు' అంటారు. దుబాయ్ షేకుతో టిఫిని తిని అమెరికా ప్రెసిడెంట్‌తో లంచ్‌కు కూచోపోబోతున్నాం అంటారు. తర్వాత శంఖం ఊదుతూ జంగం దేవరలు వస్తారు. గారడీ వాళ్లు, కనికట్టు ప్రదర్శించేవాళ్లు... వరుస కడతారు. రైతు ఎవరినీ కాదనడు. అందరినీ ఆదరిస్తాడు.

ఇక సాయంత్రమైతే ఊళ్లో పాట కచేరీలు, డాన్సు ప్రోగ్రాములు ఉంటాయి. రకరకాల కళాకారులు దిగుతారు. సినిమా నాటకాలు ఒకప్పుడు వేసేవారు. సినిమాలు కూడా వేసేవారు. సంక్రాంతి సందేశం... సామూహిక ఉత్సవం. జీవితం సాటి మనుషులతో కలిసి మెలిసి సాగాలని చెప్తుంది. ఉన్నది పంచుకుని తినాలని చెప్తుంది. శ్రమ చేసి సమృద్ధితో జీవించమని చెబుతుంది. నలుగురూ కలిసి ప్రకృతి వనరులను ఫలవంతం చేసుకుని నలుగురూ వృద్ధి కావాలని కోరడమే సంక్రాంతి.

గృహశోభ

అలంకరణ మెండుగా.. మది నిండుగా..

ప్రకృతి పండగ. సంబరంగా జరుపుకోవాలంటే ఆ కళ కూడా మన ఇంటికి కొత్త కళాకాంతులు తీసుకురావాలి. అప్పుడే పండగ మరింత అందంగా, శోభాయమానంగా మారిపోతుంది. సంక్రాంతి రోజున ఇంటిని అందంగా తీర్చిదిద్దడానికి కొన్ని సంక్రాంతి అలంకరణలు ఇవి.



సంక్రాంతి, పొంగల్ ఈ రెండింటినీ హిందువులు చాలా ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ రోజున, ఇళ్లను అందంగా అలంకరించడానికి పోటీపడుతుంటారు. సంప్రదాయ పద్ధతులే కాకుండా, పొంగల్ లేదా మకర సంక్రాంతికి ఇంటిని అలంకరించుకోవడానికి అనేక ఇతర మార్గాలు ఉన్నాయి. వాటిలో ఇంటీరియర్ నిపుణులు అందిస్తున్న కొన్ని సూచనలు...

రంగుల రంగోలి

ఏ భారతీయ పండుగకైనా ఇంటి ముందు అందమైన రంగోలీ ముచ్చటగొలుపుతుంది. ముగ్గుల పండగగా పేరొందిన సంక్రాంతికి ఇంటి గుమ్మం వద్ద, పూజ గది, పొంగల్ కోసం బయట రంగోలి డిజైన్లను రూపొందించడానికి మీ సృజనాత్మకతను చూపచ్చు. అందరూ వేసేదిగా కాదు అనుకుంటే వినూత్నమైన డిజైన్లను ప్రయత్నించవచ్చు. దీంతో పొరుగువారిని మించిపోవచ్చు.



ఆకులతో అందంగా..

పొంగల్, సంక్రాంతి అనేది శ్రేయస్సు వేడుక, ఈ థీమ్‌లో ఆకుపచ్చ రంగుదే అగ్రతాంబూళం. అందుకని, పొంగల్ రోజున మామిడి ఆకుల తోరణాలను ఇంటి ప్రవేశద్వారం వద్ద వేలాడదీయడం శుభప్రదమైనది. రంగు రంగు కాగితాలను ఉపయోగిస్తూ చేతితో పర్యావరణ అనుకూలమైన అలంకరణ చేయచ్చు.



అపార్ట్‌మెంట్‌ల కోసం ఇన్‌డోర్..

అందరూ అలంకరించుకోవడానికి విశాలమైన పచ్చికతో కూడిన పెద్ద బంగ్లాలలో నివసించరు. అనేక మంది పట్టణవాసులు పట్టణాలు, నగరాల్లోని అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్నారు. కానీ ఇన్‌డోర్ డెకరేషన్ అవుట్‌డోర్‌లో చేసినట్లే ఆహ్వానించదగినదిగా ఉంటుంది. మీ గదిని ఆకులతో పాడవాటి చెరకుతో అలంకరించండి. బియ్యం పాలు, బెల్లం ఉడకబెట్టడాన్ని సూచించే మట్టి కుండలతో అలంకరించండి. సంక్రాంతి లేదా పొంగల్ జరుపుకోవడానికి మీకు పెద్ద బాల్కనీ లేదా తోట అవసరం లేదని గ్రహించాలి.



థీమ్ డెకరేషన్‌లో గాలిపటం

గాలిపటాల హంగామా ఈ పండగ ప్రత్యేకం. కాబట్టి, పేపర్ క్రాఫ్ట్‌తో రంగురంగుల గాలిపటాల తయారీ ఇంటికి ప్రత్యేకమైన అందాన్ని తీసుకువస్తుంది. వీటిని తయారు చేయమని పిల్లలను ప్రోత్సహించవచ్చు. వాల్ హ్యాంగింగ్‌లను అందమైన అలంకరణలుగా ప్రయత్నించవచ్చు. కాగితంతో తయారు చేసిన సీతాకోకచిలుకలు, పువ్వులు, జంతువుల బొమ్మలు ఇంటీరియర్‌కు అదనపు ఆకర్షణను తీసుకువస్తాయి. మార్కెట్‌లో కూడా గాలిపటాలు అన్ని ఆకారాలు, పరిమాణాలలో లభిస్తాయి. బాల్కనీ అయితే గాలిపటాలను వేలాడదీయవచ్చు. లివింగ్ రూమ్‌లోని ఓ వాల్‌ని ఎంచుకుని రంగు రంగుల గాలిపటాలతో ఆకర్షణీయమైన అలంకరణ కోసం అతికించవచ్చు. వీటికి పువ్వులు, చెరకు డిజైన్‌లను కూడా జోడించవచ్చు.

వాల్ పేపర్స్

పొంగల్ అలంకరణ చిటికేసినంత సులువుగా నట్టింటికి రావాలంటే ఇప్పుడు అందమైన ఫెస్టివల్ వాల్ పేపర్లు, వాల్ డెకార్ బ్యాక్‌డ్రాప్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. నచ్చిన వాల్‌పేపర్‌ని ఎంచుకొని, డెకార్ చేయడమే తరువాయి.

పండగ పిండివంటలు


ఒక టేబుల్‌పైన కాగితం లేదా చెక్కతో తయారుచేసిన ఎడ్ల బండ్ల బొమ్మలు, అరిశెలు, సకినాలు, నువ్వుల లడ్డూలు.. వంటివి పలహారాల పేట్లు, కొయ్య బొమ్మలను ఉంచితే చాలు పండగ కళ వచ్చేసినట్టే.

ముగ్గు - ముచ్చట


భాగ్యలక్ష్మి రాజేశ్వర్
నిర్మల్


22 చుక్కలు
2 వచ్చేవరకు, సరి చుక్క

బి.సత్యవతిరెడ్డి
మౌలాలి,
హైదరాబాద్




డి. భానుమతి
పాకాల,
తిరుపతి జిల్లా



13 చుక్కలు
7 వచ్చేవరకు
సందు చుక్క




ముమ్మడి దివ్య జ్యోతి
దమ్మాయిగూడ
హైదరాబాద్




కాంట చరిత
అరకు వ్యాలీ
విశాఖపట్నం జిల్లా

25 చుక్కలు
13 వచ్చేవరకు


12 చుక్కలు, 2 వరుసలు
2 వచ్చే వరకు, సరి చుక్క


సీహెచ్ ఇందుసాయి
సూళ్ళూరుపేట,
నెల్లూరు జిల్లా


సుమేధ దామోదర
మౌంటేన్ హౌస్,
కాలిఫోర్నియా రాష్ట్రం, అమెరికా

9 చుక్కలు
9 వరుసలు





గోకవరపు
సుహాసిని
సర్కిల్‌పేట,
మచిలీపట్నం

21 చుక్కలు 1 వచ్చే వరకు
(చుక్కలు చూసి పెట్టుకోవాలి)

దేనిని మనస్సు చేత తెలుసుకోలేమో, కానీ ఏది మనస్సునే తెలుసుకోగలదో అదే బ్రహ్మ.
దేనిని కళ్లతో చూడలేమో, కానీ ఏదైతే కళ్లకే చూపును ప్రసాదిస్తుందో అదే బ్రహ్మ.
– కేనోపనిషత్తు

సాక్షి
శనివారం, 13 జనవరి 2024

దక్షిణాఫ్రికా సాహసం!

నిలదీయటానికీ, నేరాన్ని వేలెత్తి చూపటానికీ సంపన్న రాజ్యమే కానవసరం లేదని, గుప్పెడు ధైర్యం, నిటారైన వెన్నెముక వుంటే చాలని దక్షిణాఫ్రికా నిరూపించింది. గాజా అనే ఒక చిన్న ప్రాంతాన్ని గుప్పిట బంధించి గత మూడు నెలలుగా సామూహిక జనహననం సాగిస్తున్న ఇజ్రాయెల్‌ను అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే)కు ఈడ్చి సవాలు విసిరింది. అమెరికాతో సహా అగ్రరాజ్యాల అండదండలున్న ఇజ్రాయెల్ ఈ పరిణామానికి జడిసి తన దారుణ మారణకాండను వెంటనే ఆపుతుందనుకోవటానికి లేదు. వెస్ట్ బ్యాంక్‌లో అక్రమ భద్రతా నిర్మాణాలను తొలగించాలని ఐసీజే 2004లో ఇచ్చిన తీర్పునే అది బేఖాతరు చేస్తోంది. కానీ వినతులతో, వేడుకోళ్లతో సరిపెడుతూ అంతకుమించి మరేమీ చేయని, మాట్లాడని ప్రపంచ దేశాలకు దక్షిణాఫ్రికా తీసుకున్న వైఖరి చెంపపెట్టు. ఆ పిటిషన్‌కు విచారణార్హత ఉందో లేదో నిర్ణయించటానికి దక్షిణాఫ్రికా వాదనలు విన్న న్యాయస్థానం శుక్రవారం ఇజ్రాయెల్ సంజాయిషీని తెలుసుకుంది. అయితే విచారణ పూర్తయి తీర్పు రావటానికి ఏళ్లకేళ్లు పడుతుంది. ఈలోగా జాతిహననం, విధ్వంసం నిలిపివేయాలంటూ అత్యవసర ఉత్తర్వులివ్వాలని దక్షిణాఫ్రికా కోరుతోంది. గత మూడు నెలలుగా గాజాపై సాగిస్తున్న ఏకపక్ష దాడుల్లో 23,000 మంది పౌరులు మరణించగా లక్షలాదిమంది గాయపడ్డారు. మృతుల్లో పదివేల మంది వరకూ మహిళలు, పసివాళ్లున్నారని గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. ప్రాణాలతో మిగిలిన 20 లక్షలమంది పౌరులు నిరాశ్రయులై ఆకలితో అలమటిస్తున్నారు. వ్యాధుల బారిన పడుతున్నారు. 70 శాతం ఇళ్లు, 50 శాతం భవంతులు బాంబు దాడుల్లో పూర్తిగా నాశనమయ్యాయి. ఇప్పటికే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఇజ్రాయెల్, హమాస్‌లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. జరిగిన జనహననం వెనకున్న ఉన్నత స్థాయి వ్యక్తులెవరో, వారి యుద్ధ నేరాలేమిటో అది ఆరా తీస్తుంది. దేశాల మధ్య తలెత్తే వివాదాలను శాంతియుత పరిష్కారం అన్వేషించటం ఐసీజే పని. ఇజ్రాయెల్ చేష్టలను అంతర్జాతీయ సమాజం చూస్తూ ఊరుకోబోదని చెప్పటమే దక్షిణాఫ్రికా చర్య వెనకున్న ఉద్దేశం.

ఇజ్రాయెల్ చరిత్ర గమనించినవారికి ఆ దేశంపై జినోసైడ్ (జాతిని తుడిచిపెట్టడం) నిందారోపణ రావటం ఆశ్చర్యం కలిగించేదే. ఎందుకంటే అనేక దేశాల్లో నిరాదరణకూ, ఊచకోతకూ గురై చెట్టుకొకరూ, పుట్టకొకరూ అయిన యూదులకు రెండో ప్రపంచ యుద్ధానంతరం అగ్రరాజ్యాల చొరవతో ఇజ్రాయెల్ పేరిట ప్రత్యేక దేశం ఏర్పడింది. ఇప్పుడు అదే దేశంపై జనహనన ఆరోపణలు రావటం ఒక వైచిత్రి. జనవిధ్వంసానికి వ్యతిరేకంగా 1948లో కుదిరిన అంతర్జాతీయ ఒడంబడికపై ఇజ్రాయెల్ కూడా సంతకం చేసింది. కానీ దాన్ని గౌరవించిన సందర్భం లేదు. నిజానికి తానే బాధిత దేశాన్నని ఇజ్రాయెల్ అంటున్నది. అక్టోబర్ 7న తన భూభాగంలోకి చొరబడిన హమాస్ ఉగ్రవాదులు 1,200 మందిని కాల్చిచంపి, 240 మందిని బందీలుగా పట్టుకున్నారని, అందుకే తాము దాడులు చేయాల్సివస్తోందని ఇజ్రాయెల్ వాదన. నిజమే... అమాయక పౌరులను భయపెట్టడం, హతమార్చటం నాగరిక ప్రపంచంలో ఏ ఒక్కరూ సమర్థించరు. తమకు అన్యాయం జరిగిందనుకుంటే శాంతియుతంగా పోరాడి సాధించుకోవాలి తప్ప హింసతో, బలప్రయోగంతో ఎదుర్కొనటం పూర్తిగా తప్పు. అలాంటి చర్యల వల్ల లక్ష్యం సిద్ధించదు సరిగదా... రాజ్యహింసకు లక్షలాదిమంది అమాయకులు బలవుతారు. అయితే హమాస్ చేతుల్లో మరణించిన పౌరులకు ప్రతిగా అవతలిపక్షం నుంచి ఎంతమందిని బలితీసుకుంటే తన దాహం చల్లారుతుందో ఇజ్రాయెల్ చెప్పగలదా? దాడులకు కారకులైనవారిని పట్టుకోవటం, చట్టప్రకారం శిక్షించటం అనే ప్రక్రియను కాలదన్ని విచక్షణారహితంగా యుద్ధవిమానాలతో బాంబుల మోతమోగించటం... హమాస్‌తో సంబంధం లేని సాధారణ పౌరుల ప్రాణాలకూ, ఆస్తులకూ ముప్పు కలిగించటం ఎంతవరకూ న్యాయం? నిజానికి పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం వెదికేందుకు జరిగిన ప్రతి యత్నాన్నీ అడ్డుకున్నది ఇజ్రాయెలే. ఒక దేశమంటూ లేకుండా, అత్యంత దుర్భరమైన బతుకులీడుస్తున్న పౌరులను దశాబ్దాలుగా అణచివేయటంవల్ల సమస్య ఉగ్రరూపం దాలుస్తుందని ఆ దేశం గ్రహించలేకపోవటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఇజ్రాయెల్‌కు అండదండలందిస్తున్న అమెరికాకు దక్షిణాఫ్రికా చర్య మింగుడుపడటం లేదు. ఇజ్రాయెల్‌కు నచ్చజెప్పి దాడులు ఆపించివుంటే అంతర్జాతీయంగా అమెరికా ప్రతిష్ఠ పెరిగేది. ఆ విషయంలో పూర్తిగా విఫలమై దక్షిణాఫ్రికాను నిందించటం అర్థరహితం.

జాత్యహంకార పాలకులపై పోరాడి విముక్తి సాధించిన దక్షిణాఫ్రికాకు ఆదినుంచీ ప్రపంచ వ్యాప్తంగా బలహీనులపై బలవంతులు సాగించే దుండగాలను వ్యతిరేకించటం సంప్రదాయం. దానికి అనుగుణంగానే ఇజ్రాయెల్‌పై పిటిషన్ దాఖలు చేసింది. రెండేళ్లుగా ఉక్రెయిన్‌పై దురాక్రమణ యుద్ధం సాగిస్తున్న రష్యా తనకు మిత్రదేశమే అయినా దాని చర్యను దక్షిణాఫ్రికా తూర్పారబట్టింది. ప్రస్తుతం ఐసీజేలో వున్న 15 మంది న్యాయమూర్తుల ఫుల్‌బెంచ్ దక్షిణాఫ్రికా పిటిషన్‌ను విచారిస్తుంది. నిబంధనల ప్రకారం దక్షిణాఫ్రికా, ఇజ్రాయెల్ కొత్తగా చెరొక న్యాయమూర్తినీ నామినేట్ చేయొచ్చు. గాజాలో జరిగింది జాతి విధ్వంసమేనని నిరూపించటం ఐసీజే నిబంధనల ప్రకారం కొంత కష్టమేనని నిపుణులంటున్నారు. అయితే పిటిషన్ విచారణ క్రమంలో జాతి విధ్వంస పోకడలపై జరిగే చర్చవల్ల ప్రపంచ ప్రజానీకానికి వర్తమాన స్థితిగతులపై అవగాహన ఏర్పడుతుంది. దోషులెవరో, శిక్ష ఎవరికి పడాలో తేటతెల్లమవుతుంది.

భారత దౌత్యనీతికి సవాళ్లు

విశ్లేషణ



కమడోర్ సి. ఉదయ భాస్కర్

ఇరుదేశాల మిలిటరీ సంబంధాలు పునరుద్ధరించాలని చెప్పడం ద్వారా అమెరికా, చైనా తమ మధ్య అంతరం తగ్గిందన్న సంకేతాన్ని పంపాయి. అమెరికా దగ్గరవుతున్న నేపథ్యంలో రష్యా మనకు దూరమవుతున్నట్లు గతేడాది కొన్ని అపోహలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, రష్యాతో మన సంబంధాలు గాఢమైనవి. పైగా... తాజాగా భారత్, రష్యా సంబంధాల్లో సరికొత్త అధ్యాయం మొదలైన భావన కలిగింది. రష్యా, చైనా, అమెరికా మధ్య సంబంధాలు బహుముఖమైనవి మాత్రమే కాదు, సంక్లిష్టమైనవి కూడా. ఈ మూడింటి మధ్య సంబంధాల్లో వచ్చే మార్పుల ప్రభావం భారత్‌పై కచ్చితంగా ఉంటుంది. ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం విషయంలో భారత్ అటు రష్యాపైనా, ఇటు అమెరికాపైనా ఆధారపడి ఉంది. కానీ, అగ్రదేశాల సరసన నిలవాలన్న భారత ఆకాంక్ష నెరవేరాలంటే దేశ సైనిక సామర్థ్యం ఇతరులపై ఆధారపడేలా ఉండరాదు.

భారతదేశం గొప్ప ఆత్మవిశ్వాసంతో 2024లోకి అడుగుపెట్టింది. కొత్త ఏడాది తొలి వారంలోనే ఆదిత్య–ఎల్1 విజయవంతంగా సూర్యుడి హాలో కక్ష్యలో ప్రవేశించడం, ఉత్తర అరేబియా సముద్రంలో పైరేట్లను తరిమికొట్టేందుకు భారత నేవీ నాటకీయమైన తీరులో ఆపరేషన్లు చేపట్టడం, అన్నీ శుభసూచనలే. 2023–24లో జీడీపీ వృద్ధి రేటు ఆరోగ్యకరమైన రీతిలో దాదాపు 7.3 శాతం వరకూ ఉండవచ్చునని జాతీయ గణాంక శాఖ ప్రకటించిన విషయమూ సంతోషకరమైన సమాచారమే. అన్నింటికీ మించి భారత్ విజయాలను గుర్తిస్తూ, చైనా వార్తా పత్రిక 'గ్లోబల్ టైమ్స్' ఒక కథనమూ ప్రచురించింది. భారత్ చాలా వేగంగా సామాజిక, ఆర్థిక వృద్ధి సాధిస్తోందని ఇందులో అభిప్రాయపడింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో వ్యూహాత్మక శక్తిగా భారత్ ఎదుగుతోందని కొనియాడింది.

రెండూ ముఖ్యమే!

అయితే, ఈ విజయాలను ఆస్వాదించే క్రమంలో మనం గత ఏడాది ఆఖరులో జరిగిన కొన్ని అవాంఛనీయ ఘటనల గురించి మరచిపోరాదు. అంతర్జాతీయ స్థాయిలోనే కాకుండా... ప్రాంతీయంగానూ ఇతర దేశాలతో మన సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేయగల ముఖ్యమైన సంఘటనలు అవి. వ్యూహాత్మక లక్ష్యాలను కాపాడుకోవడంలో, సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సత్తాను ప్రశ్నించే అవకాశమూ వీటికి ఉంది.

భారత విదేశీ వ్యవహారాల విధానాన్ని స్థూలంగా పరిశీలిస్తే... అమెరికాకు దగ్గరవడం... అదే సమయంలో రష్యాకు నెమ్మదిగా దూరంగా జరగడం అని అనిపిస్తుంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో భారత్ మౌనం వహించడం ఈ భావనకు మరింత బలం చేకూరుస్తోంది. అయితే సూక్ష్మస్థాయిలో అర్థం చేసుకోవాల్సిందేమిటి అంటే... భారత్ అటు రష్యాపైనా, ఇటు అమెరికాపైనా ఆధారపడి ఉందీ అని. ఇరు దేశాలూ మన మిలిటరీకి అవసరమైన ఆయుధాలు, టెక్నాలజీలు అందిస్తున్నాయి. ఈ పరిమితుల దృష్ట్యానే భారత్ తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని వ్యక్తం చేయలేకపోతోంది. మరీ ముఖ్యంగా పొరుగుదేశం చైనాను దృష్టిలో ఉంచుకున్నప్పుడు.

అయితే 2023 చివరి నాటికి అంతర్జాతీయ వ్యవహారాల్లో పరిస్థితులు కొంచెం వేగంగా మారిపోయాయి. వాటి ప్రభావం ఈ ఏడాది మనపై కచ్చితంగా పడనుంది. నవంబరులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య శాన్‌ఫ్రాన్సిస్కోలో 'ఏపీఈసీ' సమావేశాల్లో కీలకమైన చర్చలు జరిగాయి. ప్రపంచంలోని రెండు అగ్రరాజ్యాల మధ్య ఏర్పడ్డ ప్రతిష్టంభన కొద్దిగా తొలగిన సూచనలు కనిపించాయి. ఇక డిసెంబరు చివరివారంలో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రష్యా వెళ్లి, ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సెర్గీ లావరోవ్‌తో సమావేశమయ్యారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలం మాదిరిగానే రష్యాతో భారత్ తన సంబంధాలను దృఢతరం చేసుకునేందుకు నిబద్ధమై ఉందని జైశంకర్ రష్యా మంత్రి సెర్గీకి నొక్కి చెప్పినట్లు వార్తలొచ్చాయి.



రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావరోవ్‌తో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్

సంక్లిష్టం... బహుముఖం...

రష్యా, చైనా, అమెరికా మధ్య సంబంధాలు బహుముఖమైనవి మాత్రమే కాదు... చాలా సంక్లిష్టమైనవి కూడా. ఈ మూడింటి మధ్య సంబంధాల్లో వచ్చే మార్పుల ప్రభావం భారత్‌పై కచ్చితంగా ఉంటుంది. ప్రపంచ స్థాయిలో మన ప్రస్థానాన్ని, దిశను మార్చేయగల శక్తి వీటి సొంతం. ఈ సంబంధాల్లోనూ అమెరికా– చైనా మధ్య ఉన్నవి మరింత కీలకం. బైడెన్, జిన్ పింగ్ ఇటీవలి శిఖరాగ్ర సమావేశం సందర్భంగా కొన్ని అంశాలపై స్థూలంగా ఏకాభిప్రాయానికి రాగలిగారు. ఇరు దేశాల మధ్య ఉన్న విభేదాలు ఇందుకు అడ్డు కాకపోవడం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం. ఇరుదేశాల మిలిటరీల మధ్య సంబంధాలు పునరుద్ధరించాలని చెప్పడం ద్వారా అమెరికా, చైనా రెండూ తమ మధ్య అంతరం తగ్గిందన్న సంకేతాన్ని పంపాయి. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–గాజా యుద్ధాలకు సమీప భవిష్యత్తులో ఒక అర్థవంతమైన పరిష్కారం లభించగలదన్న ఆశ సమీప భవిష్యత్తులో కనబడని నేపథ్యంలో, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో దేశాలకు ఊరటనిచ్చే అంశమిది. స్థానిక పరిస్థితులు, ఉన్న పరిమితులను దృష్టిలో ఉంచుకుని ఇరువురు నేతలు తమ మధ్య అంతరాలను పక్కనబెట్టి ఈ రకమైన రాజీకి వచ్చి ఉండవచ్చు.

చైనా–అమెరికా మధ్య మిలిటరీ స్థాయిలో యుద్ధం లేదా చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకున్నా దాని విపరిణామాలు తీవ్రంగా ఉండేవి. కాబట్టి తాత్కాలికంగానైనా ఈ ఉపశమనం దక్కడం ముఖ్యమైన విషయం అవుతుంది. తైవాన్ విషయంలో ఇరు దేశాలు మెత్తపడిందేమీ లేకున్నా భారత్ దృష్టిలో మాత్రం చైనా–అమెరికా మధ్య వైరం కొంతైనా తగ్గడం ఎంతో కీలకమైంది.

సొంతంగా ఎదిగినప్పుడే...

అమెరికా ఇండో–పసిఫిక్ వ్యూహంలో భారత్ ప్రధాన భాగస్వామి అన్న అంచనా ఉంది. మరి చైనా– అమెరికా మధ్య సంబంధాలు మెరుగుపడటం భారత్‌కు ఏమైనా నష్టం చేకూరుస్తుందా? అవకాశమైతే ఉంది. పైగా ద్వైపాక్షిక స్థాయిలో ఇరు దేశాల మధ్య గత ఏడాది చివరిలో కొన్ని అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తమ పౌరుడు ఒకరిని చంపేందుకు భారత్ కుట్ర పన్నిందని అమెరికా ఆరోపించింది. ఈ కోణంలో చూస్తే భారత్ మీద అమెరికాకు కొంత అసంతృప్తి ఉన్నట్లు స్పష్టమవుతుంది.

1970లలో హెన్రీ కిసింజర్ అమెరికా విదేశాంగ మంత్రిగా ఉండగా, అప్పటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ చైనాతో సంబంధాలను మెరుగుపరచుకునే ప్రయత్నం చేశారు. ఇది కాస్తా భారత్, యునైటెడ్ సోవియట్ రిపబ్లిక్ మధ్య బంధాలు గట్టిపడేలా చేసింది. సోవియట్ వారసురాలిగా కొనసాగిన రష్యాతో ఆ సంబంధాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. భారత త్రివిధ దళాలకు రష్యా ప్రధాన ఆయుధ సరఫరాదారుగా మారింది. అమెరికా దగ్గరవుతున్న నేపథ్యంలో రష్యా మనకు దూరమవుతున్నట్లు 2023లో కొన్ని అపోహలైతే ప్రచారంలోకి వచ్చాయి. అయితే, తాజాగా కూడా భారత్, రష్యా సంబంధాల్లో సరికొత్త అధ్యాయం ఒకటి మొదలు కానున్నట్లు తెలుస్తోంది.

భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కాంక్షిస్తోంది. అలాగే అగ్రరాజ్యాల సరసన నిలవాలని కూడా ఆశిస్తోంది. అయితే మిలిటరీ విషయాల్లో విదేశాలపై ఆధారపడుతూంటే భారత్ ఆశలు, ఆకాంక్షలు నెరవేరడం కష్టం. అమెరికా, రష్యా, చైనా తమ స్వప్రయోజనాల కోసం ప్రయత్నించినా ద్వైపాక్షిక స్థాయిలో దగ్గరి సంబంధాలు కలిగి ఉండటం మనకు అవసరం. మన రాజకీయ, దౌత్య చతురతకు ఇది నిజంగానే ఒక సవాలు!

వ్యాసకర్త సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకీ అభద్రత?



'అన్నపూరణి' సినిమాతో సమస్య ఉన్నవాళ్లు తమ టీవీ ఆపేసుకోవచ్చు, అకౌంట్ డీయాక్టివేట్ చేసుకోవచ్చు, ఇతరులకు చూడొద్దని చెప్పొచ్చు. అంతేగానీ చట్టపరమైన చర్య తీసుకుంటామనడం, వేదికలను క్షమాపణ చెప్పేలా చేయడం, సినిమాను తొలగించేలా ఒత్తిడి చేయడం బెదిరింపు అవుతుంది. ఇదేనా హిందూ–రైట్ మాట్లాడే భావ స్వేచ్ఛ?

– హార్దిక్ రాజ్‌గోర్, రచయిత

మేధో దంపతులు



ఈ 'ఇంటెలి జెన్స్'లో 'ఆర్టిఫీషియల్' ఏమీ లేదు. ఎవరిమధ్య అయినా ప్రేమ ప్రేమే. నూతన దంపతులు సామ్ ఆల్ట్‌మాన్, ఆలివర్ ముల్హెరిన్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. వాళ్ల ప్రేమ ఎప్పటికీ నిలుచుగాక! ('ఓపెన్ ఏఐ' సీఈఓ సామ్ తన బాయ్‌ఫ్రెండ్‌ను వివాహమాడారు.)

– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

టాలెంట్‌ను గుర్తిద్దాం!



నేను ఎప్పుడూ ఏ ఆటా ఆడలేదు. కానీ నన్ను చూసినవాళ్లు నా శక్తిని గుర్తించి మద్దతిచ్చారు. దానివల్ల నా జీవితం మారిపోయింది. కానీ గ్రామాల్లో ఎందరికో అలాంటి అవకాశాలు రావు. 'జాతీయ యువజన దినోత్సవం' రోజున నేను అలాంటి గ్రామీణ చిన్నారికి మద్దతిస్తానని వాగ్దానం చేస్తున్నాను. మీరూ అది చేయాలని కోరుకుంటున్నాను.

– శీతల్ దేవి, పారా–ఆర్చర్

కపటం



అంతర్జాతీయ న్యాయస్థానంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా వాదనలను 'బీబీసీ' చూపించలేదు. ఇజ్రాయెల్ ప్రతివాదనను మాత్రం చూపుతోంది. పాశ్చాత్య మీడియా కపటానికి అంతులేదు.

– అద్వైద్, క్రానికలర్

తగిన పేరు



ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి, అందరినీ కలిసిన రాజకీయవేత్త (మాజీ ప్రధాని) అటల్ బిహారీ వాజ్‌పేయి. అందుకే, వంతెనకు 'అటల్ సేతు' అని పేరుపెట్టడం సరిగ్గా సరిపోతుంది.

– రమేశ్ శ్రీవత్స్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

సాహితీ చలివేంద్రం

అక్కడొక దృశ్యం. మనమడి చేతిలో బొమ్మ తుపాకీ. తాతకు గురి పెట్టి ఉంది. తాత భయపడుతున్నాడు. కాదు... భయం నటిస్తున్నాడు. 'కాల్చకు రా బాబూ' అంటూ బతిమాలుతున్నాడు. మనమడు కుదరదన్నాడు. 'ఢామ్మ'ని పేల్చేశాడు. తాత నిజంగానే గుండె పట్టుకుని ఉన్నపళంగా అమాంతం కింద పడి పోయాడు. మనమడు గెంతు లేసుకుంటూ, చప్పట్లు కొట్టుకుంటూ కిలకిలా నవ్వుతున్నాడు. కాసేపటికి తాత కళ్ళు తెరచి నెమ్మదిగా లేచాడు. అక్కడే ఉన్న కొడుకు 'ఎందుకు నాన్నగారూ... నిజంగానే పడి పోయారు. మీకేమైనా దెబ్బ తగిలితే... బాధపడాలి కదా' అన్నాడు. 'ఒరేయ్... వాడికి నిజంగా కాల్చిన అనుభూతి నేను అలా పడినప్పుడే వస్తుంది రా... అంతా వాడి ఆనందం కోసమే...' అని సమాధానం చెప్పాడు. ఆ తాత మధునాపంతుల సూరయ్య శాస్త్రి. ఈ సంఘటన ఆయన భావుక ప్రపంచం ఎంత ఆచరణాత్మకమైనదో తెలియజేస్తుంది.



మధునాపంతుల సూరయ్య శాస్త్రి

మధునాపంతుల సూరయ్య శాస్త్రి ఆంధ్రపురాణ కర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి సోదరుడు. మహాభారత రచనలో నన్నయకు నారాయణభట్టు సాయం చేసినట్టు చరిత్రను కావ్యంగా మలిచే క్రమంలో తన అన్నగారికి సూరయ్యశాస్త్రి ఎంతో తోడ్పాటునందించారు. స్వయంగా 'దేవీనవతి' కావ్యాన్ని వెలయించారు. తెలుగు పండితుడిగా ఉద్యోగం చేశారు. చుట్టుపక్కల పలు గ్రామాలకు ఏభై ఏళ్ళుగా ఆయుర్వేద వైద్యునిగా సేవలందించారు.

మధునాపంతుల సూరయ్య శాస్త్రి 1924 నవంబరు 15వ తేదీన జన్మించారు. ఈ నెల 14 తేదీన కుటుంబసభ్యులు శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డా॥ జీవీ పూర్ణచందు, డా॥ యనమదల మురళీకృష్ణలకు ప్రతిభా పురస్కారాలు, పలువురికి ఆత్మీయ సత్కారాలు అందజేస్తారు.

– దాట్ల దేవదానం రాజు । 94401 05987
(రేపు మధునాపంతుల సూరయ్య శాస్త్రి శత జయంతి వేడుక)

ఎగిరిపోతున్న పందెం కోళ్ళు

అభిప్రాయం



పి. విజయబాబు

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కోడిపందాల సీజన్ వచ్చేసింది! కోడిపందాలు ఆటలో వెన్నెల కంటికి 'మాంచి పేరు' ఉంది. మాంచి అంటే మంచివాడని కాదు. పందేలాటలో ఎత్తులు, జిత్తులు వేసి ప్రత్యర్థులను చిత్తు చేయడంలో వెన్నెల కంటిని మించినోళ్లు ఎవరూ లేరని ప్రతీతి. కానీ కొంత కాలంగా ఆయన ఆటలు సాగడం లేదు. అయితే ఈసారి ఏమైనా సరే పందెం గెలవాలని మళ్లీ ఎత్తులు, జిత్తులు మొదలు పెట్టాడు.

తన దగ్గర ఉన్న కోళ్లను 'తయారీకి' సిద్ధం చేయాలనే ఆలోచన అలా ఉంచి, ప్రత్యర్థుల కోళ్ళని ముందుగా లాగేసుకుంటే గెలుపు తేలికవుతుందని ఒక బలుపు ఆలోచన వచ్చింది. భార్య గౌరి, "మన దగ్గర ఉన్న కోళ్లు మంచి పౌరుషంతో ఉన్న కోళ్లేగా మావా?" అన్నది.

"ఒసి పిచ్చి మొహమా! పక్కోడి కోడిని లాగేసుకోవడంలో ఉండే మజా నీకేం తెలుసు?" అన్నాడు. "చాల్లే సంబడం. మా అయ్య కాడ కోళ్లన్నీ లాగేసుకున్నప్పుడే నీ కథ ఏంటో తెలిసినాది. ఇప్పుడు నాకేదో కొత్తగా కథలు సెప్తావేటి?" అన్నది.

"ఛస్! మా యప్పగారి బొట్టే ... సాల్లే ఊరుకో!" అంటూ సున్నితంగా గద్దించాడు. "ఏటి నోరు లేస్తున్నాది? సంటోడికి చెప్పనా?" అంది కళ్ళెర్రజేసి చూస్తూ.

"ఆడే సరైనోడు అయితే నాకెందుకు ఈ తిప్పలు? వెళ్లి నీ పని చూసుకో!" అంటూ అక్కడ నుంచి విసురుగా వెళ్ళిపోయాడు వెన్నెల కంటి.

వెన్నెలకంటి చూపులు ఎంతసేపు పక్క దొడ్లో కోళ్ల మీదే!

పందెం కోళ్ళలో మంచి జాతి కోళ్ళు ఉంటాయి. అవి బరిలోకి దిగితే తిరుగు ఉండదు. ముఖ్యంగా పందెం కోళ్లల్లో పేరు ఉన్న జాతులు... నెమలి, డేగ, నల్ల డేగ, కాకి నెమలి, చేతువా, పర్లా, కుక్కిరాయి, సవల, రసంగి, మైలా, ఫింగలా, పెట్టమత్రి మొదలైనవి. ఇలాంటి పౌరుషం గల జాతి కోళ్ళు పక్కింటి ఆసామి దగ్గర దండిగా ఉన్నాయి. తన దగ్గర కూడా కొన్ని మామ దగ్గర నుంచి లాక్కున్నవి ఉన్నాయి. అయితే వాటి వయసు పైబడింది. వాటికే కాదు తనకు కూడా వయసు పైబడి చూపు కూడా బాగా మందగించింది. ఆమధ్య తనకు చూపు పోయే ప్రమాదం ఉందని, చర్మం చిట్లి పోతుందని, కిడ్నీలు కూడా పాడై పోతాయని కిట్టయ్య, రావుడు, సాంబయ్య గగ్గోలు పెట్టేసారు. దాంతో కంటికి ఆపరేషన్ చేయించు కున్నాడు. కానీ చూపే కాదు మెదడు కూడా మొద్దు మారిపోయింది. అయినా ఆశ చావదు. ఏమైనా సరే ఈసారి పక్కింటి ఆసామిని దెబ్బ కొట్టి గెలవాలి. ఇదే వెన్నెల కంటి లక్ష్యం. ఆ జాతి కోళ్లను కొన్నైనా కొట్టేయగలిగలిగితే.. వెన్నెల కంటికి ఇదే ధ్యాస. పక్కింటి ఆసామి దొడ్లో కొన్ని కోళ్లు స్వేచ్ఛగా తిరగటం గమనించాడు. తన దగ్గర ఉన్న దాణ వాటికి విసిరేయడం మొదలుపెట్టాడు. మెల్లగా అవి తన దగ్గరకు చేరాయి. ఎత్తు ఫలించింది అనుకున్నాడు.



వెన్నెలకంటి చేస్తున్న పనికి అతని దగ్గర ఉన్న జాతి కోళ్ళు గుర్రుగా చూసాయి.

అదలా ఉంటే, అయ్య తెలివికి సంటోడు,పెంచుకుంటున్న బుడ్డోడు మురిసి పోయారు.

పందానికి సమయం దగ్గర పడుతోంది. ఆర్భాటంగా పందెం కోళ్ళని బండి ఎక్కించాడు వెన్నెల కంటి.


కిట్టయ్య, రావుడు, సాంబయ్య, డప్పులు వాయించడం మొదలుపెట్టారు. బండి కదిలింది. చంటోడు ఎర్రని లాలిపప్ నోట్లో పెట్టుకుని, డప్పు వాయిద్యాలకు అనుగుణంగా ఎగురుతున్నాడు. బుడ్డోడు పూనకం వచ్చినట్టు ఊగిపోతున్నాడు. సరిగ్గా బండి కదిలే సమయానికి, కోళ్ల నాణ్యత తెలిసిన శంకరయ్య" వచ్చి, "వెన్నెల కంటీ! నీకు వయసుతో పాటు చూపే కాదు, బుద్ధి కూడా మందగించింది. నువ్వు కమ్మేసిన పక్కింటి కోళ్లు పందానికి పనికిరావని వది లేసిన కోళ్లు... నీ దగ్గర ఉన్న కోళ్ళని సరిగా చూసుకోకుండా నీ దృష్టి అంతా వాటి మీద పెట్టావ్! ఇక పో నీ పని అయిపోయిందిలే!" అంటూ అక్కడి నుంచి కదిలి వెళ్ళిపోయాడు.

సరిగ్గా అదే సమయంలో తమ పక్కన ఉన్న కోళ్ల ఉనికిని భరించలేని జాతి కోళ్ళు ఒక్కొక్కటిగా బండి లోంచి పక్కింటి ఆసామి దొడ్లోకి దూకేయడం మొదలు పెట్టాయి. ఈ హఠాత్పరిణామానికి విస్తుపోయాడు వెన్నెలకంటి. "ఇదేంటి సీన్ రివర్స్ అవు తోంది?" అని కంగారు పడటం మొదలు పెట్టాడు. కానీ ఇవేవీ పట్టనట్టు భజన పరులు మాత్రం డప్పులు వాయిస్తూనే ఉన్నారు. ఇదంతా దూరం నుంచి గమ నిస్తున్న శంకరయ్య "పందెం సమయం సమీపించే సరికి ఇంకెన్ని కోళ్ళు ఎగిరిపోతాయో?" అని తనలో తను గొణుక్కున్నాడు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

భోగి పేరు ఎందుకంటే...

ఆస్తికులకు అన్ని మాసాలూ భగవత్ప్రసాదాలే అయినా, ధనుర్మాసమంటే ప్రత్యేక ప్రీతి. సౌరమాన కాల గణన ప్రకారం ధనుర్మాసం మార్గశిర మాసం. మార్గశిరం భక్తులకే కాదు, భగవంతుడికి కూడా ఇష్టమైన మాసం. దక్షిణ భారతంలో చలి గరిష్ఠ తీవ్రతతో ఉండేది ధనుర్మాసంలో. ఈ మాసమంతా, రోజూ బ్రహ్మ ముహూర్తంలో లేచి, శరీర క్లేశం సహించి, భగవదారాధన చేయడం భక్తుల నిష్ఠకూ భక్తి తత్పరతకూ గీటురాయి. ఇంటి ముంగిట కంటికి విందుగా రంగవల్లులతో సృజనాత్మకత ప్రకటించడం, గొబ్బెమ్మలను అలంకరించడం, తెలతెలవారుతుండగా దేవాలయ దర్శనం చేసి స్వామికి నమస్కరించడం, చవు లూరే వేడి ప్రసాదాలు ఆరగించడం అదనపు ఆనందాలు. భోగి పండగ ధనుర్మాసానికీ, ధనుర్మాస వ్రతాలకూ ఉద్యాపన సమయం. దక్షిణాయనానికి ముగింపు రోజు.



జ్యోతిర్మయం

ధనుర్మాసానికీ ఆండాళ్ తల్లికీ అవినాభావ సంబంధం. భూదేవి అవతారమైన గోదాదేవి ధనుర్మాస వ్రతం నిష్ఠగా జరిపినందుకు మెచ్చి, ఆమె వల్లభుడైన శ్రీరంగనాథుడు ఆమెకు స్వప్నంలో సాక్షాత్కరించి, ఆమె కోరుకొన్న అన్ని భోగాలలోనూ ఆమెను ఓలలాడించిన కారణంగా, 'భోగి' రోజుకు ఆ పేరు వచ్చిందని పెద్దల మాట. **యస్మిన్ దినే సర్వ భోగాన్ / శ్రీ గోదా బుభుజే, తతః,/ 'భోగి'–ఇతి నామ తస్య–ఆసీత్, / దివసస్య తదా అనఘ** – ఏ దినాన శ్రీ గోదాదేవి సమస్త భోగాలు అనుభవించిందో, అప్పటినుంచి, ఆ రోజుకు, ఆ కారణంవల్ల 'భోగి' అనే పేరు ఏర్పడింది. అందుకే భోగి పండగనాడు శ్రీరంగ క్షేత్రంలో శ్రీగోదా రంగనాథ కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఆ విధంగా చూస్తే, రంగనాథుడినే వలచి వలపించుకొన్న ఆముక్త మాల్యద ఆండాళ్ తల్లి అనన్య భక్తిని స్మరించుకొనే సందర్భం కావడం భోగి పండగ ముఖ్య విశిష్టత.

భోగి పండగ ముగ్గుల పండగ. 'భోగి మంట'ల పండగ. పిల్లలకు 'భోగి పళ్ళు' పోసి, దృష్టి దోషాలు తొలగించి, పిల్లల చేతే పేరంటాళ్లను సత్కరింపజేసి, ఆశీర్వాదాలిప్పించే అందమైన పండగ. చనుదెంచుతున్న సంక్రాంతి లక్ష్మికి సహర్షంగా సమర్పించే స్వాగత తోరణం భోగి పండగ. భోగి, సంక్రాంతి పండగల ఆనవాయితీలు, రేపటి పౌరులకు తమ ప్రాచీన సంస్కృతి పట్ల కుతూహలాన్నీ గౌరవాన్నీ పెంచడమే కాక, భవిష్యజ్జీవితంలో నెమరు వేసుకొనేందుకు ఎన్నెన్నో తీపి జ్ఞాపకాలను మిగులుస్తాయి. అందరికీ భోగి పండగ శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి
(రేపు భోగి పండగ)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.విదియ ప.2.30 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** శ్రవణం సా.4.24 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.8.09 నుండి 9.37 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.36 నుండి 8.06 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.34 నుండి 8.04 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.39.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	847	72,568
నిఫ్టీ ▲	247	21,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,954	▽ 16
డోజోన్స్	37,502	▽ 209
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▲ 48
డాక్స్	16,705	▲ 158
షాంఘై	2,881	▽ 5
నికాయ్	35,557	▲ 527

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	62,515	▽ 86
బంగారం (99.5 స్వచ్ఛత)	62,265	▽ 85
వెండి (కిలో)	71,530	▲ 85

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.68	83.70
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.01	107.59
€	యూరో	ఒకటి	92.38	92.56
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.74	58.04
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.69	56.81
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	ఐదుకి	21.21	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	ఐదుకి	21.59	23.22
¥	చైనా యువాన్	ఐదుకి	10.41	12.36

ఇంజినీర్లకు రిలయన్స్‌లో అవకాశాలు

గెట్ 2024 ప్రోగ్రాంకు దరఖాస్తులు షురూ

న్యూఢిల్లీ: పెట్రోకెమికల్స్ నుంచి న్యూ ఎనర్జీ వరకు వివిధ విభాగాల్లో నియామకాలు చేపట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ (గెట్)–2024 ప్రోగ్రాంను ఆవిష్కరించింది. యువ ఇంజినీర్లకు దేశవ్యాప్తంగా ఎంట్రీ స్థాయి రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను చేపట్టినట్లు సంస్థ తెలిపింది. జనవరి 11న ప్రారంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 19 వరకు కొనసాగుతుందని కంపెనీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఏఐసీటీఈ అనుమతి ఉన్న విద్యా సంస్థల్లో కెమికల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మొదలైన స్ట్రీమ్స్‌లో చదివిన 2024 బీటెక్, బీఈ గ్రాడ్యుయేట్లు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. 10వ, 12వ తరగతుల్లో, డిప్లొమాలో (వర్తిస్తే) కనీసం 60 శాతం మార్కులు లేదా 6 సీజీపీఏ ఉండాలి. షార్ట్‌లిస్ట్ అయిన విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు ఆన్‌లైన్ అసెస్‌మెంట్ ఉంటుంది. తర్వాత ఫిబ్రవరి 23 నుంచి మార్చి 1 వరకు వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఉంటాయి. మార్చి ఆఖరులో నియామకాలను ఖరారు చేస్తారు.



స్కైడ్రైవ్‌తో సైయంట్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ సైయంట్ తాజాగా జపాన్‌కి చెందిన ఈవీటీవోఎల్ విమానాల తయారీ సంస్థ స్కైడ్రైవ్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం ఉత్పత్తుల అభివృద్ధి, ఇంజినీరింగ్, తయారీ, డిజిటల్ సర్వీసులు మొదలైన అంశాల్లో రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి. పట్టణీకరణ, జనాభా, ఈ–కామర్స్ పెరుగుతున్న నేపథ్యంలో చౌకైన, సురక్షితమైన, ఆధునికమైన రవాణా మాధ్యమాల అవసరం ఏర్పడిందని సైయంట్ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి తెలిపారు. భారత్ సహా అంతర్జాతీయంగా అర్బన్ ఎయిర్ మొబిలిటీ (యూఏఎం) మార్కెట్‌లో విస్తరించేందుకు స్కైడ్రైవ్‌కు సైయంట్‌తో భాగస్వామ్యం తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. తమ ఈవీటీవోఎల్ కోసం అధునాతన సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు సైయంట్‌తో జట్టు కట్టినట్లు స్కైడ్రైవ్ సీఈవో తొమొహిరో తెలిపారు.



ఐటీ షేర్ల అండ.. కొత్త శిఖరాలు

- పీఎస్‌యూ బ్యాంకులు, ఇంధన, రియల్టీ షేర్లకూ డిమాండ్
- ఇంట్రాడే, ముగింపుల్లో సరికొత్త రికార్డుల నమోదు
- ఇన్వెస్టర్ల సంపద ఆల్‌టైం హైకి

న్యూఢిల్లీ: ఐటీ షేర్లలో నెలకొన్న కొనుగోళ్ల అండతో స్టాక్ సూచీలు శుక్రవారం ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ బలపడటమూ కలిసొచ్చింది. ఐటీతో పాటు అధిక వెయిటేజీ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇంధన షేర్లు, అలాగే సర్వీసెస్, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, మెటల్, వినిమయ షేర్లు రాణించి సూచీల రికార్డుల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 847 పాయింట్లు పెరిగి 72,568 వద్ద, నిఫ్టీ 247 పాయింట్లు బలపడి 21,895 వద్ద స్థిరపడ్డాయి. ఈ ముగింపు ఇరు సూచీలకు సరికొత్త రికార్డు స్థాయిలు కావడం విశేషం. విస్తృత స్థాయి మార్కెట్లో చిన్న, మధ్య తరహా షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ సూచీలు 0.41%, 0.36% లాభపడ్డాయి. రికార్డుల ర్యాలీలోనూ ఫార్మా, ఆటో, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణ, ఉపాధి కల్పన అంచనాలకు మించిన నమోదు కారణంగా 'ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా' ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.



ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,000 పాయింట్లు జంప్

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూలతలను విస్మరిస్తూ ఉదయం సూచీలు లాభాల్లో మొదలయ్యాయి. సెన్సెక్స్ 427 పాయింట్ల లాభంతో 72,148 వద్ద, నిఫ్టీ 127 పాయింట్లు పెరిగి 21,774 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఉత్సాహంగా మొదలైన సూచీలు రోజంతా అదే రోజు కనబరిచాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1000 పాయింట్లు ఎగసి 72,721 వద్ద, నిఫ్టీ 282 పాయింట్లు బలపడి 21,928 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలకు చేరాయి.

- సెన్సెక్స్ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ 4 సెషన్లలో రూ.6.88 లక్షల కోట్లు పెరిగి ఆల్ టైం హై రూ.373.29 లక్షల కోట్లకు చేరింది.
- ఐటీ రంగ షేర్లు 8% ర్యాలీ చేసి సూచీలను సరికొత్త శిఖరాల వైపు నడిపించాయి. దేశీయ దిగ్గజ ఐటీ కంపెనీలైన ఇన్ఫోసిస్, టీసీఎస్‌ల క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో ఈ రంగ షేర్లకు డిమాండ్ పెంచింది. కోఫోర్జ్ 6%, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్‌టెక్, ఎల్‌టీఐఎం షేర్లు 5%, విప్రో, ఎంఫసీస్‌లు 4%, పెర్సిస్టెంట్ 3.50%, ఎల్‌టీటీఎస్ 2% లాభపడ్డాయి.
- అంచనాలకు తగ్గట్టు డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో ఇన్ఫోసిస్ షేరు 8% ఎగసి రూ.1612 వద్ద ముగిసింది.
- ఇదే క్యూ3లో మెరుగైన పనితీరుతో పటిష్టమైన ఆర్థిక ఫలితాలు సాధించిన టీసీఎస్ షేరు 4% లాభపడి రూ.3,882 వద్ద స్థిరపడింది.
- బ్యాంక్ ఆఫ్ ఇండియా 6%, యూనియన్ బ్యాంక్, మహారాష్ట్ర బ్యాంక్‌లు 5%, పీఎస్‌బీ, యూకో బ్యాంక్, పీఎస్‌బీ, సెంట్రల్ బ్యాంక్‌లు 3% పెరిగాయి. ఎస్‌బీఐ, ఐఓబీ, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్ షేర్లు 2–1% మధ్య లాభపడ్డాయి.

విప్రో లాభం డౌన్...

- నికర లాభం రూ. 2,694 కోట్లు
- ఆదాయం రూ. 22,205 కోట్లు

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం దాదాపు 12 శాతం క్షీణించి రూ. 2,694 కోట్లకు పరిమితమైంది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,053 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 4 శాతం వెనకడుగుతో రూ. 22,205 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 23,229 కోట్ల టర్నోవర్ సాధించింది. ఐటీ సర్వీసుల విభాగం 4.5 శాతం తక్కువగా రూ. 22,151 కోట్ల ఆదాయం అందుకుంది.

గైడెన్స్ ఇలా

ఈ ఏడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో ఐటీ సర్వీసుల బిజినెస్ 261.5–266.9 కోట్ల డాలర్ల(రూ. 21,845–22,296 కోట్లు) మధ్య టర్నోవర్‌ను సాధించే వీలున్నట్లు విప్రో తాజాగా అంచనా వేసింది. వాటాదారులకు ప్రతీ షేరుకీ రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది.

ఇతర విశేషాలు

- ఐటీ సర్వీసుల నిర్వహణ లాభం(ఇబిట్) త్రైమాసికవారీగా 2 శాతం తగ్గి రూ. 3,540 కోట్లుగా నమోదైంది.
- బీఎఫ్ఎస్ఐ సర్వీసుల విభాగం ఆదాయం 12.1% క్షీణించగా.. కన్జూమర్ 6.9%, తయారీ 9.1% చొప్పున నీరసించాయి. కమ్యూనికేషన్స్ నుంచి మాత్రం 18.8 శాతం జంప్‌చేసింది.
- ఆర్డర్ బుక్ 0.2 శాతం బలపడి 3.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. వీటిలో భారీ డీల్స్ విలువ 0.9 బిలియన్ డాలర్లు.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు గత 6 క్వార్టర్లకల్లా కనిష్టంగా 14.2 శాతంగా నమోదైంది.
- డిసెంబర్‌కల్లా 4,473 మంది ఉద్యోగులు తగ్గారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,40,234గా నమోదైంది.



ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు దాదాపు 4 శాతం జంప్‌చేసి రూ. 465 వద్ద ముగిసింది.

నాలుగు నెలల గరిష్టానికి ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ ఎగువ బాట పట్టింది. కూరగాయాలు, పప్పులు, వంట దినుసుల ధరల మంటతో డిసెంబర్ మాసానికి 5.69%కి పెరిగింది. ఇది నాలుగు నెలల గరిష్ట స్థాయి కావడం గమనించాలి. వినియోగ ధరల సూచీ (సీపీఐ/రిటైల్) ఆధారిత ద్రవ్యోల్బణం 2023 నవంబర్ నెలలో 5.55%గా ఉంటే, 2022 డిసెంబర్ నెలకు 5.72%గా ఉంది. ఈ వివరాలను జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసింది. రిటైల్ ద్రవ్యోల్బణంలో సగం వాటా కలిగిన ఆహారోత్పత్తుల ధరలు (కూరగాయలతో కూడిన).. గతేడాది నవంబర్ నెలలో 8.7%గా ఉంటే, డిసెంబర్ నెలలో 9.53%కి పెరిగిపోయాయి. 2022 డిసెంబర్‌లో వీటి ధరలు సూచీలో 4.19% వద్దే ఉండడం గమనార్హం. 2023 ఆగస్ట్‌లో ద్రవ్యోల్బణం 6.83% గరిష్ట స్థాయిని తాకిన తర్వాత నుంచి కొంత తగ్గుతూ వచ్చింది. కూరగాయల విభాగం ద్రవ్యోల్బణం 27.64%గా ఉంది. పప్పులకు సంబంధించి 20.73%, వంట దినుసుల ద్రవ్యోల్బణం 19.69% చొప్పున నమోదైంది.

ఆహార విభాగంలోనే...

సీపీఐ ద్రవ్యోల్బణం త్రైమాసికం వారీగా పెరిగిపోవడం అన్నది ఆహారం, పానీయాల విభాగం వల్లేనని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు. మిగిలిన అన్ని విభాగాల్లో ద్రవ్యోల్బణం కొంత తగ్గడం లేదంటే అదే స్థాయిలో కొనసాగినట్టు తెలిపారు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని దీర్ఘకాలంలో 4% స్థాయిలో (2 శాతం అటూ ఇటూ దాటకుండా) పరిమితం చేయాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం.

హెచ్‌సీఎల్ టెక్.. లాభం ప్లస్

- క్యూ3లో రూ. 4,350 కోట్లు
- ఆదాయం రూ. 28,446 కోట్లు

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతంపైగా బలపడి రూ. 4,350 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 4,096 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 6.5 శాతం వృద్ధితో రూ. 28,446 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 26,700 కోట్ల టర్నోవర్ సాధించింది.

గైడెన్స్ ఇలా..: మార్చితో ముగిసే పూర్తి ఏడాది(2023–24)కి ఐటీ సర్వీసుల ఆదాయం 5–5.5 శాతం స్థాయిలో పురోగమించగలదని కంపెనీ అంచనా వేసింది. 2023 జూలైలో సొంతం చేసుకున్న జర్మన్ ఇంజినీరింగ్ సంస్థ అసాప్ ఆదాయాన్ని కలుపుకుని తాజా గైడెన్స్ ప్రకటించింది.



కాగా.. వాటాదారులకు రూ. 12 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది.


ఇతర విశేషాలు...

- మొత్తం 192.7 కోట్ల డాలర్ల ఆర్డర్లను సాధించింది. 18 భారీ డీల్స్ కుదుర్చుకుంది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 14.2 శాతం నుంచి తగ్గి 12.8 శాతానికి పరిమితమైంది.
- డిసెంబర్‌కల్లా 3,617 మంది జత కావడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,24,756కు చేరింది. 3,818 మంది ఫ్రెషర్స్‌ను తీసుకుంది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు 4 శాతం జంప్‌చేసి రూ. 1,543 వద్ద ముగిసింది.

మందగించిన పారిశ్రామికోత్పత్తి

నవంబర్‌లో 2.4 శాతం • 8 నెలల కనిష్టానికి తగ్గుదల



న్యూఢిల్లీ: తయారీ రంగ పేలవ పనితీరు కారణంగా దేశీయంగా 2023 నవంబర్‌లో పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) వృద్ధి మందగించింది. 8 నెలల కనిష్ట స్థాయి 2.4 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఇదే తక్కువ స్థాయి వృద్ధి. చివరిసారిగా 2023 మార్చిలో అత్యంత తక్కువగా 1.9% స్థాయిలో ఐఐపీ వృద్ధి నమోదైంది. గతేడాది నవంబర్‌లో ఇది 7.6%. 2023–24 ఏప్రిల్–నవంబర్ మధ్య ఐఐపీ వృద్ధి 6.4%. అంతక్రితం ఆర్థిక సంవత్సరం అదే వ్యవధిలో వృద్ధి 5.6%. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. తయారీ రంగం వృద్ధి 1.2 శాతానికి పరిమితమైంది. అంతక్రితం నవంబర్‌లో ఇది 6.7%గా ఉంది. విద్యుదుత్పత్తి వృద్ధి కూడా 12.7% నుంచి 5.8 శాతానికి నెమ్మదించింది. మైనింగ్ రంగ ఉత్పత్తి వృద్ధి 9.7% నుంచి 6.8 శాతానికి తగ్గింది. కన్జూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి 5.4% మేర క్షీణించింది. అంతక్రితం నవంబర్‌లో 5% వృద్ధి నమోదైంది. కన్జూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి 3.6 శాతం క్షీణించింది. గత నవంబర్‌లో 10% వృద్ధి నమోదైంది. మౌలిక సదుపాయాలు/నిర్మాణ రంగ ఉత్పత్తుల విభాగం స్వల్పంగా 1.5% వృద్ధి చెందింది.



ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు సుమిత్ అర్హత

టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ అర్హత సాధించాడు. మెల్‌బోర్న్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 139వ ర్యాంకర్ సుమిత్ 6–4, 6–4తో ప్రపంచ 118వ ర్యాంకర్ అలెక్స్ మోల్కన్ (స్లొవేకియా)పై నెగ్గాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందడం సుమిత్‌కిది రెండోసారి. 2021లోనూ అతను అర్హత సాధించాడు. అలెక్స్‌తో 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సుమిత్ ఐదు ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 22 విన్నర్స్ కొట్టిన సుమిత్ నెట్ వద్ద 12 సార్లు పాయింట్లు గెలిచాడు. ఆదివారం మొదలయ్యే ప్రధాన టోర్నీ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 31వ ర్యాంకర్ బుబ్లిక్ (కజకిస్తాన్)తో సుమిత్ తలపడతాడు.

ఫైనల్లో బోపన్న ద్వయం



అడిలైడ్: కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించేందుకు భారత వెటరన్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న విజయం దూరంలో నిలిచాడు. అడిలైడ్ ఇంటర్నేషనల్ ఏటీపీ–250 టోర్నీలో బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–4, 6–4తో గొంజాలో ఎస్కోబార్ (కొలంబియా)–అలెగ్జాండర్ నెదోవ్‌యెసోవ్ (కజకిస్తాన్) జంటపై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో రాజీవ్ రామ్ (అమెరికా)–జో సాలిస్‌బరీ (బ్రిటన్)లతో బోపన్న–ఎబ్డెన్ తలపడతారు. 43 ఏళ్ల బోపన్న ఇప్పటి వరకు 24 ఏటీపీ డబుల్స్ టైటిల్స్ సాధించాడు.

'పారిస్' బెర్త్ లక్ష్యంగా...

- అమెరికాతో భారత్ తొలి మ్యాచ్
- మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ



రాంచీ: ఆసియా క్రీడల ద్వారా నేరుగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన భారత మహిళల హాకీ జట్టు... అందుబాటులో ఉన్న రెండో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. రాంచీలో నేటి నుంచి జరిగే మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో సవితా పూనియా సారథ్యంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. మొత్తం 8 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో టాప్–3లో నిలిచిన జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. గ్రూప్ 'ఎ'లో చిలీ, చెక్ రిపబ్లిక్, జర్మనీ, జపాన్... గ్రూప్ 'బి'లో భారత్, అమెరికా, న్యూజిలాండ్, ఇటలీ జట్లున్నాయి. నేడు జరిగే తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో అమెరికాతో భారత్; న్యూజిలాండ్‌తో ఇటలీ; చిలీతో జర్మనీ; చెక్ రిపబ్లిక్‌తో జపాన్ తలపడతాయి. భారత్, అమెరికా మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మొదలవుతుంది. ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

అఖిల్ పసిడి గురి

వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలు

జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పతకాల వేట కొనసాగుతోంది. శుక్రవారం భారత షూటర్లు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సొంతం చేసుకున్నారు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో అఖిల్ షెరోన్ పసిడి పతకం నెగ్గగా... ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. అఖిల్, ఐశ్వర్య ప్రతాప్, స్వప్నిల్ కుసాలేలతో కూడిన భారత జట్టు టీమ్ విభాగంలో బంగారు పతకం దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో అఖిల్ 460.2 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ఐశ్వర్య ప్రతాప్ 459 పాయింట్లతో రెండో స్థానాన్ని పొందగా... తోంగ్‌ఫాపుమ్ (థాయ్‌లాండ్; 448.8 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెలిచాడు. అఖిల్, ఐశ్వర్య ప్రతాప్, స్వప్నిల్ బృందం టీమ్ విభాగంలో 1758 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ప్రస్తుతం భారత్ 11 స్వర్ణాలు, 8 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.



భారత షూటర్లు ఐశ్వర్య ప్రతాప్ సింగ్, అఖిల్ షెరోన్, స్వప్నిల్

మళ్లీ ఓడిన టైటాన్స్

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. జైపూర్ పింక్ పాంథర్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 35–38తో పోరాడి ఓడిపోయింది. ఈ లీగ్‌లో టైటాన్స్‌కిది 11వ ఓటమి కావడం గమనార్హం. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 12 పాయింట్లు స్కోరు చేయగా... సందీప్ ధుల్, రాబిన్ 5 పాయింట్ల చొప్పున సాధించారు. జైపూర్ తరఫున అర్జున్ దేశ్వాల్ అత్యధికంగా 14 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 37–17తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. పుణేరి పల్టన్ కెప్టెన్ అస్లమ్ ముస్తఫా 10 పాయింట్లు సాధించాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో పుణేరి పల్టన్; యూపీ యోధాస్‌తో బెంగాల్ వారియర్స్ తలపడతాయి.

పాయింట్ల పట్టిక (10 PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	11	10	1	0	51
జైపూర్ పింక్ పాంథర్స్	11	7	2	2	43
దబంగ్ ఢిల్లీ	11	7	3	1	40
గుజరాత్ జెయింట్స్	12	7	5	0	39
యు ముంబా	11	6	4	1	35
హరియాణా స్టీలర్స్	11	6	4	1	34
బెంగళూరు బుల్స్	12	5	7	0	31
పట్నా పైరేట్స్	11	5	6	0	29
బెంగాల్ వారియర్స్	11	4	5	2	28
యూపీ యోధాస్	12	3	8	1	21
తమిళ్ తలైవాస్	11	3	8	0	19
తెలుగు టైటాన్స్	12	1	11	0	10

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

తొలి టి20లో పాక్ ఓటమి

46 పరుగులతో న్యూజిలాండ్ గెలుపు

ఆక్లాండ్: పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన తొలి టి20లో న్యూజిలాండ్ 46 పరుగులతో గెలిచింది. ముందుగా న్యూజిలాండ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డరైల్ మిచెల్ (27 బంతుల్లో 61; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), విలియమ్సన్ (42 బంతుల్లో 57; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... ఫిన్ అలెన్ (15 బంతుల్లో 34; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగాడు. షాహిన్ అఫ్రిది వేసిన మూడో ఓవర్లో అలెన్ తొలి ఐదు బంతుల్లో వరుసగా 6, 4, 4, 4, 6తో 24 పరుగులు రాబట్టడం విశేషం. అనంతరం పాక్ 18 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌటైంది. పాక్‌ను కట్టడి చేసిన టిమ్ సౌతీ (4/25) ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టి20ల్లో 150 వికెట్లు సాధించిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

హైదరాబాద్‌కు ఆధిక్యం

- తొలి ఇన్నింగ్స్‌లో 182/4
- మేఘాలయాతో రంజీ మ్యాచ్

షిల్లాంగ్: రంజీ ట్రోఫీ 'ప్లేట్' గ్రూప్‌లో భాగంగా మేఘాలయాతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు మొదటి రోజే ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. శుక్రవారం మొదలైన ఈ పోరులో ముందుగా మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 33.1 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ కిషన్ లింగ్డో (51) మినహా అంతా విఫలమయ్యారు. పాలకోడేటి సాకేత్ సాయిరామ్ (4/33) నాలుగు వికెట్లు పడగొట్టగా... సీవీ మిలింద్, తనయ్ త్యాగరాజన్, రవితేజ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 47 ఓవర్లలో 4 వికెట్లకు 182 పరుగులు సాధించింది. ఫలితంగా 71 పరుగుల ఆధిక్యం లభించింది. రోహిత్ రాయుడు (54 నాటౌట్), చందన్ సహాని (52) అర్ధ సెంచరీలు చేశారు.



ముంబై 281/6...

ముంబై: 'ఎలైట్' గ్రూప్‌లో ఆంధ్ర జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో శుక్రవారం ఆట ముగిసేసరికి ముంబై తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 281 పరుగులు సాధించింది. భూపేన్ లాల్వాని (61) అర్ధ సెంచరీ చేయగా... శ్రేయస్ అయ్యర్ (48), సువేద్ పార్కర్ (41) ఫర్వాలేదనిపించారు. గత మ్యాచ్‌కు దూరమై ఈసారి కెప్టెన్‌గా బరిలోకి దిగిన సీనియర్ ప్లేయర్ అజింక్య రహానే (0) తొలి బంతికే నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగడం విశేషం. నితీశ్‌కు 3, షోయబ్ మొహమ్మద్ ఖాన్‌కు 2 వికెట్లు దక్కాయి.

కెప్టెన్సీకి విహారి రాజీనామా...



ఆంధ్ర రంజీ జట్టు నాయకత్వ బాధ్యతల నుంచి సీనియర్ బ్యాటర్ హనుమ విహారి తప్పుకున్నాడు. బ్యాటింగ్‌పై పూర్తిగా దృష్టి పెట్టేందుకే కెప్టెన్సీకి రాజీనామా చేసినట్లు సమాచారం. బెంగాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో విహారి కెప్టెన్‌గా వ్యవహరించగా... అతని స్థానంలో ఈ మ్యాచ్ నుంచి రికీ భుయ్ సారథ్య బాధ్యతలు చేపట్టాడు.

సాత్విక్–చిరాగ్ జోరు

మలేసియా ఓపెన్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశం



కౌలాలంపూర్: గత ఏడాది అద్భుతమైన ఫలితాలు సాధించిన భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి కొత్త సీజన్‌లో కూడా తమ జోరు కొనసాగిస్తోంది. ప్రతిష్టాత్మక మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో సాత్విక్–చిరాగ్ ద్వయం వరుసగా రెండో ఏడాది సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంక్‌లో ఉన్న సాత్విక్–చిరాగ్ 21–11, 21–8తో ప్రపంచ 32వ ర్యాంక్‌లో ఉన్న హి జి టింగ్–రెన్ జియాంగ్ యు (చైనా)లపై విజయం సాధించారు. కేవలం 35 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సాత్విక్–చిరాగ్ ఆద్యంతం ఆధిపత్యం చలాయించారు. తొలి గేమ్‌లో వరుసగా ఏడు పాయింట్లు గెలిచిన సాత్విక్–చిరాగ్ అదే ఊపులో గేమ్‌ను దక్కించుకున్నారు. రెండో గేమ్‌లోనూ భారత జంట దూకుడు కొనసాగించింది. స్కోరు 7–3 వద్ద సాత్విక్–చిరాగ్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఏడు పాయింట్లు నెగ్గి 14–3తో ఆధిక్యంలోకి వెళ్లి వెనుదిరిగి చూడలేదు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ జంట కాంగ్ మిన్ హైక్–సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా)తో సాత్విక్–చిరాగ్ జంట తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సాత్విక్–చిరాగ్ 3–1తో ఆధిక్యంలో ఉన్నారు. మరోవైపు మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) ద్వయం పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో అశ్విని–తనీషా జంట 15–21, 13–21తో రిన్ ఇవనాగ–కీ నకనిషి (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయింది. అశ్విని–తనీషా జోడీకి 8,125 డాలర్ల (రూ. 6 లక్షల 73 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ధ్రువ్ జురేల్‌కు చోటు

ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు భారత జట్టు ప్రకటన

ముంబై: స్వదేశంలో ఇంగ్లండ్ జట్టుతో జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం తొలి రెండు టెస్టుల్లో పాల్గొనే భారత జట్టును శుక్రవారం రాత్రి బీసీసీఐ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురేల్‌కు తొలిసారి జాతీయ జట్టులో చోటు లభించింది. 22 ఏళ్ల ధ్రువ్ భారత అండర్–19 జట్టుకు ఆడటంతోపాటు ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్టు ఈనెల 25 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో... రెండో టెస్టు ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు విశాఖపట్నంలో జరుగుతాయి.



భారత టెస్టు జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా (వైస్ కెప్టెన్), గిల్, యశస్వి, కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), కేఎస్ భరత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురేల్ (వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్.





పోషకాల పిండివంటలు

సంక్రాంతికి మనం రకరకాల పిండివంటలు చేసుకుంటాం. అయితే అవన్నీ ఈ రుతువుకు తగినవనీ, శరీరానికి బలాన్నిస్తాయనే ఉద్దేశంతోనే మన పెద్దలు ఈ పండక్కి ఈ పిండివంటలను నిర్దేశించి ఉండచ్చని వీటిలోని పోషకాలను బట్టి తెలుస్తోంది. ఏయే పిండివంటల్లో ఏయే పోషకాలున్నాయో చూద్దాం.



అరిసెలు

సంక్రాంతి పండగ అనగానే ముందుగా గుర్తుకొచ్చేవి అరిసెలు. వీటిని పంచదారతో, బెల్లంతో కూడా చేస్తారు కానీ, బెల్లంతో చేసిన అరిసెలు ఆరోగ్యానికి మంచిది. వీటి తయారీలో కొత్త బియ్యపు పిండి, నూనె, బెల్లం, నువ్వులు వాడతారు. ఇందులో వాడే బెల్లం రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు శరీరంలోని వ్యర్థాలను తొలగిస్తుంది. వీటిలో కార్బోహైడ్రేట్లు, ఐరన్‌తోపాటు ఇతర పోషకాలు కూడా లభిస్తాయి.

కొబ్బరి బూరెలు

అరిసెల తరవాత అంతటి ప్రధానమైన వంటకం కొబ్బరి బూరెలు. దీంట్లో కొత్త బియ్యపుపిండి, కొబ్బరి, యాలకుల పొడి, బెల్లం వాడతారు. అరిసెలలో ఉన్న పోషకాలతో పాటు కార్బోహైడ్రేట్లు కూడా పుష్కలంగా ఈ కొబ్బరి బూరెల్లో లభిస్తాయి.

నువ్వుల ఉండలు

పరస్పరం నువ్వుల ఉండలు పంచుకోవడం సంక్రాంతి సంప్రదాయాలలో ఒకటి. మంచి బలవర్ధకమైన ఆహారం నువ్వుల ఉండలు. శీతాకాలంలో శరీరం పొడిబారిపోతూ ఉంటుంది. ఈ సమయంలో నువ్వులు ఆహారంగా తీసుకోవడం ద్వారా దానిలో ఉండే నూనె శరీరాన్ని కాంతిమంతంగా ఉండేలా దోహదం చేస్తుంది. టీనేజీ బాలికల్లో రక్తహీనతను నివారించడానికి ఉపకరిస్తుంది. శరీరంలో వేడి పుట్టించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. విటమిన్ ఎ, డి, ఇ, కెలు లభిస్తాయి. దేహదారుఢ్యానికి నువ్వుండలను మించింది లేదు.

కజ్జికాయలు

అరిసెలు అంతగా పడని వారు, అంత శ్రమ తీసుకోలేనివారు కజ్జికాయలు చేసుకుంటారు. ఇవి కొంచెం ఎక్కువ కాలం నిల్వ ఉండటంతోపాటు పిల్లలు వీటిని ఇష్టంగా తింటారు. దీనిలో కొబ్బరి, రవ్వ, పంచదార లేదా పల్లీలు, పుట్నాలు, నువ్వులతో పాటు సుగంధ ద్రవ్యాలైన యాలకులు, జీడిపప్పు వంటివి కూడా వినియోగిస్తారు. కజ్జికాయల ద్వారా శరీరానికి కావాల్సిన ప్రోటీన్స్, ఐరన్, ఖనిజ లవణాలు అందుతాయి.



జంతికలు

తియ్యటి పదార్థాలు తిన్న జిహ్వ, ఆ వెంటనే కారకారంగా ఉండే వాటిని తినాలనుకోవడం సహజం. కారపు పిండివంటల్లో జంతికలు లేదా సకినాలు ప్రధానమైనవి. బియ్యపు పిండి, శనగ పిండి, నువ్వులు, వాము ఇందులో వాడతారు. శనగపిండి, బియ్యపు పిండి కార్బోహైడ్రేట్లను, ప్రొటీన్లను అందిస్తే నువ్వులు చర్మాన్ని కాంతివంతం చేసేందుకు సహకరిస్తాయి. చిన్నపిల్లలు వీటిని ఎక్కువ తింటారు. వీటిలో వాడే వాము సుఖ విరోచనానికి తోడ్పడి.. జీర్ణ ప్రక్రియ చురుగ్గా ఉండేందుకు దోహదపడుతుంది.

సున్ని ఉండలు



బలవర్థకమైన ఆహారంలో సున్నిఉండలు మొదటిస్థానంలో ఉంటాయి. మినప పిండి, నెయ్యి, బెల్లం వాడతారు. బెల్లం రక్తాన్ని శుద్ధిచేస్తే, సున్ని, నెయ్యి ద్వారా ప్రోటీన్లు, పలు రకాల పోషకాలను, శక్తిని అందిస్తాయి. కొత్త అల్లుళ్లకు సున్ని ఉండలు కొసరి కొసరి వడ్డిస్తారు. హార్మోన్లను సమతుల్యంగా ఉంచడానికి సహకరిస్తుంది. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడేందుకు ఇవి ఎంతో తోడ్పడతాయి.

అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు. అంటే దేనిలోనూ అతి పనికి రాదు. వంటికి మంచిది కదా.. రుచిగా ఉన్నాయి కదా అని మధుమేహులు, శరీర తత్వానికి పడని వాళ్లు తగిన మోతాదులో తీసుకోవడమే ఆరోగ్యకరం అని గుర్తుంచుకోవడం మంచిది.

గారెలు

సంక్రాంతికి తప్పనిసరిగా వండుకునే వాటిల్లో గారెలు ఒకటి. కనుమ నాడు మినుము తింటే మంచిదని పెద్దలు చెబుతారు. అలాగే మినుము తిన్నవాళ్లు ఇనుములా ఉంటారని మరో సామెత. పొట్టు తియ్యని మినుముల్లో పోషకాలు చాలానే ఉంటాయి. రాను రాను పొట్టు తీసిన మినపప్పు గారెలకు వాడుతున్నారు. కానీ మినప పొట్టుతో ఉన్న గారెలే ఆరోగ్యానికి శ్రేష్ఠం. మినుములో మాంసకృత్తులతోపాటు అనేక రకాల ప్రొటీన్లు, పోషకాలు శరీరానికి లభిస్తాయి.



కరివేపాకు నమిలి పారేయండి



కరివేపాకు అనగానే కూరలో కరివేపాకు, ఉప్మాలో కరివేపాకు... కరివేపాకులా తీసిపారేస్తావేంటి... ఇలాంటి డైలాగులే గుర్తుకొస్తాయి. దానికి తగ్గట్టే కూరలోనో, పప్పులోనో, ఉప్మాలోనో వచ్చే కరివేపాకును ఏరిపారేసే ఉల్లంఘనులే ఎక్కువ. అయితే అలా కాకుండా ఉదయాన్నే ఖాళీ కడుపుతో నాలుగు కరివేపాకు రెమ్మలను నమిలితే ఎన్నో ప్రయోజనాలున్నాయంటున్నారు ఆరోగ్యనిపుణులు. అవేంటో చూద్దాం...

తీసి పారేసినా, నమిలి పారేసినా తెలుగు వారి వంటకాల్లో కరివేపాకు వాడకం సర్వసాధారణం. ఇది ఆహారానికి సువాసనను, రుచిని ఇవ్వడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. భాస్వరం, కాల్షియం, ఇనుము, రాగి, విటమిన్లు, మెగ్నీషియం వంటి పోషకాలు ఎన్నో ఉన్న కరివేపాకును రోజూ ఉదయం ఒకటి రెండు రెమ్మలను దూసి వాటిని పచ్చిగానే నమిలి తినడం వల్ల కలిగే ప్రయోజనాలు...

1. **కంటికి మంచిది:** రోజూ పరగడుపునే కరివేపాకును తీసుకోవడం వల్ల కంటిశుక్లం లేదా అనేక ఇతర కంటి వ్యాధులు వచ్చే ప్రమాదాన్ని నివారించవచ్చు.

2. **జీర్ణ వ్యవస్థకు మంచిది:** ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నాలుగైదు కరివేపాకులను నమిలి తినటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీతో సహా అన్ని ఉదర సమస్యల నుంచి ఉపశమనాన్నిస్తుంది.

3. **మధుమేహులకు మంచి మందు** పచ్చి కరివేపాకును నమలడం మధుమేహులకు చాలా మంచిది.

4. **ఇమ్యూనిటీ బూస్టర్** కరివేపాకులో యాంటీ ఫంగల్, యాంటీబయాటిక్ లక్షణాలు ఉండటం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడి ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది.

5. **బరువును అదుపు చేస్తుంది:** కరివేపాకును నమలడం వల్ల బరువు తగ్గడంతోపాటు పొట్ట తగ్గుతుంది.

6. అతిసార, అజీర్తితో బాధపడుతున్న వారు భోజనం తర్వాత రెండు మూడు కరివేపాకులను తింటే ఆ సమస్యలు దూరమవుతాయి.



ఎన్ని ప్రయోజనాలున్నాయో చూశారు కదా మరి!

పిల్లలకు ఈ ఆరూ అలవాటు చేశారా?

జీవితాన్ని సఫలం చేసుకోవడానికి ఒక్కొక్కరు ఒక్కోవిధమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. ఆ లక్ష్యాలను అందుకోవడం కోసం రకరకాల ప్రణాళికలు వేసుకుంటారు. అయితే కేవలం లక్ష్యాలు, ప్రణాళికలు మాత్రమే ఉంటే సరిపోదు. వాటిని సరిగా... సక్రమంగా అమలు చేస్తేనే కదా అనుకున్న వాటిని సాధించగలిగేది! జీవితంలో విజయం సాధించిన కొందరు వ్యక్తుల్లో సర్వసాధారణంగా కనిపించే కొన్ని మంచి అలవాట్ల గురించి తెలుసుకుందాం. వాటిని పిల్లలకు అలవరచే ప్రయత్నం చేద్దాం.

1. ప్రణాళిక... జీవితంలో ఏం సాధించాలనుకున్నా, దానికి ఒక ప్రణాళిక అవసరం. అంతేకాదు, ఆ ప్రణాళికకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే కదా దానిని అమలు చేయగలిగేది!

2. విశ్రాంతి... కొందరు లక్ష్యాలు ఏర్పాటు చేసుకుంటారు. కానీ ఒత్తిడితో ఉక్కిరి బిక్కిరి అవుతుంటారు. అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకోవడం ద్వారా కొత్త ఉత్సాహం పుంజుకుంటుంది. అప్పుడే లక్ష్యాల మీద ఆసక్తి పెరుగుతుంది.

3.ప్రణాళికలను అమలు పరచడం... కేవలం లక్ష్యాలు, ప్రణాళికలు ఉంటే సరిపోదు. వాటిని సరిగా అమలు చేయాలి. అంటే వాటిమీద పనిచేయాలి.

4. వ్యక్తిగత శ్రద్ధ... మనం ఎన్ని లక్ష్యాలు పెట్టుకున్నా వాటిని సాధించే క్రమంలో వ్యక్తిగత శ్రద్ధ అనేది అవసరం. శారీరక, మానసిక ఆరోగ్యాలకు ప్రాముఖ్యత ఇవ్వడం, వీలైనంతగా వ్యాయామం చేయడం ద్వారా తమ శరీరం మీద శ్రద్ధ చూపగలుగుతారు.

5. సానుకూల దృక్పథం... కొందరిలో పాజిటివ్ యాటిట్యూడ్ తక్కువగా ఉంటుంది. తమ లక్ష్యాలపై తమకే నమ్మకం ఉండదు. అలా కాకుండా అనుకున్నది సాధిస్తామనే నమ్మకంతో ముందుకి సాగితే లక్ష్యాలను సాధించడానికి అది ఎంతో సహాయకారిగా ఉంటుంది.

6. నెట్ వర్కింగ్... ఇది విజయం సాధించడంలో ఎంతో సహకరిస్తుంది. ఇతరులతో మన ఆలోచనలు, అభిప్రాయాలు పంచుకోవడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకోగలుగుతాం. కొందరి ఐడియాలు మనం విజయం సాధించడానికి ఎంతగానో సహకరిస్తాయి.



ఈ ఆరు అలవాట్లు చాలామంది విజయం సాధించిన వ్యక్తుల్లో కనిపిస్తాయి. ఈ లక్షణాలు మనకు లేవని కానీ, మనం అలవరచుకునే సమయం లేదని కానీ బాధపడనక్కరలేదు. కనీసం మన పిల్లలైనా వాటిని అలవరచుకునేలా చూస్తే మన కళ్లముందు వారు ఎత్తుకు ఎదగడం, విజయపథంలో పయనించడం కూడా మనకు సంతోషకరమే కదా!


సినిమా

హిట్ డేట్ సెట్


● ప్రభాస్

ఈ వేసవిలో థియేటర్స్‌కు వస్తున్నాడు కల్కి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకోన్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రధారులు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ– ''యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న మా వైజయంతీ నిర్మాణ సంస్థలో 'కల్కి 2898 ఏడీ' స్పెషల్ ఫిల్మ్. అలాగే మా ప్రయాణంలో మే 9కి ప్రాముఖ్యత ఉంది. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' నుంచి అవార్డులు గెలుచుకున్న 'మహానటి', 'మహర్షి' సినిమాలు ఈ తేదీలో విడుదలై, చరిత్రలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నాయి. ఇప్పుడు 'కల్కి 2898 ఏడీ' విడుదల ఒక ప్రత్యేక ముద్ర వేసుకుంటుంది'' అని పేర్కొన్నారు.

అలా అనుకుని ఉంటే శివ.. అన్నమయ్య వచ్చేవి కావు
- నాగార్జున



''నా సామిరంగ' సినిమా కథలోని ప్రేమ, స్నేహం, త్యాగం, ద్వేషం వంటి నాలుగు అంశాలు నాకు బాగా నచ్చాయి. కథలో ఇవే మూల స్తంభాలు. భోగి, మకర సంక్రాంతి, కనుమ.. ఇలా మూడు రోజుల సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు హీరో నాగార్జున. ఆయన హీరోగా, ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించారు. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, మిర్నా మీనన్, రుక్సార్ ఖిల్లాన్ కీలక పాత్రధారులు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా రేపు (ఆదివారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున చెప్పిన విశేషాలు.

● 'నా సామిరంగ' సినిమా షూటింగ్ 72 రోజులు జరిగితే నా భాగం 60 రోజుల్లో పూర్తి చేశారు. ప్రీ ప్రొడక్షన్ పనులకు 5 నెలలు పట్టింది. సినిమాను త్వరగా పూర్తి చేయాలనుకుంటే తప్పులు ఎక్కువ అవుతాయి. ప్రీ ప్రొడక్షన్ వర్క్ పక్కాగా చేసుకుంటే ఎవరికైనా ఇంత వేగంగా పూర్తి చేయడం సాధ్యపడుతుంది. పైగా కీరవాణిగారు షూటింగ్‌కి ముందే మూడు పాటలు, ఫైట్ సీక్వెన్స్‌కి నేపథ్య సంగీతం చేశారు. ఇంత వేగంగా, భారీ బడ్జెట్‌లో సినిమా చేశామంటే దానికి కీరవాణిగారు ఒక కారణం. ఇందులోని ఏడు పాటలూ అద్భుతంగా ఉంటాయి. ● మనకి సంక్రాంతి పెద్ద పండగ. పైగా ఇది 1980 నేపథ్యంలో జరిగే కథ. తెలుగు తెరపై తొలి సారి సంక్రాంతి ప్రభల తీర్థం నేపథ్యాన్ని తీసుకొస్తున్నాం. ఇది పేరుకే మలయాళ రీమేక్. తెలుగు ప్రేక్షకులకు తగినట్లు కథలో మార్పులు, చేర్పులు చేశారు. ఈ క్రెడిట్ దర్శకుడు విజయ్ బిన్నీకి, రచయిత ప్రసన్నకుమార్ బెజవాడకి దక్కుతుంది. విజయ్ బిన్నీ కొరియోగ్రఫీ చేసిన పాటలు చూశాను. పాటలోనే కథని చెప్పే నేర్పు తనలో ఉంది. స్పష్టత ఉన్న దర్శకుడు.. చెప్పింది చెప్పినట్టు తీశాడు. ● ఈ సినిమాలో నా ఊతపదం నా సామిరంగ. సినిమా మొత్తం 2 గంటల 35 నిమిషాలు వచ్చింది. అందులో 15 నిమిషాలు కట్ చేయడానికి కష్టపడ్డాం.. ఎందుకంటే ప్రతి సీన్ ముఖ్యమైనదిగానే కనిపించింది. నా ప్రతి సినిమానీ ఎడిటింగ్ జరిగాక చూస్తా. అవసరం అనుకుంటే సలహా ఇస్తాను.. కావాలని మార్పులు చెప్పను. అలా చెబితే వాళ్ల క్రియేటివిటీని తక్కువ చేసినట్లవుతుంది. కథకు అవసరం కాబట్టి ఈ మూవీలో చాలా రోజుల తర్వాత మాస్ లుక్‌లో కనిపించాను. ● ఈ చిత్రంలో కిష్టయ్య పాత్రలో కనిపిస్తాను. సినిమాలో నాకు, ఆషికాకి మధ్య 12 ఏళ్ల నుంచి ఒక ప్రేమకథ నడుస్తుంది. చాలా వైవిధ్యమైన ప్రేమకథ ఇది. ఈ మూవీలో సోదర భావం ఉన్న పాత్రకు 'అల్లరి' నరేశ్ సరిపోతాడనిపించి తీసుకున్నాం. రాజ్ తరుణ్‌ది కీలకమైన పాత్రే. అలాగే మిర్నా, రుక్సార్‌ల పాత్రలూ బాగుంటాయి. ● సంక్రాంతికి ఎక్కువ సినిమాలు ఉండటంతో మేం అనుకున్నన్ని థియేటర్లు దొరకలేదు. 'సోగ్గాడే చిన్నినాయనా' అప్పుడూ ఇదే సమస్య. ఆ సినిమాను 300 థియేటర్లలో విడుదల చేశాం. ఇప్పుడు 'నా సామిరంగ' కూడా 300 థియేటర్లలో విడుదలవుతోంది. ● నా నూరవ సినిమా స్టార్ హీరోతో కలిసి మల్టీస్టారర్‌గా చేయాలనే ఆలోచన లేదు. కెరీర్‌లోని మైలురాయి సినిమాలు స్టార్ హీరోలతో కలిసి చేయాలనుకుని ఉంటే నా నుంచి 'శివ, అన్నమయ్య, నిన్నే పెళ్లాడతా' వంటి సినిమాలు వచ్చేవి కావు. వెబ్ సిరీస్ ఆఫర్లు వస్తున్నాయి. రొటీన్‌గా ఉండటంతో చేయడం లేదు. నాగచైతన్యకి వచ్చిన 'దూత' లాంటి కథ కుదిరితే చేస్తాను. నేను, నాగచైతన్య, అఖిల్ కలిసి మల్టీ స్టారర్ చేయాలనే ఆలోచన ప్రస్తుతానికి లేదు. నేను, మహేశ్‌బాబు కలసి నటించి, నాగేశ్వర రావు–కృష్ణగార్ల వారసత్వాన్ని కొనసాగించాలని గతంలో ట్వీట్ చేశాను. రాజమౌళిగారి సినిమాని మహేశ్ పూర్తి చేశాక దాని గురించి ఆలోచించాలి (నవ్వుతూ) ● నా తర్వాతి సినిమా శేఖర్ కమ్ములగారి దర్శకత్వంలో ఉంటుంది. తమిళ డైరెక్టర్ నవీన్‌తో ఓ సినిమా ఉంది. డైరెక్టర్ అయాన్ ముఖర్జీ 'వార్ 2' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. అది పూర్తయ్యాక 'బ్రహ్మాస్త్ర 2' మొదలు పెట్టే చాన్స్ ఉంది.

ఫైటర్స్ డైరెక్షన్‌లో...


● కమల్‌హాసన్

ఏడు పదుల వయసులోనూ కమల్‌హాసన్ మాంచి జోరు మీద ఉన్నారు. వరుస సినిమాలు సైన్ చేస్తూ కుర్ర హీరోలతో పోటీ పడుతున్నారు. ఇప్పటికే దర్శకుడు శంకర్‌తో 'ఇండియన్ 2' చేస్తున్నారు. మణిరత్నంతో 'థగ్ లైఫ్', హెచ్. వినోద్ దర్శకత్వంలో సినిమాలు కమిట్ అయ్యారు. అలాగే ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ'లో కీ రోల్ చేస్తున్నారు. ఈ సినిమాలన్నీ చేతిలో ఉండగానే శుక్రవారం తన కెరీర్‌లోని 237వ సినిమాను ప్రకటించారు కమల్‌హాసన్. ఈ సినిమాతో ఫైట్ మాస్టర్స్ ద్వయం అన్బు మణి, అరివు మణిలను దర్శకులుగా పరిచయం చేస్తున్నారు కమల్. ''రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్‌నేషనల్ సంస్థలో మరోసారి అన్బు, అరివులకు స్వాగతం. ఈసారి దర్శకులుగా కొత్త బాధ్యతలు తీసుకోనున్నారు. 2025లో ఈ సినిమా చిత్రీకరణ మొదలుపెడతాం'' అన్నారు కమల్.

ఓటింగ్ ఆరంభం



ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. 96వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 10న లాస్ ఏంజెల్స్‌లో జరగనుంది. కాగా ఓటింగ్ ప్రక్రియను శుక్రవారం మొదలుపెట్టినట్లు ఆస్కార్ అకాడమీ వెల్లడించింది. జనవరి 12న మొదలైన ఈ ఓటింగ్ జనవరి 16 సాయంత్రం 5 గంటల వరకు సాగుతుంది. ఆస్కార్ అకాడమీలో పదివేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ వారికి కేటాయించిన విభాగాల్లోని వారికి ఓటు వేస్తారు. అకాడమీలో సభ్యులుగా ఉన్న యాక్టర్స్ యాక్టింగ్ విభాగానికి మాత్రమే ఓటు వేస్తారు. అలాగే మిగతా విభాగాల వారు కూడా. 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డుల విజేతలను ప్రకటిస్తారు. అయితే 'ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్', 'డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్', 'డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్' విభాగాలకు చెందిన ఓటింగ్‌కు మాత్రం ప్రత్యేకమైన నిబంధనలు ఉంటాయట. ఈ నెల 23న ఆస్కార్ నామినేషన్స్‌ను ప్రకటిస్తారు. ఇప్పటికే పది విభాగాల్లోని షార్ట్ లిస్ట్ జాబితాను ప్రకటించారు ఆస్కార్ నిర్వాహకులు.

తొలిసారి అలాంటి అనుభూతి దక్కింది


● అమృత

''హను–మాన్' సినిమా ప్రేక్షకులకు నచ్చాలనే లక్ష్యంతోనే యూనిట్ అంతా పని చేశాం. ఆడియన్స్‌తో కలిసి ఈ సినిమా చూశాను. వారి స్పందన చూస్తుంటే గూస్ బంప్స్ వచ్చాయి. నా కెరీర్‌లో తొలిసారి అలాంటి అనుభూతి దక్కింది'' అని హీరోయిన్ అమృతా అయ్యర్ అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను–మాన్'. శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజైంది. ఈ సందర్భంగా అమృతా అయ్యర్ మాట్లాడుతూ– ''ప్రశాంత్ వర్మగారు 'హను–మాన్'ని అద్భుతంగా తీశారు. ఈ మూవీలో మీనాక్షి పాత్రని చక్కగా చేశావని ప్రేక్షకులు చెబుతుంటే హ్యాపీగా ఉంది. ఈ మూవీ జర్నీలో సహనంగా ఉండటం నేర్చుకున్నాను.. నటీనటులకు సహనం చాలా ముఖ్యం. 'హను–మాన్ 2' ఉంటుందని నాకూ తెలియదు. స్క్రీన్‌పై చూసి, సర్‌ప్రైజ్ అయ్యాను. ప్రస్తుతం తెలుగులో 'అల్లరి' నరేశ్‌కి జోడీగా ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు.

కెప్టెన్ మిల్లర్ రెడీ


● ప్రియాంక, ధనుష్

ధనుష్ టైటిల్ రోల్‌లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రల్లో నటించారు. టీజీ త్యాగరాజన్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించిన ఈ చిత్రం తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 12న విడుదలైంది. తెలుగు వెర్షన్ ఈ నెల 25న విడుదల కానుంది. ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలు 'కెప్టెన్ మిల్లర్' సినిమాను తెలుగులో విడుదల చేయనున్నాయి.

ఫిబ్రవరిలో తిరగబడరా!


● రాజ్ తరుణ్, మాల్వీ

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా నటించిన చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఫిబ్రవరి 23న సినిమా రిలీజ్ కానుంది. ''పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం 'తిరగబడర సామీ'. యువతని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. నటి మన్నారా చోప్రా ఈ చిత్రంలో ఓ విభిన్నమైన పాత్రతో పాటు ప్రత్యేక గీతంతో అలరించనున్నారు. ఈ చిత్రానికి యువతని ఉర్రూతలూగించే పాటలు, అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు సంగీత దర్శకుడు జేబీ'' అని చిత్రబృందం పేర్కొంది.

వెండితెర సౌరవ్


● ఆయుష్మాన్ ఖురానా

భారత మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ బయోపిక్ గురించి కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. వెండితెర సౌరవ్‌గా రణ్‌బీర్ కపూర్, రణ్‌వీర్ సింగ్, ఆయుష్మాన్ ఖురానాల పేర్లు వినిపించాయి. అయితే ఆయుష్మాన్ ఖురానా దాదాపు ఖరారై పోయారని, త్వరలో క్రికెట్ శిక్షణను మొదలుపెడతారని బాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న తాజా మాట. హిందీలో 'ఉడ్డాన్', 'ట్రాప్డ్', 'భవేష్ జోషి సూపర్ హీరో' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన విక్రమాదిత్య మొత్వాని ఈ బయోపిక్‌ను తెరకెక్కించనున్నారు. ఈ సినిమాను లవ్ రంజన్, అంకుర్ గార్గ్ నిర్మించనున్నారట. మరి.. సౌరవ్ పాత్రలో ఆయుష్మాన్ ఖురానా కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.